సంపుటి 6, సంచిక 16

ఫిబ్రవరి 16 - 28, 2026

ఉచిత పంపిణీ కోసం

# న్యూ ఇండియా సమాచార్



కేంద్ర బడ్జెట్

2026-27

## వికసిత్ భారత్

### దిశగా నిర్ణయాత్మక అడుగు

సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై ప్రయాణం చేస్తున్న భారత్ 2026-27 కేంద్ర బడ్జెట్ ద్వారా కొత్త శక్తిని, తాజా ఉత్తేజాన్ని పొందింది.

ఇ-కాపీ కోసం



# ప్రజా భాగస్వామ్యం, సంఘటిత స్ఫూర్తి : దేశానికి పెద్ద బలం

***అజాం గఢ్ కావచ్చు, అనంతపురం కావచ్చు లేదా దేశంలోని ఏ ఇతర ప్రాంతమైనా కావచ్చు...విధి నిర్వహణ లక్ష్యంతో ప్రజలు ఐక్యంగా కదిలి భారీ సంకల్పాలు నెరవేర్చేందుకు ముందుకు వస్తున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 సంవత్సరానికి తొలి "మన్ కీ బాత్" కార్యక్రమంలో ప్రజాస్వామ్యంలో ఓటింగ్ ప్రాధాన్యత, ఏఐ, చిరుధాన్యాలు, భారతదేశ పండుగల సంస్కృతి, స్టార్టప్‌లు సహా పలు అంశాలను చర్చించారు. అందులోని ప్రధానాంశాలు...***

- **యువత ఓటర్లు కావాలి:** 18 సంవత్సరాల వయసు నిండగానే ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని నా యువ స్నేహితులను కోరుతున్నాను. రాజ్యాంగం తమపై పెట్టిన బాధ్యతను నెరవేర్చగలిగే మార్గం ఇది. దీని వల్ల భారత ప్రజాస్వామ్యం కూడా బలోపేతం అవుతుంది.

- **స్టార్టప్‌లు:** భారతదేశం నేడు ప్రపంచంలో మూడో పెద్ద స్టార్టప్ దేశంగా మారింది. ఈ స్టార్టప్‌లు సాంప్రదాయానికి అతీతంగా ఆలోచిస్తున్నాయి. 10 సంవత్సరాల క్రితం కనీసం ఊహలో అయినా ఆలోచించని రంగాల్లో కృషి చేస్తున్నాయి.

- **భారతీయ ఉత్పత్తులు నాణ్యతలో ఉన్నతంగా ఉండాలి:** నాణ్యత, నాణ్యత...కేవలం నాణ్యతే మన మంత్రం కావాలి. నిన్నటి కన్నా నేడు మెరుగైన నాణ్యత అందించాలి. మనం తయారుచేసే ఏ వస్తువులో అయినా నాణ్యతను మెరుగుపరచాలన్న సంకల్పం స్వీకరించాలి. టెక్స్‌టైల్స్, టెక్నాలజీ లేదా ఎలక్ట్రానిక్స్ వస్తువులు, చివరికి ప్యాకేజింగ్ సహా ఏ భారతీయ ఉత్పత్తి అయినా "అత్యున్నత నాణ్యత" గలది అయి ఉండాలి.

- **ప్రజా భాగస్వామ్యం:** అజాంగఢ్‌లో ప్రజలు తమసా నదికి నూతన జీవం కల్పించారు. అనంతపురంలో ప్రజలందరి ఉమ్మడి భాగస్వామ్యంలో 10 రిజర్వాయర్లను పునరుద్ధరించారు. ప్రజలందరూ సంఘటితంగా కదులుతూ బాధ్యతాయుత వైఖరితో భారీ సంకల్పాలు నెరవేర్చడం ఆనందం కలిగిస్తోంది. ఈ ప్రజా భాగస్వామ్య స్ఫూర్తి, సంఘటిత కార్యాచరణే మన దేశానికి పెద్ద బలం.

- **యువత, అంకిత భావం:** శతాబ్దాలుగా భజనలు, కీర్తనలు మన సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయి. దేవాలయాల్లో మనం ఈ భక్తిగీతాలు వింటూ ఉంటాం. ప్రతీ తరం తమదైన మార్గంలో ఈ భక్తి భావాన్ని అనుభవిస్తూ ఉంటుంది. నేటి తరం సైతం ఒక అద్భుత భావాన్ని అనుభవిస్తోంది. వారు భక్తి భావాన్ని తమ అనుభవం, జీవనశైలిలో భాగంగా మార్చుకుంటున్నారు.

- **కుటుంబ సంవత్సరం:** కుటుంబ వ్యవస్థ మన సాంప్రదాయంలో అంతర్భాగం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు దీన్ని ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాయి. చాలా దేశాలు కుటుంబ వ్యవస్థను అమిత గౌరవ భావంతో చూస్తున్నాయి. 2026 సంవత్సరాన్ని తమ దేశంలో కుటుంబ సంవత్సరంగా పాటిస్తున్నామని యుఏఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ నాకు చెప్పారు.

- **ఏక్ పేడ్ మా కే నామ్:** దేశవ్యాప్తంగా ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారం సాగిస్తున్నారు. కోట్లాది మంది ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు. ఈ ప్రచారం కింద ఇప్పటివరకు 200 కోట్లకు పైగా మొక్కలు నాటారు. ప్రజలు ఇప్పుడు పర్యావరణం పట్ల మరింత చైతన్యం కలిగి ఉన్నారనేందుకు ఇది సంకేతం.

- **శ్రీ అన్న (చిరుధాన్యాలు):** ప్రజల్లో చిరుధాన్యాల పట్ల ఆదరణ నిరంతరం పెరుగుతోందని చెప్పడానికి నేనెంతో ఆనందిస్తున్నాను. మనం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినా మూడు సంవత్సరాల తర్వాత నేడు కూడా దేశంలో వాటి పట్ల ఆసక్తి, కట్టుబాటు అత్యంత ప్రోత్సాహకరంగా ఉంది.

- **ఏఐ ప్రపంచం :** ఫిబ్రవరిలో ఇండియా ఏఐ ప్రభావ సదస్సు జరుగుతోంది. ప్రపంచం నలుమూలల నుంచి నిపుణులు... ప్రత్యేకించి టెక్నాలజీ రంగ ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొనేందుకు దేశానికి వస్తున్నారు. ఏఐ ప్రపంచంలో భారతదేశ పురోగతిని, విజయాలను ఈ సదస్సు ప్రపంచానికి చాటి చెబుతుంది.

*మన్ కీ బాత్ కోసం ఈ క్యుఆర్ కోడ్ స్కాన్ చేయండి.*

# న్యూ ఇండియా సమాచార్

సంపుటి 6, సంచిక 16 | ఫిబ్రవరి 16-28, 2026



సంపాదకులు

ధీరేంద్ర ఓఝా

ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్,

పత్రికా సమాచార కార్యాలయం,

న్యూఢిల్లీ

సీనియర్ కన్సల్టింగ్ ఎడిటర్

సంతోష్ కుమార్

సీనియర్ అసిస్టెంట్ కన్సల్టింగ్ ఎడిటర్

పవన్ కుమార్

అసిస్టెంట్ కన్సల్టింగ్ ఎడిటర్స్

అఖిలేష్ కుమార్

చందన్ కుమార్ చౌదరి

లాంగ్వేజ్ ఎడిటర్లు

సుమిత్ కుమార్ (ఇంగ్లీష్)

రజనీశ్ మిశ్రా (ఇంగ్లీష్)

నదీమ్ అహ్మద్ (ఉర్దూ)

సీనియర్ డిజైనర్

ఫూల్ చంద్ తివారీ

డిజైనర్స్

అభయ్ గుప్తా

సత్యమ్ సింగ్




13 భాషల్లో అందుబాటులో ఉన్న 'న్యూ ఇండియా సమాచార్' చదవటానికి ఈ కింది లింక్ క్లిక్ చేయండి

https://newindiasamachar.pib.gov.in/news.aspx

'న్యూ ఇండియా సమాచార్' పాత సంచికలను చదవటానికి ఈ కింది లింక్ క్లిక్ చేయండి:

https://newindiasamachar.pib.gov.in.archive.aspx

'న్యూ ఇండియా సమాచార్' పై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు 'X' లో @NISPIBIndiaను అనుసరించండి.

## లోపలి పేజీల్లో...




ముఖపత్ర కథనం — కేంద్ర బడ్జెట్ 2026-27

అభివృద్ధి చెందిన భారత్ కల సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా బలమైన పునాది వేసింది. ఇప్పుడు 2026-27 కేంద్ర బడ్జెట్ అభివృద్ధి చెందిన భారత్ నిర్ణయాత్మక సంకల్పం నెరవేర్చగల చిహ్నంగా మారింది. ప్రస్తుతం మనం పయనిస్తున్న ఈ అమృత కాలంలో ప్రతిపాదించిన ఈ సార్వత్రిక బడ్జెట్ అభివృద్ధి, విశ్వాసం, భవిష్యత్తుల సంగమంగా స్వయం-సమృద్ధ భారత్ సాధనకు శక్తిమంతమైన మాధ్యమంగా నిలుస్తుంది. | 16-36




పరీక్ష సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని చర్చిస్తూ, విద్యార్థులు పరీక్షలను పండుగల జరుపుకునేలా ప్రోత్సహించడం లక్ష్యంగా 2018 లో ప్రారంభించబడిన 'పరీక్ష పే చర్చ' కార్యక్రమం ప్రతి సంవత్సరం కొత్త మైలురాళ్లను సృష్టిస్తోంది. | 8-11

పద్మ అవార్డులు 2026



ప్రజా పద్మాల సిసలైన స్ఫూర్తితో నూతన సాంప్రదాయానికి అనుగుణంగా

నిస్వార్థ కర్మయోగులకు పద్మ అవార్డులు

దేశంలో సానుకూల దృక్పథాన్ని వ్యాపింపచేసిన, మానవతాపూర్వకమైన సేవలందించిన యోధులు నేడు పద్మ అవార్డులు అందుకుంటున్నారు. | 37-39


**సంక్షిప్త సమాచారం** | 4-5

**వ్యక్తిత్వం : బుధు భగత్**
లర్కా తిరుగుబాటు యోధుడు | 6

**కేంద్ర కేబినెట్ నిర్ణయాలు**
2030-31 వరకు అటల్ పెన్షన్ యోజన పొడిగింపు | 7

**రాష్ట్రపతి ప్రసంగం**
సత్పరిపాలన పటిష్ఠతకు ఉమ్మడి కట్టుబాటు | 12-15

**కేరళలో అభివృద్ధి, ఉపాధి కల్పనకు ఉత్తేజం**
పిఎం స్వనిధి క్రెడిట్ కార్డ్ కింద కొత్త చొరవలు | 40-41

**సాధు సంతుల సాంప్రదాయం, వారసత్వంతో కొత్త తరం అనుసంధానం**
విమానాశ్రయానికి "శ్రీ గురు రవిదాస్ మహరాజ్ జీ" పేరు | 42-43

**వింగ్స్ ఇండియా 2026**
నేడు భారత్‌లో ప్రతీ ఒక్కరికీ విమానయానం | 44-45

**16వ జాతీయ ఓటర్ల దినోత్సవం**
ప్రజాస్వామ్యానికి ప్రపంచ వాక్కు | 46-47

**రోజ్‌గార్ మేళాలో జాతి నిర్మాణానికి ఆహ్వానం**
61,000 నియామక పత్రాలు అందజేత | 48-49

**పరాక్రమ్ దివస్**
జాతీయ చైతన్య వేడుక | 50-51

**విశ్వసనీయత, క్రమశిక్షణ గల యువశక్తి**
వార్షిక ఎన్‌సిసి పిఎం ర్యాలీలో పిఎం మోదీ ప్రసంగం | 52-53

**ఇండియా ఎనర్జీ వీక్ 2026**
ఇంధన భద్రతే కాదు...ఇప్పుడు స్వయం-సమృద్ధికి ఉద్యమం | 54-55

**భారత్‌లో యుఏఇ అధ్యక్షుని పర్యటన**
అభివృద్ధిని వేగవంతం చేసే వ్యూహాత్మక భాగస్వామ్యం | 56-57

**భారత-ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం**
భారత-యూరోపియన్ యూనియన్ సంబంధాల్లో నవశకం | 58-60



**Published:** Kanchan Prasad, Director General, on behalf of Central Bureau of Communication
**Communication Address :** Room No–1077, Soochna Bhawan, CGO Complex, New Delhi -110003.
**E-Mail :** response-nis@pib.gov.in, **RNI No. :** DELENG/2020/78811

# సంపాదకీయం...

## కేంద్ర బడ్జెట్ 2026-27
## వికసిత్ భారత్ ఆకాంక్షతో ప్రజా బడ్జెట్

**నమస్కారం. ,**

2026 ఫిబ్రవరి 1వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్ 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారం చేసుకునే దిశగా రూపొందించిన దార్శనిక, సమ్మిళిత బడ్జెట్. నేడు భారతదేశం ప్రపంచంలో అమిత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. భారత్‌ను ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దే దిశగా సాగిన విశేషమైన ప్రయత్నం ఈ బడ్జెట్ అని చెప్పవచ్చును. స్వయం-సమృద్ధ భారత్ కల సాకారం చేసే దిశలో పలు చర్యలు ఈ బడ్జెట్లో ఉన్నాయి.

కేంద్ర బడ్జెట్ 2026-27 మూడు ప్రధాన లక్ష్యాలను ప్రకటించింది. ఆర్థిక వృద్ధిలో వేగం పెంచడం అందులో మొదటిది. ఈ లక్ష్యం కింద ప్రతిపాదించిన భారత్‌ను బయోఫార్మా తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడం కావచ్చు లేదా ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 ఆవిష్కారం కావచ్చు అన్నీ దేశంలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠమైన చర్యలే. దేశంలో ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ పథకానికి బడ్జెట్‌ను రూ.40,000 కోట్లకు పెంచాలని కేంద్ర బడ్జెట్ 2026-27 ప్రతిపాదించింది. అలాగే అరుదైన ఖనిజాల తవ్వకం, ప్రాసెసింగ్, పరిశోధన, తయారీని ప్రోత్సహించేందుకు ప్రత్యేకమైన రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటును కూడా బడ్జెట్లో ప్రతిపాదించారు. రసాయనాల రంగంలో స్వయం-సమృద్ధి సాధనకు మూడు కెమికల్ పార్కుల ఏర్పాటును కూడా ప్రతిపాదించారు. అంతే కాదు...అయిదు సంవత్సరాల కాలంలో రూ.10,000 కోట్ల పెట్టుబడితో కంటైనర్ తయారీ పథకాన్ని కూడా ప్రతిపాదించారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం, సామర్థ్యాల విస్తరణ బడ్జెట్లో ప్రకటించిన రెండో లక్ష్యం. ఇందులో భాగంగా యువతను సాధికారం చేయడం ధ్యేయంగా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యాల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే భారత్ విస్తరణ ఏఐ టూల్ వంటి పనులకు కేటాయింపుల ద్వారా రైతుల ప్రయోజనాలకు బడ్జెట్ పెద్ద పీట వేసింది. మహిళలను సాధికారం చేసి, మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జి) ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు షి మార్ట్‌లను ప్రతిపాదించారు. అలాగే ఆరెంజ్ ఆర్థిక వ్యవస్థ (మేధో సంపత్తి, సృజనాత్మకత, సంస్కృతి ఆధారిత రంగాలు) అభివృద్ధి, కంటెంట్ సృష్టిని ప్రోత్సహించేందుకు 15,000 పాఠశాలలు, 500 కళాశాలల్లో ఎవిజిసి (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) కంటెంట్ క్రియేటర్ లాబ్‌ల ఏర్పాటుకు చర్యలు కూడా బడ్జెట్లో ప్రతిపాదించారు. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్" నినాదంకు అనుగుణంగా రూపొందించిన ఈ బడ్జెట్ రైతుల ఆదాయం పెంపు, దివ్యాంగుల సాధికారత, మానసిక ఆరోగ్యం-ట్రామా కేర్‌కు ప్రత్యేక ప్రాధాన్యం, పూర్వోదయ (తూర్పు భారతం) వికాసం, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధిని తృతీయ ప్రాధాన్యతాంశాలుగా ప్రతిపాదించింది. ఇన్ని ప్రాధాన్యతలున్న కేంద్ర బడ్జెట్ 2026-27ను ఈ సంచికలో ముఖపత్ర కథనంగా ప్రచురిస్తున్నాం.


వ్యక్తిత్వ విభాగంలో లర్కా తిరుగుబాటు యోధుడు బుధు భగత్ జీవిత చరిత్రను పొందుపరిచాం. పార్లమెంటులో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రసంగం, పద్మ అవార్డులు 2026, గత 15 రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమాలు, కేంద్ర కేబినెట్ నిర్ణయాలు ఈ సంచికలోని ఇతర ప్రధానాంశాలు. ఇవి కాకుండా లోపలి కవర్ పేజీలో మన్ కీ బాత్, వెనుక కవర్ పేజీపై బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం వివరాలు ఇతర ఆకర్షణలు.

***మీ అమూల్యమైన సలహాలు పంపుతూ ఉండండి.***

(ధీరేంద్ర ఓఝా)

**హిందీ, ఇంగ్లీష్ తో పాటు 11 ఇతర భాషల్లో పత్రికను ఇక్కడ చదవండి/డౌన్ లోడ్ చేసుకోండి.**
*https://newindiasamachar.pib.gov.in/*

# మెయిల్ బాక్స్




### పథకాలు, విజయాలపై విశ్వసనీయ సమాచారం

న్యూ ఇండియా సమాచార్ పత్రిక నేను క్రమం తప్పకుండా చదువుతాను. ప్రభుత్వ పథకాలు, విజయాలపై పత్రిక విశ్వసనీయ సమాచారం అందిస్తుంది. వర్తమాన అంశాలపై (కరెంట్ అఫైర్స్) గురించి కూడా తాజా సమాచారం పొందేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంది. సమాజంలోని విభిన్న వర్గాలకు సంబంధించిన వేర్వేరు అంశాపై ఎంతో ఉపయుక్తమైన సమాచారం  ఈ పత్రిక అందిస్తుంది.

**శ్రీనివాస్ ఉర్గొండ**
srinivasuragonda7@gmail.com

### అభివృద్ధి కార్యకలాపాలకు చెందిన సమాచారం అందిస్తుంది

కేంద్రప్రభుత్వ నిర్వహణలోని పథకాలు, కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు న్యూ ఇండియా సమాచార్ పత్రిక చక్కని మాధ్యమంగా నిలుస్తోంది. ఇది ఎంతో విశ్వసనీయమైన పత్రిక. దేశంలో అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, పథకాల గురించి తెలుసుకునేందుకు ఇది నాకు ఎంతో సహాయకారిగా ఉంది.

mhqchoutuppal@gmail.com

### ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుతోంది

ఎంతో విశిష్టమైన సమాచారం అందించే పత్రిక ప్రచురిస్తున్నందుకు న్యూ ఇండియా సమాచార్ టీమ్ అందరికీ ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. పౌరులకు చక్కని సమాచారం అందించాలన్న ప్రయత్నంలో మీకు విజయం లభించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ పత్రిక చదవడం వల్ల యువతలో ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెరుగుతుంది.

thirubjp2020@gmail.com

### విభిన్న అంశాలపై చక్కని సమాచారం అందించే వ్యాసాలు

నేను ఒక జర్నలిస్టుని. న్యూ ఇండియా సమాచార్ పత్రిక చదవడాన్ని నేను ఎంతో ఆనందిస్తున్నాను. విభిన్న అంశాలపై ఈ పత్రిక చక్కని సమాచారంతో కూడిన వ్యాసాలు ప్రచురిస్తోంది. పోటీ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులకు న్యూ ఇండియా సమాచార్ ఎంతో ఉపయోగకరం. ఈ పత్రిక డిజైన్ కూడా చాలా బాగుంది.

urvaadhvaryu@gmail.com

### ప్రతీ సంచిక భద్రపరచుకోదగినదే

న్యూ ఇండియా సమాచార్ తమిళ సంచిక నేను చూశాను. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పత్రిక చదివిన అనంతరం నేను గుర్తించాను. పత్రిక నిండా విశ్వసనీయ సమాచారమే ఉంటుంది. ప్రతీ సంచిక సేకరించి భద్రపరుచుకోదగినదే.

**డి.తంగదురై**
thesiyareporter2023@gmail.com

**ఉత్తర ప్రత్యుత్తరాల చిరునామా: రూమ్ నెం-1077, సూచన భవన్, CGO కాంప్లెక్స్, న్యూఢిల్లీ -110003**
**e-Mail: response-nis@pib.gov.in**

Akashvani
*ప్రతి శనివారం-ఆదివారం మధ్యాహ్నం 3:00 నుండి 3:15 వరకు ఆల్ ఇండియా రేడియో FM గోల్డ్‌లో న్యూ ఇండియా సమాచార్ వినడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి.*

# సంక్షిప్త సమాచారం

## కొత్త ఆధార్ యాప్ ఆవిష్కారం, 5 ప్రొఫైల్స్ జోడించే అవకాశం

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఏఐ) కొత్త మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. ఆధార్ హోల్డర్లు తమ డిజిటల్ గుర్తింపును సురక్షితంగా, సౌకర్యవంతంగా, గోప్యంగా పరిశీలించుకునేందుకు, డిస్‌ప్లే చేసేందుకు, తమ వెంట తీసుకెళ్లేందుకు, ఇతరులతో పంచుకునేందుకు వీలుగా దీన్ని డిజైన్ చేశారు. "ఒక కుటుంబం, ఒకే యాప్" ఉద్దేశంతో ఒకే మొబైల్ డివైస్ మీద అయిదు ఆధార్ ప్రొఫైళ్లు జోడించుకునేందుకు ఇది అనుమతిస్తుంది. ఈ కొత్త యాప్ డేటా వినియోగాన్ని తగ్గించి, భద్రతను పెంచడంతో పాటు అనేక ఇతర ఫీచర్లను కూడా అందిస్తుంది.

- ఆధార్ నంబర్ గల వారు ఎంపిక చేసిన సమాచారాన్ని మాత్రమే ఇతరులతో పంచుకోవచ్చు.
- క్యుఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా హోటల్ చెక్ ఇన్ సదుపాయం ఈ యాప్‌లో ఉంది. ఆధార్ వివరాలు అడుగుతున్న పార్టీలు ఆఫ్‌లైన్‌లో వాటిని వెరిఫై చేసుకోవచ్చు.
- సినిమా టికెట్ బుకింగ్‌లు; ఆస్పత్రుల్లో సందర్శకులు, సహాయకుల ప్రవేశానికి ఐచ్ఛిక ఫేషియల్ వెరిఫికేషన్, వయస్సు వెరిఫికేషన్; గిగ్ కార్మికులు, సర్వీస్ భాగస్వాముల వెరిఫికేషన్ వంటి సదుపాయాలు ఈ యాప్‌లో ఉన్నాయి.
- హాజరు ధ్రువీకరణ కోసం ముఖగుర్తింపు అధీకృతం చేయడం, ఒకే క్లిక్‌తో బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్ చేయడం, అథెంటికేషన్ చరిత్ర పరిశీలన, కాంటాక్ట్ వివరాలు అందించేందుకు క్యుఆర్ కోడ్ ఆధారిత షేరింగ్ వంటి ప్రత్యేక ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయి.
- అడ్రస్ నవీకరించడంతో పాటు ప్రజలు ఇప్పుడు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌ను కూడా ఈ యాప్ ద్వారా నవీకరించుకోవచ్చు.




## గ్లోబల్ బ్రాండ్‌గా మఖానా దుబాయ్‌కి తొలి కన్‌సైన్‌మెంట్

మఖానా భారీగా ఉత్పత్తి చేసే దేశం భారత్. ప్రపంచ ఉత్పత్తిలో 80% వాటా భారత్‌దే. జాతీయ స్థాయిలో మఖానా ఉత్పత్తిలో 85% బిహార్‌లో పండిస్తారు. 10 లక్షల మంది రైతుల జీవనోపాధి దీనిపై ఆధారపడి ఉంది. ఇందులో భాగంగానే బిహార్‌లోని పర్నియా నుంచి దుబాయ్‌కి సముద్ర మార్గంలో జిఐ-టాగింగ్ చేసిన మిథిలా మఖానా తొలి కన్‌సైన్‌మెంట్‌ను పంపారు. రైతుల ఆదాయం పెంపు, ఎగుమతుల ద్వారా ఎఫ్‌పిఓల (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు) సాధికారత దిశగా ఇది ఒక విశిష్టమైన అడుగు. మిథిలా మఖానా ప్రపంచ యవనికపై భారత వ్యవసాయం, సంస్కృతీ గుర్తింపును పటిష్ఠం చేస్తుంది. దేశంలో మఖానా ఉత్పత్తి చేసే ప్రధాన కేంద్రాల్లో దర్భాంగా ఒకటి. "ఒక జిల్లా-ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద ప్రత్యేక గుర్తింపు సాధించిన ప్రాంతం ఇది. మఖానా ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్, ఎగుమతులను ప్రోత్సహించేందుకు 2025 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మఖానా బోర్డును ఏర్పాటు చేసింది. రూ.476 కోట్ల పెట్టుబడితో మఖానా అభివృద్ధికి కేంద్ర పథకాన్ని కూడా ఆమోదించింది. ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హెచ్‌ఎస్ఎన్ కోడ్‌ను కూడా నెలకొల్పింది. మిథిలా మఖానాకు జిఐ టాగింగ్ కూడా లభించింది.



## లేహ్‌లో పౌర విమానయాన మౌలిక వసతుల అభివృద్ధి

లేహ్ వైమానిక స్థావరంలో పౌర విమానయాన మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టును కేంద్రపాలిత ప్రాంతం లదాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తా ప్రారంభించారు. సముద్ర మట్టానికి ఎంతో ఎత్తైన ప్రాంతంలో అత్యంత సవాలుతో కూడిన, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం రికార్డు సమయంలో ఈ మౌలిక వసతులను ఆధునీకరించారు. ఈ నవీకరించిన మౌలిక వసతుల కారణంగా భూ ఉపరితలంపై విమానాలు తేలిగ్గా కదలడంతో పాటు పౌర విమానాలు తేలిగ్గా రాకపోకలు సాగించగలుగుతాయి. ఈ కొత్త సదుపాయాల వల్ల ప్రయాణికుల సౌలభ్యం పెరగడంతో పాటు విమానాల రాకపోకల వ్యవధి తగ్గుతుంది. మరిన్ని విశ్వసనీయమైన వైమానిక సేవలకు ఇది భరోసా కల్పించడంతో పాటు ఎలాంటి మానవతా సహాయం, వైపరీత్య సహాయం కావాలన్నా ఈ ప్రాంతం త్వరితంగా స్పందించగలుగుతుంది.

## 'సహకార్ సే సమృద్ధి': "భారత్ టాక్సీ" ఆవిష్కారం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "సహకార్ సే సమృద్ధి" విజన్‌కు అనుగుణంగా దేశంలో తొలి సహకార రైడ్ హైలింగ్ వేదిక "భారత్ టాక్సీ"ని హోమ్ మంత్రి అమిత్ షా 2026 ఫిబ్రవరి 5వ తేదీన న్యూఢిల్లీలో ప్రారంభించారు. సహకార వ్యవస్థ నిర్వహణలో దేశంలోని తొలి రైడ్ హైలింగ్ టాక్సీ సర్వీసు ఇది. బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టం 2022 కింద దీన్ని రిజిస్టర్ చేశారు. సహకార వ్యవస్థ నిర్వహణలో ప్రపంచంలోనే తొలి, అతి పెద్ద రైడ్ హైలింగ్ సర్వీసు ఇది. ఇప్పటి వరకు దీనిపై నాలుగు లక్షల మంది డ్రైవర్లు, 10 లక్షల మంది పైగా యూజర్లు నమోదయ్యారు. ఇప్పటికే సుమారు రూ.10 కోట్లు పైబడిన సొమ్ము ఈ యాప్ ద్వారా డ్రైవర్లకు పంపిణీ అయింది. భారత్ టాక్సీ కేవలం రవాణా సదుపాయం కల్పించడమే కాదు...పౌరులకు సరికొత్త సౌకర్యం, భద్రత, సాధికారత అనుభూతిని అందిస్తుంది. అది నాన్ ఎసి టాక్సీ సదుపాయంతో పాటు మెట్రో టికెట్ బుకింగ్ సౌకర్యం కూడా కల్పిస్తుంది. పైగా వసూలు చేసే ఫేర్‌లో 100% డ్రైవర్‌కే చేరుతుంది. ఈ కార్యక్రమం సందర్భంగా టాప్ ఆరుగురు సారథులను (డ్రైవర్లు) సహకార ఆధారిత రవాణా వ్యవస్థకు అందించిన విశేషమైన సేవలకుగాను సత్కరించారు. ఈ సందర్భంగా సారథులకు కేంద్ర మంత్రి షేర్ సర్టిఫికెట్లు కూడా పంపిణీ చేశారు. ఇది "సారథి హై మాలిక్" కాన్సెప్ట్‌ను మరింత బలోపేతం చేస్తుంది. ప్రతీ సారథికి రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.5 కుటుంబ ఆరోగ్య బీమా రక్షణ కల్పిస్తారు. భారత్ టాక్సీకి గల డ్రైవర్ల సంక్షేమం, దీర్ఘకాలిక సామాజిక భద్రతా కట్టుబాటుకు ఇది నిదర్శనం.





## పిఎంజిఎస్‌వై-IV కింద 10,000 కిలోమీటర్ల రోడ్డు ప్రాజెక్టులకు ఆమోదం

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పిఎంజిఎస్‌వై) IV కింద జమ్ము-కశ్మీర్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, రాజస్తాన్, హిమాచల్ ప్రదేశ్, సిక్కింలలో 10,000 కిలోమీటర్లకు పైగా రోడ్డు ప్రాజెక్టులను ఆమోదించారు. పూర్తయితే ఈ ప్రాజెక్టులు గతంలో కనెక్టివిటీ లేని 3,270 జనావాస ప్రాంతాలకు కీలక వసతులు అందించడంతో పాటు కనెక్టివిటీ కూడా కల్పిస్తాయి. అతి ఎత్తైన కొండ ప్రాంతాల నుంచి మారుమూల గ్రామీణ ప్రాంతాల వరకు ఈ రోడ్లు మౌలిక రవాణా వసతులు మెరుగుపరచడంతో పాటు పురోగతికి కీలకమైన మార్గాలు అందుబాటులోకి తెస్తాయి. ప్రస్తుతం అనుసంధానత లేని అన్ని జనావాస ప్రాంతాలకు ఏ వాతావరణ పరిస్థితులలైనా తట్టుకోగల 62,500 కిలోమీటర్ల నిడివి గల రోడ్లు అందుబాటులోకి వస్తాయి. 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్రాజెక్టులపై రూ.70,125 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

## అంతర్జాతీయ రామకథా మ్యూజియంలో 233 సంవత్సరాల క్రితం నాటి పురాతన వాల్మీకి రామాయణ ప్రతి ప్రదర్శన

కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస వరాఖేదీ 233 సంవత్సరాల క్రితం నాటి అరుదైన వాల్మీకి రామాయణ సంస్కృత లిఖిత ప్రతిని (తత్వదీపిక కామెంటరీ సహా) తీన్ మూర్తి భవన్‌లో ఉన్న ప్రధానమంత్రి మ్యూజియం, గ్రంథాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ చైర్మన్ నృపేంద్ర మిశ్రాకు అందచేశారు. ఈ వ్రాతప్రతిని ఆదికవి వాల్మీకి రచించగా మహేశ్వర తీర్థ దానికి సంస్కృతంలో (దేవనాగరి లిపి) వ్యాఖ్యానం రచించారు. ఇది విక్రమ సంవత్సరం 1849 (1729 సిఇ) సంవత్సరానికి చెందిన విశిష్టమైన ప్రతి. ఈ వ్రాతప్రతిని ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన అయోధ్యలోని అంతర్జాతీయ రామకథా మ్యూజియంకు శాశ్వత బహుమతిగా అందచేశారు. "ఈ అరుదైన వ్రాతప్రతిని అయోధ్యలోని రామకథా మ్యూజియంకు విరాళంగా అందించడం ఒక చారిత్రక ఘట్టం" అని నృపేంద్ర మిశ్రా అన్నారు.





జననం : ఫిబ్రవరి 17, 1792 | మరణం : ఫిబ్రవరి 13, 1832

# లర్కా తిరుగుబాటు యోధుడు

***లర్కా తిరుగుబాటు యోధుడు, దార్శనికత గల స్వాతంత్ర్య సమర యోధుడు బుధూ భగత్ బ్రిటిష్ పాలకులు, వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి కోసం గెరిల్లా పోరాటం సాగించాడు. బ్రిటిష్ పాలకుల నుంచి విముక్తి కోసం పోరాటం సాగించాల్సిందిగా చోరియా, పిథోరియా, లోహర్దగా, పాలము ప్రాంతాల ప్రజలను మేల్కొలిపాడు. దోపిడీ, అణచివేత ధోరణులపై ఆయన అవిశ్రాంత పోరాటం సాగించాడు. పలు సంవత్సరాల పాటు అటవీ ప్రాంతాల నుంచి బ్రిటిషర్లను తరిమికొట్టాడు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని గిరిజన ప్రజలకు బోధించాడు. సాహసం, ప్రతిఘటన, ధైర్యం, త్యాగాలకు మారుపేరైన బుధు భగత్ జీవితం నిరంతర స్ఫూర్తి దాయకమే.***

లర్కా తిరుగుబాటును ప్రజ్వరిల్లచేసిన విప్లవవాది బుధూ భగత్ కేవలం గొడ్డలితో బ్రిటిష్ ప్రభుత్వ శతఘ్నులను, తుపాకులను ప్రతిఘటించాడు. బుధూ భగత్ 1792 ఫిబ్రవరి 17వ తేదీన రాంచి జిల్లాలోని సిలాగియాన్ గ్రామంలో ఓరియన్ కుటుంబంలో జన్మించాడు. ఎల్లప్పుడూ చేతిలో గొడ్డలి ధరించి ఉండే ఆయనకు దైవిక శక్తులున్నాయని భావించే వారు. బుధూ భగత్ సంస్థాగత నైపుణ్యాలను పరిశీలించిన వారు ఆయనను దేవదూతగా పరిగణించే వారు. ఆయన సిల్లి, చోరియా, పిథోరియా, లోహర్దగ, పాలము ప్రజలను కూడా సంఘటితపరిచాడు.

ప్రజలను సంఘటితం చేసే నైపుణ్యాలున్న ఆయన గెరిల్లా యుద్ధరీతిలో తన సైన్యానికి శిక్షణ ఇచ్చాడు. దట్టమైన అడవులు, సంక్లిష్టమైన కొండ ప్రాంతాలను ఆసరా చేసుకుని ఆయన పలుమార్లు బ్రిటిష్ సైన్యాన్ని ఓడించాడు. బాల్యం నుంచి కత్తియుద్ధం, విలువిద్య ప్రాక్టీస్ చేశాడు. గిరిజన భూములు, అడవులను కాపాడేందుకు భూస్వాములు, మధ్య దళారీలపై పోరాటం సాగించాడు. తన సాహసం, నాయకత్వ లక్షణాలను ఉపయోగించుకుని గిరిజన ప్రాంతాల్లో బ్రిటిషర్ల పాలనలో సాగుతున్న క్రౌర్యానికి వ్యతిరేకంగా లర్కా తిరుగుబాటును ప్రారంభించాడు. సాయుధ విప్లవానికి నాయకత్వం వహించాడు.

రాంచి, ఛోటా నాగపూర్ ప్రాంతాల్లో బుధూ భగత్‌కు అపారమైన పలుకుబడి ఉన్నట్టు చెప్పే వారు. ఆయన ఆదేశిస్తే చాలు...తమ ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా ప్రజలు వెనుకాడేవారు కాదు. బుధూ భగత్ సైనిక స్థావరం దట్టమైన అడవుల మధ్యలోని చోగారి కొండపై ఉండేది. అక్కడి నుంచే వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం అయింది. ఆయన ధైర్య సాహసాలతో విసిగిపోయిన బ్రిటిష్ పాలకులు ఆయన్ని పట్టుకునేందుకు సహకరించిన వారికి వెయ్యి రూపాయల బహుమతి ప్రకటించింది. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం.

1832 ఫిబ్రవరి 13వ తేదీన కెప్టెన్ ఇంపే నాయకత్వంలో బ్రిటిష్ బలగాలు సిలాగియాన్ గ్రామంలో బుధూను, ఆయన సహచరులను చుట్టుముట్టాయి. బ్రిటిష్ సైనికులు విచక్షణారహితంగా జరిపే కాల్పుల్లో అమాయకులైన గ్రామస్థులు బలి కావడాన్ని నివారించేందుకు తాను లొంగిపోవాలని బుధూ భావించాడు. కాని బుధూ భగత్ అనుచరులు ఆయనకు రక్షణ వలయంగా ఏర్పడ్డారు. బ్రిటిష్ కెప్టెన్ వారిపై కాల్పులకు ఆదేశించాడు. సైనికులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు, యువకుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఆ దారుణ మారణకాండలో సుమారు 300 మంది గ్రామస్థులు మరణించారు. అన్యాయంపై ప్రజల తిరుగుబాటును ఆయుధ శక్తితో అణచివేశారు. బ్రిటిషర్లతో పోరాటంలో బుధూ భగత్, ఆయన కుమారులు హల్‌ధర్, గిర్‌ధర్ కూడా అమరులయ్యారు. నేటికీ ప్రజలు బుధూ భగత్, ఆయన సహచరుల సాహసాన్ని జానపద కథలు, జానపద గేయాల రూపంలో గుర్తు చేసుకుంటూ ఉంటారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆయన సేవలు, ప్రాచుర్యానికి ఇది దర్పణం పడుతుంది.



# 2030-31 వరకు
# అటల్ పెన్షన్ యోజన
# పొడిగింపు;సిడ్బికి రూ.5,000 కోట్లు

***అసంఘటిత కార్మికుల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని అటల్ పెన్షన్ యోజనను 2030-31 వరకు పొడిగించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అల్పాదాయ వర్గాలకు చెందిన వారు, అవ్యవస్థీకృత రంగ కార్మికులకు వృద్ధాప్యంలో ఆదాయం లభించేందుకు ఇది దోహదపడుతుంది. దీనికి తోడు సిడ్బికి ఈక్విటీ మద్దతుగా రూ.5,000 కోట్లు అందించే ప్రతిపాదన కూడా ఆమోదించారు. దీని వల్ల ఎంఎస్ఎంఇలకు ప్రయోజనం కలుగుతుంది.***

**నిర్ణయం: 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు అటల్ పెన్షన్ యోజన (ఎపివై) కొనసాగింపునకు ఆమోదం**

**ప్రభావం:** భారతదేశంలో సమ్మిళిత సామాజిక భద్రతా వ్యవస్థకు మూలస్తంభం అయిన అటల్ పెన్షన్ యోజన కింద 2026 జనవరి 19 నాటికి 8.66 కోట్ల మంది చందాదారులు నమోదయ్యారు. చందాదారులు జమ చేసే సొమ్ము ఆధారంగా 60 సంవత్సరాల వయసు నిండిన నాటి నుంచి నెలకి రూ.1,000 నుంచి రూ.5,000 కనీస పెన్షన్‌కు ఎపివై హామీ ఇస్తుంది. అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు వృద్ధాప్యంలో ఆదాయ హామీ ఇవ్వడం లక్ష్యంగా ఎపివైని 2015 మే 9వ తేదీన ప్రారంభించారు.

**కీలక ప్రభావాలు:**

- కోట్లాది మంది అల్పాదాయ వర్గాల ప్రజలు, అవ్యవస్థీకృత రంగ కార్మికులకు వృద్ధాప్యంలో ఆదాయ భద్రతకు భరోసా
- ఈ పథకం ఆర్థిక సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు పెన్షన్ ఆధారిత సమాజంగా భారత్ పరివర్తన చెందేందుకు సహాయపడుతుంది.
- సుస్థిర సామాజిక భద్రతకు భరోసా కల్పించడం ద్వారా వికసిత్ భారత్ @ 2047 విజన్‌ను ఇది బలోపేతం చేస్తుంది.

**చైతన్యం, సామర్థ్యాల నిర్మాణానికి ప్రభుత్వ మద్దతు :**

- ప్రజల్లో చైతన్యం కల్పించడం, సామర్థ్యాల నిర్మాణం సహా విభిన్న ప్రచార, అభివృద్ధి కార్యకలాపాల ద్వారా మరింత ఎక్కువ మంది అవ్యవస్థీకృత కార్మికులకు సమాచారం వ్యాపిస్తుంది.
- పథకం మనుగడ అవసరాలకు దీటుగా అవసరమైన నిధులు సమకూర్చడానికి, పథకం సుస్థిరతకు దోహదపడుతుంది.

*కేబినెట్ నిర్ణయాల పత్రికా సమావేశం కోసం ఈ క్యుఆర్ కోడ్ స్కాన్ చేయండి.*



**నిర్ణయం: భారత చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకుకు (సిడ్బి) రూ.5,000 కోట్ల ఈక్విటీ మద్దతుకు ఆమోదం.**

**ప్రభావం:** రూ.5,000 కోట్ల ఈక్విటీ మూలధనం అందించిన అనంతరం ఈ బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయం పొందిన ఎంఎస్ఎంఇల సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం నాటి 76.26 లక్షల నుంచి 2028 ఆర్థిక సంవత్సరం నాటికి 1.02 కోట్లకు చేరుతుంది (అంటే అదనంగా 25.74 లక్షల కొత్త ఎంఎస్ఎంఇలకు లబ్ధి చేకూరుతుంది).

- ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లోని తాజా గణాంకాల ప్రకారం (30.09.2025) దేశంలోని 6.90 కోట్ల ఎంఎస్ఎంఇల్లో 30.16 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు (అంటే సగటున ఒక్కో ఎంఎస్ఎంఇలో 4.37 మంది పని చేస్తున్నారు).
- ఈ సగటును పరిగణనలోకి తీసుకున్నట్టయితే 2027–28 నాటికి అదనంగా 25.74 ఎంఎస్ఎంఇ లబ్ధిదారులు ఈ జాబితాకు జోడవుతారు. ఈ ఎంఎస్ఎంఇలన్నీ కలిసి 1.12 కొత్త ఉద్యోగాలు కల్పిస్తాయి. ●



సంభాషణతో విజయం

9th Edition
Pariksha Pe Charcha 2026

# ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంత్రం
# మీ స్వంత శైలిపై సంపూర్ణ విశ్వాసం

***పరీక్షల ఒత్తిడిపై చర్చించేందుకు, పరీక్షలను వేడుకలా జరుపుకునేందుకు 2018 సంవత్సరంలో ప్రారంభించిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం ప్రతి సంవత్సరం కొత్త ప్రమాణాలను స్థాపిస్తోంది. ఈ సంవత్సరం కూడా విద్యార్థుల మనసుల్లో ఉన్న పరీక్షల భయాన్ని తొలగించి, వారికి విజయ మంత్రాన్ని నేర్పేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా, సమగ్రంగా నిర్వహించారు. ఫిబ్రవరి 6న జరిగిన 'పరీక్షా పే చర్చా' 9వ ఎడిషన్‌లో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో ముఖ్యమైన సూచనలు పంచుకుని, అనేక విషయాలపై చర్చించారు...***

## విద్యార్థుల కోసం ప్రధాని మోదీ మంత్రం

**మీ శైలిపై నమ్మకం:** మీ స్వంత శైలిపై మీరు పూర్తిగా విశ్వాసం ఉంచండి. అయితే దానికి సంబంధించి ఇతరులు ఇచ్చే సూచనలను శ్రద్ధగా వినండి. వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మీకు మీ స్వంత శైలి ఉందని అనిపించవచ్చు, కానీ అందులో ఈ ప్రత్యేక అంశాన్ని చేర్చితే ఉపయోగకరంగా ఉంటుందని భావించవచ్చు. అయితే ఎవరో చెప్పారని మాత్రమే ఆయా అంశాలను చేర్చకండి. మీ అనుభవం ఆధారంగా చేర్చండి. ఉదాహరణకు, నేను "పరీక్షా పే చర్చా" ప్రారంభించినప్పుడు ఒక శైలి ప్రకారం ఉండేది. ఇప్పుడు నేను దాన్ని క్రమంగా మెరుగుపరుస్తున్నాను.

**రెండు రకాల నైపుణ్యాలు:** రెండు రకాల నైపుణ్యాలు ఉన్నాయి: ఒకటి జీవన నైపుణ్యాలు, మరొకటి వృత్తిపరమైన నైపుణ్యాలు. ఎవరైనా నన్ను జీవన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలా లేదా వృత్తిపరమైన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలా అని అడిగితే, నేను రెండింటిపైనా దృష్టి పెట్టాలని వారికి చెబుతాను. ఇప్పుడు చెప్పండి, చదవకుండా, పరిశీలించకుండా, జ్ఞానాన్ని వినియోగించకుండా ఏ నైపుణ్యాన్నైనా పొందగలమా?

**విద్య ఒక సాధనం:** మన జీవితం పరీక్షల కోసం కాదు, కానీ విద్య మన జీవితాన్ని నిర్మించుకునే ఒక సాధనం. విద్య కోసం మనం మళ్లీ పరీక్షలు రాస్తుంటాం. ఈ పరీక్షలు మనల్ని మనం పరిశీలించుకోవడానికి ఉద్దేశించినవి. తుది లక్ష్యం పరీక్ష మార్కులు కాదు. తుది లక్ష్యం జీవితం యొక్క సమగ్ర అభివృద్ధి కావాలి. విద్యార్థులందరికీ నేను చేసే విజ్ఞప్తి




## అస్సాం గమోసా

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులను అస్సాం గమోసాతో ఆహ్వానించారు. ఆయన దాని గురించి వివరిస్తూ, "దీనిని అస్సామీ గమోసా అంటారు. ఇది అద్భుతమైనది; ఇది నాకు అత్యంత ఇష్టమైన వాటిలో ఒకటి. దీని రూపకల్పన చాలా అందంగా ఉంటుంది. రెండవది, ఇది అస్సాం రాష్ట్రానికి, ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో మహిళా సాధికారతకు ప్రతీక. దీనిని ఇంట్లోనే నేస్తారు. ఆ ప్రాంతంలోని మహిళలు, తల్లులు కష్టాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఇది నాకు గొప్ప గౌరవాన్ని, అభిమానాన్ని కలిగిస్తుంది. అందుకే ఈరోజు ఈ పిల్లలకు అస్సాం గమోసా ఇవ్వాలని అనిపించింది."

## "గతాన్ని లెక్కించను; మిగిలినదాన్ని లెక్కిస్తాను"

విద్యార్థులతో సంభాషణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, "ఇటీవల ఒక నాయకుడు నాకు ఫోన్ చేశారు. సెప్టెంబర్ 17న నా పుట్టినరోజు సందర్భంగా, నేను 75 ఏళ్లు పూర్తి చేశానని చెప్పారు. అప్పుడు నేను, 'ఇంకా 25 సంవత్సరాలు మిగిలి ఉన్నాయి' అన్నాను. నేను గడిచినదాన్ని లెక్కించను... మిగిలినదాన్ని లెక్కిస్తాను. అందుకే నేను మీకూ చెబుతున్నాను, గడిచిన సమయాన్ని లెక్కిస్తూ సమయాన్ని వృథా చేయకండి. మీకు మిగిలిన జీవితాన్ని ఎలా గడపాలో ఆలోచించండి."

**"ఈ ఏడాది పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పరీక్షలకు సంబంధించిన ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి, ముఖ్యంగా ఒత్తిడి లేకుండా ఉండటం, నేర్చుకోవడంపై దృష్టి పెట్టడం వంటి విషయాలు ఉన్నాయి. ఇది నేను ఎప్పుడూ ఆస్వాదించే వేదిక, ఎందుకంటే దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులతో సంభాషించడానికి ఇది నాకు అవకాశాన్ని కల్పిస్తుంది."** - *నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*



ఏమిటంటే, మీరు మీ జీవితాన్ని అత్యుత్తమంగా మార్చడానికి, మీ జీవితాన్ని శ్రేష్ఠంగా తీర్చిదిద్దడానికి, మీ మొత్తం జీవితం అద్భుతంగా ఉండేలా ప్రయత్నించాలి. దానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి.

**గేమ్ క్రియేటర్‌గా మారండి:** భారతదేశం భిన్నమైన కథలకు, కథనాలకు పుట్టినిల్లు. పంచతంత్ర ఆధారంగా ఒక గేమ్ రూపొందించడం గురించి ఎప్పుడైనా ఆలోచించారా? మీరు స్వయంగా గేమ్ క్రియేటర్‌గా మారండి. మీ స్వంత సోషల్ మీడియా ప్రొఫైల్ సృష్టించి, ఒకటి లేదా రెండు గేమ్‌లను స్వయంగా అభివృద్ధి చేసి వాటిని ప్రారంభించండి. "చూడండి, ఇతనికి ఇంత చిన్న వయసులోనే 10,000-20,000 ఫాలోవర్లు ఉన్నారు!" అని మీ కుటుంబం ఆశ్చర్యపడుతుంది. మీకు అనేక కొత్త ఆలోచనలు వస్తాయి. కాబట్టి, మీకు గేమింగ్‌పై ఆసక్తి ఉంటే, అది మంచి విషయం. ఎప్పుడూ సంకోచించకండి.

9th Edition

# Pariksha Pe Charcha 2026

## రికార్డు స్థాయిలో విద్యార్థుల నమోదు



**పరీక్షా పే చర్చ కార్యక్రమం యొక్క 9వ ఎడిషన్ అపూర్వమైన వృద్ధిని నమోదు చేసింది. మైగవ్ పోర్టల్ ద్వారా 4.5 కోట్లకు పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నమోదు చేసుకున్నారు. ఇందులో 4,19,14,056 మంది విద్యార్థులు, 24,84,259 మంది ఉపాధ్యాయులు, 6,15,064 మంది తల్లిదండ్రులు ఉన్నారు.**

### 2018

**మొదటి సమావేశం**

మొదటి పరీక్షా పే చర్చ 2018 ఫిబ్రవరి 16న న్యూ ఢిల్లీలోని టల్కటోరా స్టేడియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 2,500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 8.5 కోట్లకు పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.

### 2019

**పెరిగిన విస్తృతి**

పరీక్షా పే చర్చ రెండవ ఎడిషన్ 2019 జనవరి 29న న్యూ ఢిల్లీలోని టల్కటోరా స్టేడియంలో నిర్వహించడం జరిగింది. తొంభై నిమిషాలకు పైగా సాగిన ఈ చర్చలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### 2020

**పెరుగుతున్న పాల్గొనేవారి సంఖ్య**

2020 జనవరి 20న న్యూ ఢిల్లీలోని టల్కటోరా స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 2.63 లక్షల నమోదులు అందాయి. భారతదేశంలోనూ విదేశాల్లోనూ ఉన్న 25 దేశాల భారతీయ విద్యార్థులు పాల్గొన్నారు.

### 2021

**వర్చువల్ వేదికగా నిర్వహణ**

కోవిడ్ మహమ్మారి కారణంగా, పరీక్షా పే చర్చ నాల్గవ ఎడిషన్ 2021 ఏప్రిల్ 7న ఆన్‌లైన్ మాధ్యమంలో నిర్వహించడం జరిగింది.

### 2022

**మళ్లీ ప్రత్యక్ష కార్యక్రమం**

2022 ఏప్రిల్ 1న న్యూ ఢిల్లీలోని టల్కటోరా స్టేడియంలో నిర్వహించిన పరీక్షా పే చర్చ 5వ ఎడిషన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చలో పాల్గొన్నారు. పరీక్షా పే చర్చ-2022 ప్రత్యక్ష ప్రసారాన్ని 9,69,836 మంది విద్యార్థులు, 47,200 మంది సిబ్బంది, 1,86,517 మంది తల్లిదండ్రులు వీక్షించారు.

### 2023

**వీక్షకుల పెరుగుదల**

పీపీసీ 6వ ఎడిషన్ 2023 జనవరి 27న టల్కటోరా స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం అనేక టీవీ చానెళ్ళు, యూట్యూబ్ చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ప్రత్యక్ష ప్రసారాన్ని 7,18,110 మంది విద్యార్థులు, 42,337 మంది ఉపాధ్యాయులు మరియు 88,544 మంది తల్లిదండ్రులు వీక్షించారు.

### 2024

**దేశవ్యాప్తంగా పాల్గొనడం**

7వ ఎడిషన్ 2024 జనవరి 29న భారత్ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైగవ్ పోర్టల్‌లో 22.6 కోట్ల నమోదులు వచ్చాయి. తొలిసారిగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కళా ఉత్సవ్ విజేతలు సహా సుమారు 3వేల మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

### 2025

**భిన్న అంశాలపై చర్చ**

2025 ఫిబ్రవరి 10న పరీక్షా పే చర్చ 8వ ఎడిషన్ న్యూ ఢిల్లీలోని సుందర్ నర్సరీలో వినూత్న రూపంలో నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో సరదాగా సంభాషించి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధాని విద్యార్థులకు నువ్వులతో తయారు చేసిన మిఠాయిలను అందించారు.

**మీ డైరీలో రాయండి:** రేపటి రోజు కోసం ప్రణాళిక రూపొందించండి. రాత్రి నిద్రపోయే ముందు, మరుసటి రోజు మీరు పూర్తి చేయాల్సిన పనులను మీ డైరీలో రాయండి. ఆ పనులు ఏమిటి? తరువాతి రోజు, ముందురోజు మీరు రాసిన వాటిని పరిశీలించి, వాటిని పూర్తి చేశారా లేదా ఒకసారి చూడండి. పూర్తి చేసిన వాటికి గుర్తు పెట్టండి.

**మీరు ఎలా జీవిస్తారో అలాగే జీవితం రూపుదిద్దుకుంటుంది:**





## మొదటిసారి దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పరీక్షా పే చర్చ

మొదటిసారిగా పీపీసీ2026 దేశంలోని అన్ని భాగాలను మిళితం చేస్తూ అనేక ప్రాంతాల్లో నిర్వహించారు. ఢిల్లీతో పాటు, తమిళనాడులోని కోయంబత్తూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, గుజరాత్‌లోని దేవ్ మోగ్రా, అసోంలో గువాహటి వంటి నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించారు. ఇవి దేశంలోని తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం, మధ్య భాగాలకు ప్రాతినిధ్యం వహించాయి.

## దేశవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థి-కేంద్రిత కార్యక్రమాల నిర్వహణ

పరీక్షా పే చర్చ 2026 నిర్వహించడానికి కొద్ది రోజుల ముందు దేశవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో స్వదేశీ సంకల్ప్ దౌడ్ అనే విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగులు/నడక కార్యక్రమం ద్వారా ఆత్మనిర్భర భావనను ప్రోత్సహించడం. అలాగే పరాక్రమ దివస్ సందర్భంగా పలు కేంద్రీయ విద్యాలయాల్లో క్విజ్, రచన పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. సుమారు 2.26 కోట్ల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.




## మీరు తప్పనిసరిగా కలలు కనాలి

కలలు కనకపోవడం ఒక నేరం. మీరు తప్పనిసరిగా కలలు కనాలి, కానీ ఆ కలలకు కార్యాచరణ ఉండాలి. అందుకే జీవితంలో కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. నేను ఎక్కడ ఉన్నా అక్కడే విజయాన్ని సాధించాలి; అప్పుడే నేను ముందుకు సాగగలను. ఒక రోజు నా మనసు నేను వ్యోమగామిగా మారి చంద్రుడికి వెళ్లాలని నిర్ణయిస్తే, నేను చదవడం ప్రారంభించాలి. వ్యోమగాములు ఎవరు? వారి జీవిత చరిత్రలు ఎలా ఉన్నాయి? అంతరిక్షం అంటే ఏమిటి? ఇలా క్రమంగా, దశలవారీగా దానిపై ఆసక్తిని అభివృద్ధి చేసుకోవాలి.

## ప్రధాని నరేంద్ర మోదీకి కవిత చదివి వినిపించిన విద్యార్థి:

*हम सबके अरमान हैं आप। भारत के अभिमान हैं आप।*
*भारतवर्ष के केवट हैं आप। मानवता के सेवक हैं आप।*
*मैं बड़ी दूर से आई हूं। कुछ प्रश्नों को अपने साथ भी लाई हूं।*
*परीक्षा पे चर्चा की सौगात उठाए हैं। फिर हम यह मौका पाए हैं।*
*आप ममता की परछाई हैं। वंचितों के हमराही है।*
*देश को आगे रखते हैं। भारत मां की जय कहते हैं।*
*तो लो मैं भी यह कहती हूं, मन की बात रखती हूं।*
*आप साधना पुरुष और योगी हो।*
*भारत के सपनों के मोदी हो।*
*यह कहकर मैंने वाणी को विराम दिया।*
*फिर से आपको प्रणाम किया।*

## పరీక్షా పే చర్చ నుండి ముఖ్యమైన చిట్కాలు

- ఒత్తిడి నిర్వహణ, సమయ నిర్వహణ
- పరీక్ష ఆందోళనను అధిగమించడానికి మార్గాలు.
- పరీక్షల చివరి రోజుల్లో పునరీక్షించుకునేందుకు సరైన మార్గం
- తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి తీసుకురావడానికి బదులుగా వారికి ఎలా సహాయం చేయవచ్చు.

*ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని చూసేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.*

కొంతమంది తమకు నిద్ర రావట్లేదని అంటారు. ఎందుకు? వారి గది కారణమా? వారిని ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఉంచినా కూడా వారికి నిద్ర పట్టదు. కాబట్టి సౌకర్యం సామర్థ్యానికి దారి తీస్తుందనే ఆలోచన తప్పు. మన దేశంలో బోర్డు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే పిల్లలు ఎవరు? వారు చిన్న గ్రామాల నుంచి వచ్చిన వారే. అక్కడ ఎలాంటి సౌకర్యాలు ఉండవు. సౌకర్య వలయం జీవితం నిర్మిస్తుందని మీరు భ్రమలో ఉండకూడదు. మీ జీవితం మీరు ఎలా జీవిస్తారో అన్నదాని ఆధారంగా రూపుదిద్దుకుంటుంది.

రాష్ట్రపతి ప్రసంగం

# సుపరిపాలన మరింత పటిష్ఠం చేసేందుకు సమిష్టి కృషి

*రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో 2026 సంవత్సరంలో పార్లమెంటు తొలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల సంవత్సరాల్లో భారత అభివృద్ధి యానాన్నిఆ ప్రసంగం ఎంతో వివరంగా ప్రస్తావించడంతో పాటు భవిష్యత్తుకు బలమైన మార్గనిర్దేశం చేయడంతో పాటు 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసాన్ని ప్రకటించింది. రైతులు, యువత, పేదలు, సమాజంలో అణచివేతకు గురవుతున్న వర్గాల సాధికారత కోసం నిరంతరం జరుగుతున్న ప్రయత్నాలను ఆ ప్రసంగం ప్రముఖంగా వెలుగులోకి తెచ్చింది. సంస్కరణల వేగాన్ని పెంచడానికి, ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడానికి, సత్పరిపాలనను మరింత బలోపేతం చేయడానికి నవభారతం ఉమ్మడి కట్టుబాటును పునరుద్ఘాటించింది. శక్తివంతమైన, స్వయం-సమృద్ధ, సుసంపన్న జాతి నిర్మాణంపై ఉమ్మడి సంకల్పాన్ని ప్రతిబింబించింది. ఆ ప్రసంగంలోని ముఖ్యాంశాలు...*



**గతం నుంచి స్ఫూర్తి** : వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఎంతో చక్కని స్ఫూర్తిని నింపినందుకు ఋషి బంకిం చంద్ర ఛటోపాధ్యాయకు దేశ ప్రజలు నివాళి అర్పించారు. అంతే కాదు...శ్రీ గురు తేజ్ బహదూర్‌జీ పట్ల ఎంతో గౌరవంతో 350వ ఆత్మార్పణ దినోత్సవం కూడా నిర్వహించుకుంది. భగవాన్ బిర్సా ముందా 150వ జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయనకు జాతి నివాళి అర్పించింది. సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకలు “ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్” స్ఫూర్తిని బలోపేతం చేశాయి. అలాగే భారత్ రత్న భూపేన్ హజారికా శతజయంతి వేడుకలను మాధుర్యభరితమైన సంగీతం, జాతీయ ఐక్యతా స్ఫూర్తితో నిర్వహించుకున్నారు. దేశ పౌరులు తమ ఘనమైన చరిత్రకు, పూర్వీకుల సేవకు దర్పణం పట్టే ఇలాంటి ప్రధాన ఘట్టాలను గుర్తు చేసుకున్నప్పుడు అది కొత్త తరానికి స్ఫూర్తినిస్తుంది.

**పేదరిక నిర్మూలన :** గత దశాబ్ది కాలంలో 25 కోట్ల మంది పేదరికం రేఖ నుంచి వెలుపలికి వచ్చారు. నా ప్రభుత్వం మూడో విడత అధికార కాలంలో పేదల సాధికారత ఉద్యమం మరింత ఉత్తేజితంగా ముందుకు సాగింది.

**పక్కా గృహాలు :** గత దశాబ్ది కాలంలో పేదల కోసం 4 కోట్ల పక్కా గృహాల నిర్మాణం జరిగింది. గత ఏడాది 32 లక్షల నూతన గృహాలను పేదలకు అప్పగించాం.

**టాప్ వాటర్ :** జల్ జీవన్ మిషన్ అయిదేళ్ల కాలంలో 12.5 కోట్ల కొత్త ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి కనెక్షన్లు అందించాం. గత ఏడాది కాలంలో



కోటికి పైగా కొత్త గృహాలకు కుళాయి నీటి కనెక్షన్లు అందించగలిగాం.

**ఎల్‌పిజి:** ఉజ్వల యోజన కింద ఇప్పటివరకు 10 కోట్లకు పైబడి ఇళ్లకు ఇప్పటివరకు ఎల్‌పిజి కనెక్షన్లు అందించాం. గత ఏడాది కాలంలో ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలకు డిబిటి (ప్రత్యక్ష నగదు బదిలీ) విధానం కింద రూ.6.75 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేసింది.

**సామాజిక భద్రత :** 2014 సంవత్సరం ప్రారంభం నాటికి దేశ పౌరుల్లో 25 కోట్ల మందికి మాత్రమే సామాజిక భద్రతా పథకాలు అందుబాటులో ఉండేవి. ప్రభుత్వం చేసిన నిరంతర కృషి కారణంగా ఇప్పుడు సామాజిక భద్రతా పథకాల కవరేజి 95 కోట్ల మంది భారతీయులకు విస్తరించింది.

**ఆరోగ్యం:** నిరుపేద వర్గాలకు చెందిన రోగుల కోసం ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకం కింద గత ఏడాది నాటికి 11 కోట్ల మంది పైగా ప్రజలకు ఉచితంగా వైద్యచికిత్సలు అందించడం జరిగింది. గత ఏడాదిన్నర కాలంలో కోటి మంది పైగా వయో వృద్ధులకు వయ వందన కార్డులు అందచేశారు. ఈ కార్డుల సహాయంతో సుమారు 8 లక్షల మంది వయోవృద్ధులు వివిధ ఆస్పత్రుల్లో ఉచితంగా ఇన్-పేషెంట్లుగా చికిత్స పొందారు. సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన కార్యక్రమం కింద 6.5 కోట్ల మంది పైగా పౌరులకు పరీక్షలు నిర్వహించారు. భారత్‌ను ట్రాకోమా అనే కంటి రోగ రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించడం మనందరికీ గర్వకారణం.

**బీమా కవరేజి:** ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్షా బీమా యోజన కింద అవసరంలో ఉన్న కోట్లాది మంది పౌరులకు బీమా కవరేజి లభించింది. ఈ పథకాల కింద రూ.24,000 కోట్లకు పైగా విలువ గల క్లెయిమ్‌లకు చెల్లింపులు జరిగాయి.

**రైతన్నలు:** గత ఏడాది భారతదేశం రికార్డు స్థాయిలో 35 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండించింది. 15 కోట్ల టన్నులకు పైబడిన ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద బియ్యం ఉత్పత్తి దేశంగా భారత్ మారింది. ప్రపంచంలో మత్స్య ఉత్పత్తుల్లో కూడా రెండో పెద్ద దేశంగా భారత్ నిలిచింది. పాల ఉత్పత్తుల్లో కూడా ప్రపంచంలో అత్యంత విజయవంతమైన దేశాల్లో ఒకటిగా భారత్ గుర్తింపు పొందింది.

**మొబైల్, ఇవి తయారీ** : మొబైల్ తయారీ వంటి రంగాల్లో భారతదేశం ప్రపంచంలోనే రెండో పెద్ద ఉత్పత్తి దేశంగా మారింది. 2025-26 సంవత్సరం తొలి అయిదు నెలల కాలంలో భారత్ రూ.1 లక్ష కోట్ల స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల మైలురాయిని చేరింది. ఈ ఏడాది భారత్ ప్రపంచంలోని 100 పైగా దేశాలకు విద్యుత్ వాహనాల ఎగుమతి కూడా ప్రారంభించింది.

**పిఎం గ్రామీణ సడక్ యోజన :** ఈ పథకం కింద గత ఏడాది 18,000 కిలోమీటర్ల నూతన గ్రామీణ రహదారులను జోడించడం జరిగింది. ఇప్పుడు ఇంచుమించుగా గ్రామీణ జనాభా మొత్తానికి రోడ్ల అనుసంధానత ఉంది.

**ఐజ్వాల్‌కు నేరుగా రైలు మార్గంతో అనుసంధానత :** మిజోరంలోని ఐజ్వాల్‌కు, దేశ రాజధాని న్యూఢిల్లీకి మధ్యన ఇప్పుడు నేరుగా రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది. గత ఏడాది తొలిసారిగా రాజధాని ఎక్స్‌ప్రెస్ ఐజ్వాల్ స్టేషన్‌లో ప్రవేశించినప్పుడు స్థానిక ప్రజలు చూపించిన ఉత్సుకత జాతి యావత్తుకు ఆనందం కలిగించింది.

**ప్రపంచంలోనే ఎత్తైన ఆర్చి రైల్వే వంతెన :** జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చి వంతెన చీనాబ్ బ్రిడ్జి, తమిళనాడులో కొత్త పంబన్ రైలు వంతెన నిర్మాణం ద్వారా మౌలిక వసతుల అభివృద్ధిలో భారత్ ఒక కొత్త మైలురాయిని నెలకొల్పింది




**జలమార్గాలు :** గతంలో దేశంలో కేవలం అయిదు జాతీయ జల మార్గాలుండేవి. వాటి సంఖ్య ఇప్పుడు 100 దాటింది. ఉత్తర్ ప్రదేశ్, బెంగాల్, బిహార్ సహా తూర్పు భారత రాష్ట్రాలు లాజిస్టిక్ కేంద్రాలుగా మారుతున్నాయి.

**ప్రగతి** : పథకాల ప్రయోజనాలు ప్రతీ ఒక్క పౌరునికి అందించే ప్రయత్నంలో భాగంగా "ప్రగతి" పేరిట ఒక కొత్త చొరవను ప్రభుత్వం చేపట్టింది. 2025 డిసెంబర్ నెలలో ప్రగతి 50 సమావేశాల చారిత్రక ఘట్టాన్ని కూడా నమోదు చేసింది. ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూ.85 లక్షల కోట్ల విలువ గల పథకాల పురోగతిని ప్రగతి వేగవంతం చేసింది.

**రూ.1 లక్ష కోట్లు పొదుపు** : జిఎస్‌టి సంస్కరణలు ప్రజలకు చెందిన రూ.1 లక్ష కోట్ల పొదుపునకు భరోసా ఇచ్చాయి. 2025 సంవత్సరంలో జిఎస్‌టి రేట్లు తగ్గించిన తర్వాత ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్లు 2 కోట్లు దాటాయి. ఇది ఒక కొత్త రికార్డు.

**ఆదాయపు పన్ను ఊరట** : రూ.12 లక్షల వార్షికాదాయం ఉన్న వారికి జీరో ఆదాయపు పన్ను ప్రయోజనం కల్పించే చారిత్రక నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. ఈ సంస్కరణలు పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఎనలేని ప్రయోజనం కల్పిస్తున్నాయి.

**కొత్త కార్మిక చట్టం :** దేశంలో కొత్త కార్మిక చట్టం అమలు చేయడం జరిగింది. దీంతో కార్మికులు న్యాయబద్ధమైన వేతనాలు, అలవెన్సులు, ఇతర సంక్షేమ ప్రయోజనాలు పొందడం సరళం అయింది. ఈ సంస్కరణలతో దేశానికి చెందిన యువత ప్రత్యేకించి మహిళలు విశేషంగా లబ్ధి పొందుతారు.



**మెట్రో నెట్‌వర్క్**

**2025 సంవత్సరంలో భారతదేశం మొత్తం వెయ్యి కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ మైలురాయిని దాటింది. నేడు భారత్ మెట్రో నెట్‌వర్క్‌లో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచింది.**

**సోలార్ ఎనర్జీ** : అణు ఇంధన రంగంతో పాటుగా భారత్ సోలార్ ఎనర్జీ రంగంలో కూడా వేగంగా పురోగమిస్తోంది. పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా నేడు సామాన్య పౌరులు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారుతున్నారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటయ్యాయి.

**సరిహద్దు ప్రాంతాల్లో మెరుగైన కనెక్టివిటీ** : గత 11 సంవత్సరాల కాలంలో ఈశాన్య రాష్ట్రాల్లో 7,200 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరిగింది. ఆ ప్రాంతాల్లోని మారుమూల, కొండ, గిరిజన, సరిహద్దు





**స్వయం-సహాయక బృందాలు**

**ప్రభుత్వం 10 కోట్ల మంది మహిళలను స్వయం-సహాయక బృందాలతో అనుసంధానం చేసింది. నేడు ఏటా 1 లక్ష రూపాయలు పైబడిన ఆదాయం పొందుతున్న (లఖ్‌పతి దీదీలు) మహిళల సంఖ్య 2 కోట్లు దాటింది. గత సంవత్సరంలోనే 60 లక్షల మంది పైగా మహిళలు లఖ్‌పతి దీదీలుగా మారారు. నా ప్రభుత్వం త్వరలో 3 కోట్ల మందిని లఖ్‌పతి దీదీలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది.**

ప్రదేశాలు దీని ద్వారా వెలుపలి ప్రపంచంతో అనుసంధానత పొందాయి.

**పిఎం జన్‌మన్ పథకం** : ఈ పథకం కింద అత్యంత వెనుకబడిన గిరిజన తెగలు నివశిస్తున్న 20,000 పైగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోనున్నాయి. ఈ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో 2.5 లక్షల ఇళ్లు పేదల కోసం నిర్మించారు.

**గిరిజన విద్య** : గత 11 సంవత్సరాలుగా షెడ్యూల్డ్ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు 42 వేల కోట్లకు పైబడిన విలువ గల పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పొందారు. ఇది సుమారుగా అయిదు కోట్ల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కల్పించింది. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో 400 పైగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసింది.

**పిఎం కిసాన్ సమ్మాన్ నిధి** : ఈ పథకం కింద రూ.4 లక్షల కోట్లకు పైబడిన మొత్తం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేశారు.

**వికసిత్ భారత్ జి రామ్ జి** : ఈ కొత్త చట్టం గ్రామీణ ప్రజలకు 125 ఉపాధి హామీన అందిస్తుంది. అదే సమయంలో అవినీతి, లీకేజీలను రూపు మాపుతుంది. గ్రామీణాభివృద్ధికి ఇది కొత్త ఉత్తేజం కల్పిస్తుంది.

**ఆపరేషన్ సిందూర్** : భారత రక్షణ దళాల సాహసాన్ని, శక్తిని ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం యావత్తు వీక్షించగలిగింది. సొంత వనరులు వినియోగించడం ద్వారా భారత్ ఉగ్రవాదుల మూల స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్‌పై ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా దానికి నిర్ణయాత్మకమైన, గట్టి జవాబు ఇస్తామన్న బలమైన సందేశం ప్రపంచానికి భారత్ అందించింది. సింధు జలాల ఒప్పందం రద్దు కూడా ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఇచ్చిన గట్టి సమాధానంలో భాగమే.

**మావోయిజానికి అంతం** : మావోయిస్టుల భయోత్పాతం ఒకప్పుడు 126 జిల్లాలకు విస్తరించగా ఇప్పుడది 8 జిల్లాలకే పరిమితం అయింది. వాటిలో కూడా కేవలం మూడు జిల్లాలే తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలు. దేశం నుంచి మావోయిస్టు తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టే రోజు ఎంతో దూరంలో లేదు.

**సెమీ కండక్టర్లు** : 2025 సంవత్సరంలో నాలుగు సెమీ కండక్టర్ తయారీ యూనిట్లకు అనుమతి ఇచ్చారు. సమీప భవిష్యత్తులో అలాంటి 10 ఫ్యాక్టరీలు కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. నానో-చిప్‌ల తయారీకి కూడా భారత్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటోంది.

**ముద్ర యోజన** : ఈ పథకం యువతలో ఔత్సాహిక పారిశ్రామిక ధోరణులను, స్వయం-ఉపాధిని ప్రోత్సహిస్తోంది. ఈ పథకం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకు ఔత్సాహికులైన చిన్న పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు రూ.38 లక్షల కోట్లకు పైగా రుణాలు బట్వాడా చేశారు. తొలిసారిగా స్వయం-ఉపాధి రంగంలోకి ప్రవేశించిన వారికి 12 కోట్లకు పైగా రుణాలు అందించారు.

**స్టార్టప్ ఇండియా** : ఈ కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ 10 సంవత్సరాల కాలంలో భారతదేశం ప్రపంచంలోనే మూడో పెద్ద స్టార్టప్ వ్యవస్థ గల దేశంగా మారింది. ఒక దశాబ్ది క్రితం దేశంలో 500 కన్నా తక్కువ స్టార్టప్‌లున్నాయి. కాని నేడు 2,00,000 పైబడిన రిజిస్టర్డ్ స్టార్టప్‌లు గల దేశంగా భారత్ మారింది.

**మొబైల్ నెట్‌వర్క్** : గత ఏడాది కాలంలో ఒక లక్షకు పైగా మొబైల్ టవర్ల ద్వారా 4జి, 5జి నెట్‌వర్క్‌లు దేశంలోని ప్రతీ ఒక్క ప్రాంతానికి విస్తరించాయి. డిజిటల్ ఇండియా విస్తరణతో వేలాది కోట్ల విలువ గల సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ గల ప్రధాన ప్రపంచ హబ్‌గా భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది.

వికసిత భారత్ సంకల్పంతో అమృత యాత్ర

# భవిష్యత్తుపై విశ్వాసంతో అభివృద్ధికి రూపమిచ్చే బడ్జెట్




*కేంద్ర బడ్జెట్ 2026–27ను చూడటం–వినడం కోసం 'క్యూఆర్' కోడ్‌ను స్కాన్ చేయండి.*

# కేంద్ర కేబినెట్ 2026-27

***వికసిత భారత్ సంకల్ప సాకారానికి గడచిన 12 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం పునాది వేసింది. ఈ దార్శనికతను నెరవేర్చే ఓ కీలక మలుపుగా ఇప్పుడు 2026-27 కేంద్ర బడ్జెట్ రూపొందింది. "సంకల్పంతో సత్ఫలితం" తారకమంత్రంగా అమృత యాత్ర సాగేందుకు తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తుంది. అభివృద్ధి, విశ్వాసం, భవిష్యత్తు సంగమంగా స్వయంసమృద్ధ భారత్‌ను తీర్చిదిద్దడంలో నిస్సందేహంగా ఇదొక శక్తిమంతమైన ఉపకరణం.***



వికసిత భారత్ దిశగా దేశం చేపట్టిన అమృత యాత్రకు ఈ బడ్జెట్ మార్గనిర్దేశం చేస్తుంది. ఇది గత 12 సంవత్సరాల ప్రగతి కృషితో స్వర్ణ భారత్ పునాదిని బలోపేతం చేసే బడ్జెట్. గ్రామాలు, పేదలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బడ్జెట్. మహిళలు, యువతరం సాధికారతపై దార్శనికతకు ఇది అద్దం పడుతుంది. వాస్తవికార్థంలో దేశ ఆర్థిక వ్యవస్థ గుణాత్మక, పరిమాణాత్మక పరిణామశీలతను కళ్లకు కట్టే అసాధారణ ఆర్థిక పత్రమిది. వికసిత భారత్ దిశగా అమృత యాత్రను సాకారం చేసే బడ్జెట్ ఇది. సమర్థ, సునిశిత, శక్తియుత భారత్ కోసం రూపొందిన బడ్జెట్. నిశిత దార్శనికతతో నిరంతరం శ్రమిస్తూ గత 12 సంవత్సరాలుగా రూపొందించిన కేంద్ర బడ్జెట్ల ఏకైక లక్ష్యం– కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం దేశాన్ని బలోపేతం చేస్తూ పౌర ప్రయోజనాలను నెరవేర్చడమే!

**ఈసారి కేంద్ర బడ్జెట్ ఎంతో ప్రత్యేకం... ఎందుకంటే- ఇది కర్తవ్య భవన్‌లో రూపొందిన తొలి బడ్జెట్ కాగా, దీనికి 3 ప్రధాన సూత్రాలు స్ఫూర్తినిచ్చాయి:**

**మొదటిది**: ఆర్థిక వృద్ధిని వేగిరపరచడం... స్థిరంగా కొనసాగించడం.

**రెండోది:** పౌరుల ఆకాంక్షలు నెరవేరుస్తూ, వారి సామర్థ్యాలను ఇనుమడింపజేయడం.

**మూడోది:** దేశ ప్రజలందరి కోసం సార్వజనీన అభివృద్ధి.

ఒకానొక కాలంలో కేంద్ర బడ్జెట్‌ను కేవలం ఒక ఆర్థిక పత్రంగా, వార్షిక ఆర్థిక లావాదేవీల సార్వత్రిక ఖాతాగా మాత్రమే పరిగణించే పరిస్థితి ఉండేది. అయితే, 2014 నుంచి ఇది ఆర్థిక నివేదికల సమర్పణపై రాజ్యాంగ నిర్దేశాన్ని మించి సరికొత్త రూపం ధరించి, నిరంతరాయ కృషికి ప్రతీకగా నిలిచే పత్రంగా రూపాంతరం చెందింది. కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక దార్శనికతను ప్రతిబింబిస్తున్న ఈ బడ్జెట్ ద్వారా లభించే ప్రత్యక్ష ఫలితం వికసిత భారత్ సంకల్ప సాకారమే!

## ఓ సర్వసమగ్ర కేంద్ర బడ్జెట్

దేశంలోని ప్రతి రంగం, ప్రతి పౌరుడి సంపూర్ణ సంక్షేమం లక్ష్యంగా 2026–27 సంవత్సరానికిగాను ఈ సర్వసమగ్ర, సార్వజనీన కేంద్ర బడ్జెట్ రూపొందింది. స్వయంసమృద్ధ, వికసిత భారత్ సంకల్ప సాకారంలో ఇదొక బలమైన సాధనం కాగలదు. ఈ సంకల్పం ఒక

నినాదానికి పరిమితమైనది కాదు... 2047 నాటికి దేశాన్ని వికసిత భారత్‌గా మార్చే నిబద్ధతకు ప్రతీక. ప్రతి రంగం, ప్రతి వర్గం, ప్రతి పౌరుడి సాధికారత దిశగా విస్పష్ట కార్యాచరణ ప్రణాళికను ఈ బడ్జెట్ సమకూరుస్తుంది. అడుగడుగునా వారిని ప్రోత్సహిస్తూ, చేయూతనిచ్చే దార్శనిక పత్రంగా ఇది ఉపయోగపడుతుంది. వికసిత భారత్ సంకల్పాన్ని ప్రతిబింబించే ఈ బడ్జెట్, ప్రతి రంగంలోనూ అంతర్జాతీయంగా అగ్రగామిగా నిలిచే దేశాన్ని రూపొందించే ఒక దృక్పథం. తయారీ రంగం నుంచి మౌలిక సదుపాయాల వరకూ, ఆరోగ్య సంరక్షణ నుంచి పర్యాటకం దాకా, గ్రామీణ ప్రాంతాల నుంచి కృత్రిమ మేధ (ఏఐ) వరకూ, క్రీడల నుంచి పుణ్యక్షేత్రాల అభివృద్ధి దాకా... ప్రతి గ్రామం, పట్టణం, నగరంలోని యువత, మహిళలు, రైతుల కలలను నెరవేర్చి, సాధికారత కల్పించడమే ఈ బడ్జెట్ ఏకైక లక్ష్యం.

ఓ కొత్త గుర్తింపును సముపార్జిస్తున్న, స్వీయ సామర్థ్యంపై అకుంఠిత విశ్వాసంగల దేశంగానే కాకుండా ప్రగతిశీల ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తున్న భారత్‌ను ఈ బడ్జెట్ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. కోవిడ్ అనంతర కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక ఆర్థిక విధానాలు ఆర్థిక వ్యవస్థకు నవ్యోత్తేజమిచ్చాయి. ఆ వేగానికి ఈ బడ్జెట్ మరింత ఊపునిస్తుంది. సంప్రదాయ రంగాల్లోనైనా, నవతరం పరిశ్రమల్లోనైనా ప్రపంచ వేదికపై భారత్‌ను అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యంగా నిలపడంలో ఇది తోడ్పడుతుంది. పశుసంపద ద్వారా రైతు ఆదాయం పెంచేందుకు దూరదృష్టితో కూడిన ఓ నిర్ణయాన్ని కూడా ఈ బడ్జెట్ ప్రకటించింది. పశువైద్యుల సంఖ్య పెంపుతో పాటు పశువైద్య శాలలు, శిక్షణ కేంద్రాల విస్తరణ వంటివి పశుసంపద ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. పాడి-పౌల్ట్రీ రంగాలకు రుణ సంధాన రాయితీలు, 500 జలాశయాల అభివృద్ధి ద్వారా మత్స్య రంగానికి ప్రోత్సాహం, ప్రపంచ మార్కెట్ల సౌలభ్యం వంటి నిర్ణయాలు రైతు ఆదాయం పెంపుపై ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ నిబద్ధతలో కీలకాంశాలు. మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్య స్వప్న సాకారం లక్ష్యంగా 'మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్ యోజన'ను ప్రారంభించాలని ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ నేత కార్మికులు, రైతులు సహా చేనేత పరిశ్రమకు కొత్త ఊపునిస్తుంది. తీరప్రాంతాల్లో కొబ్బరి ప్రోత్సాహక పథకం ద్వారా 3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది. జీడిపప్పు, కోకో ఉత్పత్తి-ఎగుమతులను ప్రోత్సహిస్తుంది.. చందన వృక్ష సంపదను పరిరక్షిస్తుంది. రైతుకు సౌభాగ్యం, వ్యవసాయం లాభదాయకం చేయడంపై నవ భారతం కట్టుబాటును స్పష్టం చేస్తుంది. దేశంలో అనుసంధానాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తూ 7 హై-స్పీడ్ రైలు



కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనను ఈ బడ్జెట్ ప్రకటించింది. ఈ కారిడార్లు దేశంలోని ప్రధాన ఆర్థిక, జనాభా కూడళ్ల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గిస్తూ నగరాల సంధానాన్ని వేగిరపరుస్తాయి.


**భవిష్యత్ భారత్ కోసం విశిష్ట దృక్పథం**

ఎన్నికలకు ముందు సమర్పించే బడ్జెట్లలో సాధారణంగా జనాకర్షక ప్రకటనలు ఓ సంప్రదాయంగా మారిన కాలమిది. అయితే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధాన సమగ్రతకు ఈ బడ్జెట్ అద్దం పడుతుంది. ప్రజానీకాన్ని ఆకట్టుకునే నిర్ణయాలకు బదులు దీర్ఘకాలిక దృక్పథానికి, "దేశమే ప్రధానం" విధానానికి ఇది ప్రాధాన్యమిచ్చింది. ఒకవైపు ఆర్థిక వ్యవస్థ వేగంగా పయనిస్తుంటే, మరోవైపు నవ భారతంలో 12 ఏళ్ల నవ్య విధానాల వల్ల దాదాపు 25 కోట్ల మంది పేదరిక విముక్తులయ్యారు. ఈ నేపథ్యంలో
ఆర్థిక క్రమశిక్షణతో ప్రగతి జోరును, వృద్ధి వేగాన్ని మరింత పెంచాలనే కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈ బడ్జెట్ ప్రస్ఫుటం చేస్తోంది. ద్రవ్య లోటును 4.5 శాతంకన్నా దిగువకు తేవాలన్న లక్ష్యాన్ని ఇది సాధించింది. 'దేశమే ప్రధానం' అనే దృష్టికోణం సహా అభివృద్ధి పెద్ద నగరాలకే పరిమితమనే

భావనకు భిన్నంగా 'భవిష్యత్ సంసిద్ధ భారత్' దార్శనికతను ఇది ప్రతిబింబిస్తుంది. మౌలిక సదుపాయాల కల్పనకు మూలధన వ్యయం కోసం ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ₹12.2 లక్షల కోట్లు కేటాయించింది. ఈ నిధులతో కొత్త రైలు కారిడార్లు, జాతీయ జల మార్గాలు దేశంలోని 2, 3 అంచెల్లోని నగరాలకు సంధానం మెరుగవుతుంది. తద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతూ, దేశం ఆకాంక్షలు సమున్నత శిఖరాలను చేరగలవు. సూక్ష్మ-చిన్న-మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలను భారత వృద్ధి గాథకు మూలస్తంభంగా, వెన్నెముకగా మార్చాలనే ప్రధానమంత్రి మోదీ దార్శనికతను ఈ బడ్జెట్ సాకారం చేస్తుంది. 'ఎంఎస్ఎంఈ' రంగం ప్రపంచీకరణ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు స్వయంసమృద్ధ భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే, పర్యాటక రంగానికీ ఈ బడ్జెట్ గణనీయ ప్రాధాన్యమిచ్చింది. రైతులు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు సహా సమాజంలోని అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ బడ్జెట్‌లో పొందుపరచిన కార్యాచరణ ప్రణాళిక మన ఆర్థిక వ్యవస్థను సరైన మార్గంలోకి మళ్లించి, ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపిస్తుంది. 'ఎంఎస్ఎంఈ'ల కోసం ₹10,000 కోట్ల వృద్ధి నిధిని కేటాయించిన నేపథ్యంలో 2, 3 అంచెల నగరాల్లోని 'ఎంఎస్ఎంఈ'ల బలోపేతంతోపాటు అవి తమ లక్ష్యాలను సాధించేలా ఈ నిధి తోడ్పడుతుంది. విద్య నుంచి స్వయం ఉపాధి వరకూ ప్రధానమంత్రి మోదీ దార్శనికతకు శక్తిమంతమైన ప్రతిబింబం ఈ బడ్జెట్. ప్రధాన పారిశ్రామిక, రవాణా కారిడార్ల చుట్టూ 5 విశ్వవిద్యాలయ శివారు నగరాల నిర్మాణం విద్య-పరిశ్రమ రంగాల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. దీనికితోడు నాలుగు టెలిస్కోప్ మౌలిక సదుపాయ కేంద్రాల నిర్మాణం, ఉన్నతీకరణ పరిశోధనలకు కొత్త ఊపునిస్తాయి. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్', 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో 'ఏవీజీసీ' లేబొరేటరీల ఏర్పాటు, 'విద్య నుంచి ఉపాధి.. వ్యవస్థాపకత'లపై ఉన్నత స్థాయి కమిటీ నియామకం, నవ తరానికి నైపుణ్య కల్పన సాధికారత, ప్రతి రంగంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపే నిబద్ధత తదితరాలను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తుంది.

**అభివృద్ధి - వారసత్వం**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ దార్శనికతలో అభివృద్ధి-వారసత్వం కీలకాంశాలు. ఈ మేరకు ధోలావీర సహా 15 పురావస్తు ప్రదేశాలను సాంస్కృతిక గమ్యాలుగా మార్చాలని ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. తద్వారా భారత్ తన ప్రాచీన సంస్కృతిని ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబెడుతుంది. ఇందులో భాగంగా ఈశాన్య భారతంలోని 5 రాష్ట్రాలలో బౌద్ధ సర్క్యూట్ల నిర్మాణం సహా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, అరకు లోయలో పర్వత మార్గాల




**ఈ బడ్జెట్ చరిత్రాత్మకం... దేశ మహిళలకు సాధికారత కల్పనను ఇది ప్రతిబింబిస్తుంది. వరుసగా 9వ సారి దేశ బడ్జెట్ను ప్రవేశపెట్టిన మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొత్త రికార్డు సృష్టించారు. అపార అవకాశాలకు ఈ బడ్జెట్ ఒక రాజమార్గం. వికసిత భారత్-2047 వైపు మన ప్రతిష్ఠాత్మక ప్రస్థానానికి ఇదొక బలమైన పునాది**


*నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

నిర్మాణం చేపడుతుంది. ఒడిశా, కర్ణాటక, కేరళలో తాబేళ్ల కోసం ప్రత్యేక మార్గాల నిర్మాణం ఈ ప్రాంతాలలో ప్రగతికి నవ్యోత్తేజమిస్తూ, పర్యావరణ పర్యాటకాన్ని కూడా ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా జాతీయ ఆతిథ్య సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ) ఏర్పాటుతో యువతకు నైపుణ్యాభివృద్ధి సహా ఉపాధి అవకాశాలు ఇనుమడించి, పర్యాటక రంగం బలోపేతం కాగలదు.


దేశాన్ని 2047కల్లా వికసిత భారత్‌గా రూపొందించేందుకు పునాది వంటి ఈ కేంద్ర బడ్జెట్- సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో దూసుకెళ్తున్న నవ భారత సంకల్పానికి నిస్సందేహంగా కొత్త శక్తిని, వేగాన్ని జోడిస్తుంది.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన 12వ పాలన ఏడాదిలో ప్రస్తుత బడ్జెట్ ద్వారా నవ భారతానికి మార్గం సుగమం చేసిన తీరును 12 రంగాల పురోగమనం ద్వారా అర్థం చేసుకుందాం...

## నిధులు ఇలా వస్తాయి....




## నిధుల ఖర్చు ఇలా....




## బడ్జెట్ అంచనాలు 2026-2027

- **53.5** లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ అంచనాల కింద కేటాయింపు
- **36.5** లక్షల కోట్ల రూపాయలు రుణేతర వసూళ్లు
- **28.7** లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వ నికర అంచనా పన్ను వసూళ్లు
- **17.2** లక్షల కోట్ల రూపాయలు స్థూల అంచనా మార్కెట్ రుణ సమీకరణ
- **4.3%** జీడీపీలో ద్రవ్య లోటుపై అంచనా

## ప్రధాన మంత్రిత్వ శాఖలకు కేటాయింపులు

| | |
|---|---|
| 8,84,678.28 | రక్షణ |
| 1,06,530.42 | ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం |
| 1,39,289.48 | విద్యా శాఖ |
| 1,40,528.78 | వ్యవసాయం-రైతు సంక్షేమం |
| 2,81,377.32 | రైల్వేలు |
| 85,522.39 | పట్టణాభివృద్ధి |
| 3,09,875.30 | రహదారి రవాణా-జాతీయ రహదారులు |
| 1,97,023.14 | గ్రామీణాభివృద్ధి |
| 94,807.84 | జల శక్తి |
| 2,55,233.53 | హోం వ్యవహారాలు |



★అంకెలు కోట్ల రూపాయలలో



# ‘ఎంఎస్‌ఎంఈ’లు

## వ్యవస్థాపన నుంచి ఉపాధి సృష్టి దాకా...

*దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పరిగణనలోగల సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగానికి ఈ బడ్జెట్లో నవ్యోత్తేజం లభించింది. ఉపాధి-ఉద్యోగ సృష్టి, ఆవిష్కరణలు సహా స్వయంసమృద్ధ భారత్ లక్ష్యాన్ని ఈ రంగం బలోపేతం చేస్తుంది. స్థానికం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగడంలో ప్రభుత్వ మద్దతుతో కొత్త శక్తిని పొందుతుంది...*

ప్రస్తుత (2026-27) ఆర్థిక సంవత్సరం ‘ఎంఎస్‌ఎంఈ’ల బడ్జెట్ **24,566.27** కోట్ల రూపాయలు

### ‘ఎంఎస్‌ఎంఈ’ల పరిధి విస్తరణ

- ఈ పరిశ్రమల కోసం ₹10,000 కోట్లతో ప్రత్యేక ‘ఎంఎస్‌ఎంఈ నిధి’ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.
- తయారీ రంగానికి 35.4 శాతం, ఎగుమతులకు 48.58 శాతం, ‘జీడీపీ’కి 31.1 శాతం వంతున ‘ఎంఎస్‌ఎంఈ’ రంగం తోడ్పాటునిస్తుంది.
- దేశంలోని 2, 3 అంచెల నగరాల్లో ‘కార్పొరేట్ మిత్ర’ పేరిట వృత్తి నిపుణులను తీర్చిదిద్దడంతో ‘ఐసీఏఐ, ఐసీఎస్ఐ, ఐసీఎంఏఐ’ వంటి వృత్తి విద్యా సంస్థలు తోడ్పాటునిస్తాయి. అందుబాటు వ్యయంతో చట్ట నిబంధనల అనుసరణలో ఈ ధ్రువీకృత పాక్షిక-వృత్తి నిపుణులు ‘ఎంఎస్‌ఎంఈ’లకు తోడ్పడతారు.

### నగదు రూపేణా సాయం

- రావలసిన వాణిజ్య బకాయిల డిస్కౌంట్ విధానం (ట్రెడ్స్) ద్వారా ‘ఎంఎస్‌ఎంఈ’లకు ₹7 లక్షల కోట్లకు పైగా నగదు అందుబాటులోకి వచ్చింది. ఈ విధానాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా 4 కీలక చర్యలను బడ్జెట్ ప్రతిపాదించింది.
- ‘ట్రెడ్స్’ వేదికపై ‘సీజీటీఎంఎస్ఈ’ ద్వారా రుణ హామీ మద్దతు యంత్రాంగం.
- ‘ఎంఎస్‌ఎంఈ’ల నుంచి ప్రభుత్వ కొనుగోళ్లపై రుణదాతలకు సమాచార ప్రదానం కోసం ‘జీఈఎం, ట్రెడ్స్’ అనుసంధానం.
- రావాల్సిన బకాయిలను ఆస్తి ఆధారిత సెక్యూరిటీలుగా ‘ట్రెడ్స్’ పరిగణించడం వల్ల సెకండరీ విపణికి ఉత్తేజం లభించి ద్రవ్య లభ్యతతోపాటు చెల్లింపు పరిష్కారాలు మెరుగవుతాయి.

### ఆర్థిక వృద్ధిని వేగిరపరచే ఆరు ప్రతిపాదనలు

- ఆర్థిక వృద్ధిని వేగిరపరచి, సుస్థిరం చేసే దిశగా ఆరు కార్యక్రమాలను బడ్జెట్ ప్రతిపాదించింది.
- ఏడు వ్యూహాత్మక, వినూత్న రంగాల్లో తయారీ పెంపు.
- వారసత్వ పారిశ్రామిక రంగాల పునరుజ్జీవనం.
- “ఛాంపియన్ ఎంఎస్‌ఎంఈ”ల సృష్టి
- మౌలిక సదుపాయాలకు బలమైన ప్రోత్సాహం.
- దీర్ఘకాలిక ఇంధన భద్రత, సుస్థిరతలకు భరోసా.
- నగర ఆర్థిక మండళ్ల రూపకల్పన.

### ‘ఎంఎస్‌ఎంఈ’ల సాధికారతకు వ్యూహాలు

- **ఈక్విటీ మద్దతు:** ‘ఎస్ఎంఈ వృద్ధి నిధి, స్వయంసమృద్ధ భారత్ నిధి’కి ₹10,000 కోట్ల అదనపు నిధులు.
- **లిక్విడిటీ మద్దతు:** ‘ట్రెడ్స్’ ద్వారా ₹7 లక్షల కోట్లకు పైగా ద్రవ్య లభ్యత.
- **వృత్తిపరమైన మద్దతు:** “కార్పొరేట్ మిత్ర”.. సరళ నిబంధనానుసరణ

## ఆర్థిక సంస్కరణలు

# ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే మార్గంలో ఇనుమడించిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' వేగం



*ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించేందుకు భారత్ శరవేగంగా దూసుకుపోతోంది. ఈ మేరకు ఆర్థిక, వ్యాపార, వాణిజ్య సౌలభ్య సంస్కరణల ఆధారిత 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' దేశాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలుగా పటిష్ఠ  కార్యాచరణ, సంస్కరణలు, ప్రజా సంక్షేమం వగైరాలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత (2026-27) ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఈ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగానికి మరింత ఉత్తేజమిస్తోంది...*

పేద, అణగారిన, వెనుకబడిన వర్గాలపై దృష్టి సారించే త్రిముఖ విధానానికి ప్రభుత్వ దృఢ 'సంకల్పం' అత్యంత అవశ్యం:

1. నిర్మాణాత్మక సంస్కరణల వేగం నిరంతరాయంగా, స్థిరంగా, ప్రగతిశీలమైనదిగా ఉండాలి.
2. పొదుపు సమీకరణ, ప్రభావశీల మూలధన కేటాయింపు, ముప్పుల నిర్వహణకు బలమైన, పునరుత్థాన శక్తియుత ఆర్థిక రంగం ప్రధానం.
3. కృత్రిమ మేధ అనువర్తనాలు సహా అత్యాధునిక సాంకేతికతలు సుపరిపాలనకు దోహదం చేస్తాయి.

ఉద్యోగ-ఉపాధి సృష్టి, ఉత్పాదకత పెంపు, వృద్ధికి ఉత్తేజం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆర్థిక సంస్కరణలను అమలు చేసింది. ఈ మేరకు 2025లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన అనంతరం 350కి పైగా సంస్కరణలు అమలయ్యాయి.

## వికసిత భారత్ కోసం సిద్ధమవుతున్న బ్యాంకింగ్ రంగం

భారత బ్యాంకింగ్ రంగం మునుపటితో పోలిస్తే నేడెంతో బలం పుంజుకుంది. ఆర్థిక స్థితిగతుల మెరుగుదల, రికార్డు స్థాయి లాభాలు, ఆస్తుల నాణ్యత ఇనుమడించడం సహా ఈ రంగం 98 శాతానికిపైగా గ్రామాలకు చేరువై సేవలందిస్తోంది. దీనికి మరింత ఊపునివ్వడమే కాకుండా దేశ భవిష్యత్ అవసరాలకు తగినట్లు సమగ్ర సమీక్ష దిశగా "వికసిత భారత్ కోసం బ్యాంకింగ్‌పై ఉన్నత స్థాయి కమిటీ" ఏర్పాటవుతుంది.



## షేర్ల బైబ్యాక్ ఇకపై మూలధన లాభంగా పరిగణన

షేర్ల బైబ్యాక్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఇకపై లాభాంశంగా కాకుండా మూలధన లాభంగా పరిగణిస్తారు. దీంతోపాటు బైబ్యాక్‌పై ప్రమోటర్లకు పన్ను శాతం మారుతూంటుంది. దేశీయ కంపెనీల ప్రమోటర్లపై ఇది 22 శాతంగానూ, ఇతర కంపెనీల వారిపై 30 శాతంగానూ ఉంటుంది. సత్వర లాభాల కోసం స్టాక్ మార్కెట్లోని ఫ్యూచర్స్-ఆప్షన్స్ ట్రేడింగ్లో ప్రవేశించే వారిని నిరుత్సాహపరిచే దిశగా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పైగల సెక్యూరిటీ బాండ్ల లావాదేవీల పన్ను (ఎస్టీటీ)ను 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, ప్రస్తుతం 0.1 శాతం, 0.125 శాతంగాగల ఆప్షన్ ప్రీమియంలు, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై 'ఎస్టీటీ'ని 0.15 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది.

## జీవన సౌలభ్యం

**చట్టపరమైన సంక్లిష్టతల తగ్గింపు.. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమలు**

ఆదాయపు పన్ను శ్లాబులు లేదా మినహాయింపులలో ఎలాంటి మార్పులు లేకుండా 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమలు.

సరళీకృత ఆదాయపు పన్ను నిబంధనలు, ఫారాల వివరాలు త్వరలో వెల్లడి. సామాన్య పౌరులు సులువుగా అనుసరించగలిగేలా కొత్త రూపంలో వివిధ రకాల ఫారాలు.

మోటారు ప్రమాదాల క్లెయిమ్స్ ట్రిబ్యునల్ నిర్ణయించిన వడ్డీపై సామాన్యులకు ఆదాయపు పన్ను వర్తించదు. దీనిపై మూలంలో ఎలాంటి పన్ను కోత ఉండదు.

విదేశీ ప్రయాణ ప్యాకేజీల విక్రయంపై మూలం నుంచి పన్ను వసూలు (టీసీఎస్)ను ప్రస్తుత 5 శాతం, 20 శాతాల నుంచి ద్రవ్య పరిమితితో నిమిత్తం లేకుండా 2 శాతానికి తగ్గించే ప్రతిపాదన.

విద్య, వైద్య అవసరాల కోసం సరళీకృత నగదు బదలాయింపు పథకం (లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్-ఎల్ఆర్ఎస్) కింద 'టీసీఎస్'ను ప్రస్తుత 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించే ప్రతిపాదన.

టీడీఎస్ సంబంధిత గందరగోళం తొలగింపు దిశగా మానవ వనరుల సేవా ప్రదానాన్ని కాంట్రాక్టర్లకు చెల్లింపుల కేటగిరీలోకి స్పష్టంగా తేవాలని ప్రతిపాదన. ఈ సేవలపై 'టీడీఎస్' 1 లేదా 2 శాతంగా మాత్రమే ఉంటుంది.

చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం ఓ కొత్త పథకం.. దీనికింద అంచనా అధికారికి దరఖాస్తుతో నిమిత్తం లేకుండా నిబంధనల ఆధారిత ఆటోమేటెడ్ ప్రక్రియ ద్వారా తక్కువ లేదా సున్నా మినహాయింపు నిమిత్తం ధ్రువీకరణ పొందవచ్చు.

నామమాత్రపు రుసుముతో సవరించిన రిటర్నుల దాఖలు గడువు డిసెంబరు 31 నుంచి మార్చి 31 వరకు పొడిగించే ప్రతిపాదన.

పన్ను రిటర్నుల దాఖలుకు వేర్వేరు గడువులుంటాయి... ఈ మేరకు ఐటీఆర్-1 లేదా ఐటీఆర్-2 దాఖలు చేసేవారికి ఎప్పటిలాగానే జూలై 31 వరకు సమయం ఉంటుంది. అయితే, ఆడిట్ రహిత వ్యాపారం, ట్రస్టులకు ఆగస్టు 31 వరకు సమయం ఇస్తారు.

స్థిరాస్తి అమ్మకంపై 'టీడీఎస్' కోసం ప్రవాసులు 'టాన్' పొందాల్సిన అవసరం ఉండదు. కొనుగోలుదారు అయిన నివాసి తన 'పాన్' ఆధారంగా చలాన్ రూపంలో 'టీడీఎస్'ను జమ చేయవచ్చు.

విద్యార్థులు, యువ నిపుణులు, సాంకేతిక సిబ్బంది, ప్రవాసులు, ఇతర చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం ఓ కొత్త పథకం ప్రతిపాదన. దీనికింద విదేశీ ఆస్తుల ప్రకటనకు 6 నెలల గడువు ఉంటుంది.

### జరిమానా... విచారణల హేతుబద్ధీకరణ

- అంచనా, జరిమానా ప్రక్రియలను ఉమ్మడి ఉత్తర్వులో విలీనం చేసే ప్రతిపాదన. తొలి అప్పీలు కాలంలో జరిమానా మొత్తంపై పన్ను చెల్లింపుదారు నుంచి వడ్డీ వసూలు ఉండదు. అలాగే ధరావతు మొత్తం 20 నుంచి 10 శాతానికి తగ్గింపు.
- పన్ను చెల్లింపుదారు సంబంధిత సంవత్సరానికి వర్తించే రేటుకు అదనంగా 10 శాతం పన్ను చెల్లించి, పునఃపరిశీలన ప్రక్రియల తర్వాత కూడా రిటర్నును నవీకరించుకోవచ్చు.




- ఆదాయం తక్కువగా చూపిన సందర్భాల్లో జరిమానా, విచారణల నుంచి లభించే ఉపశమనాన్ని ఇకపై తప్పుగా నివేదించిన సందర్భాలకూ వర్తింపజేస్తారు. అయితే, ఇలాంటి ఉదంతాల్లో పన్ను చెల్లింపుదారు పన్ను మొత్తంలో 100 శాతాన్ని అదనపు పన్ను కింద చెల్లించాల్సి ఉంటుంది.
- ఖాతాలు లేదా పత్రాల సమర్పణలో వైఫల్యం, వస్తు రూపంలో చెల్లింపులపై 'టీడీఎస్' మినహాయింపు పాటించడంలో వైఫల్యం ఇకపై నేరం కాదు... స్వల్ప కేసులలో జరిమానా మాత్రమే విధిస్తారు.

ఆరోగ్యం

# సామాజిక భద్రతకు వెన్నెముకగా బడ్జెట్



***మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించడం సహా ప్రతి వ్యక్తికీ అందుబాటులో చౌక, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవల ప్రదానం కూడా ఆరోగ్య బడ్జెట్ లక్ష్యంగా ఉంటుంది...***

ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ బడ్జెట్: **₹1,06,530.42** కోట్లు

**194%** గడచిన 12 ఏళ్లుగా ఆరోగ్య బడ్జెట్లో నమోదైన సంచిత వృద్ధి

**కేన్సర్ మందులు మరింత చౌక:** కేన్సర్ చికిత్సకు వాడే 17 రకాల ప్రాణరక్షక మందులపై ప్రాథమిక కస్టమ్స్ సుంకం పూర్తి మినహాయింపు. దీంతోపాటు ప్రత్యేక వైద్య అవసరాల కోసం సొంతంగా దిగుమతి చేసుకునే ఔషధాలు, మందులు, ఆహార పదార్థాలపై దిగుమతి సుంకం మినహాయింపు జాబితాలో మరో 7 అరుదైన వ్యాధుల జోడింపు.

**మానసిక ఆరోగ్యం... ట్రామా కేర్:** మానసిక ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ‘నిమ్హాన్స్-2’ ఏర్పాటు. మరోవైపు ప్రాంతీయ అత్యున్నత సంస్థలుగా రాంచీ, తేజ్పూర్లోని జాతీయ మానసిక ఆరోగ్య సంస్థల ఉన్నతీకరణ.



**పరిశోధన:** ప్రస్తుత (2026-27) బడ్జెట్ కాలం నుంచి వైద్య పరిశోధన కోసం కేటాయింపులను 24 శాతం పెంచి ₹4,821 కోట్లుగా నిర్ణయించారు.

**వృద్ధుల సంరక్షణ:** వృద్ధుల సంరక్షణ, సంబంధిత సేవల కోసం రాబోయే ఐదేళ్లలో 1,50,000 మంది సంరక్షణ ప్రదాతలకు శిక్షణ.

**వైద్య పర్యాటక సేవా కూడళ్లు:** దేశాన్ని వైద్య పర్యాటక సేవా కూడలిగా రూపొందించేందుకు ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో 5 ప్రాంతీయ వైద్య కేంద్రాల స్థాపన దిశగా రాష్ట్రాలకు మద్దతు. ఈ కేంద్రాలలో వైద్య, విద్యా, పరిశోధన సదుపాయాలు ఉంటాయి.

**జిల్లా ఆస్పత్రులు:** అత్యవసర, ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటు ద్వారా 50 శాతం జిల్లా ఆసుపత్రుల సామర్థ్యం బలోపేతం.

**ఏహెచ్పీ సంస్థల ఏర్పాటు:** దేశంలోని ప్రస్తుత అనుబంధ ఆరోగ్య వృత్తి నిపుణుల శిక్షణ సంస్థ (ఏహెచ్పీ)ల ఉన్నతీకరణ... ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొత్త 'ఏహెచ్పీ'ల ఏర్పాటు. ఈ మేరకు "ఆప్టోమెట్రీ,




రేడియాలజీ, అనస్థీషియా, ఓటీ టెక్నాలజీ, అప్లైడ్ సైకాలజీ, బిహేవియరల్ హెల్త్" సహా ఎంపిక చేసిన 10 సబ్జెక్టుల కింద రాబోయే ఐదేళ్లలో లక్ష 'ఏహెచ్పీ'లు వస్తాయి.

**పశువైద్య నిపుణులు:**



దేశవ్యాప్తంగా పశువైద్య నిపుణుల సంఖ్యను 20,000కు పైగా పెంచడంతో పాటు ప్రైవేట్ రంగంలో పశువైద్య కళాశాలలు, ఆస్పత్రులు, రోగనిర్ధారణ లేబొరేటరీలు, పశు సంతానోత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు చేయూతనిస్తూ రుణ సంధానిత మూలధన రాయితీకి ప్రతిపాదన.



**బయోఫార్మా శక్తి (జ్ఞానం-సాంకేతికత-ఆవిష్కరణలతో ఆరోగ్య సంరక్షణ వ్యూహం)**

దేశంలో మధుమేహం, కేన్సర్ సహా ఆటో ఇమ్యూన్ రుగ్మతల వంటి అసాంక్రమిక వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయి. అందువల్ల, దేశాన్ని ప్రపంచ బయోఫార్మా తయారీ కూడలిగా రూపొందించడానికి రాబోయే ఐదేళ్లలో ₹10,000 కోట్లతో 'బయోఫార్మా శక్తి'ని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా 3 కొత్త జాతీయ ఫార్మాస్యూటికల్ విద్య-పరిశోధన సంస్థలు సహా ప్రస్తుత 7 సంస్థల ఉన్నతీకరణ, బయోఫార్మా-కేంద్రక నెట్వర్క్ ఏర్పాటవుతాయి. దీంతో 1,000కి పైగా గుర్తింపు పొందిన భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్ల నెట్వర్క్ ఏర్పడుతుంది.

**ఆయుష్: ఈ రంగంలో 3 కొత్త 'ఎయిమ్స్' ఏర్పాటు**

- సంప్రదాయ వైద్య విధానాలను అనుసరించే వారి కోసం మూడు కొత్త అఖిల భారత ఆయుర్వేద సంస్థలు (ఎయిమ్స్) ఏర్పాటవుతాయి.
- జామ్నగర్లోని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్'తో పాటు ఆయుష్ ఫార్మసీలు, ఔషధ పరీక్ష లేబొరేటరీలు, నిదర్శనాధారిత పరిశోధన సంస్థల ఉన్నతీకరణ చేపడతారు.

**ఆయుష్ మంత్రిత్వశాఖ బడ్జెట్**

**₹4,408.93** కోట్లు




> వైద్య కేంద్రాల ఏర్పాటు, అనుబంధ ఆరోగ్య నిపుణుల సంఖ్య పెంపు, సృజనార్థిక వ్యవస్థకు (ఆడియో-విజువల్స్ గేమింగ్) ప్రోత్సాహం, పర్యాటకానికి ఉత్తేజం, ఖేలో ఇండియా మిషన్ తదితరాల ద్వారా యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయి
>
> *నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

స్వయంసమృద్ధ భారత్

# జౌళి పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యం

*ఈసారి కేంద్ర బడ్జెట్ జౌళి రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చింది. తదనుగుణంగా ఉద్యోగ కల్పన, ఎగుమతుల వృద్ధి, స్వయంసమృద్ధ భారత్ లక్ష్యంతో ఈ రంగాన్ని సంధానించింది. సంప్రదాయ చేనేత నుంచి ఆధునిక కృత్రిమ వస్త్రాలు, సాంకేతికాధారిత వస్త్ర తయారీ దాకా మొత్తం విలువ వ్యవస్థ బలోపేతంపై ప్రభుత్వం నిశితంగా దృష్టి సారిస్తోంది...*



ప్రస్తుత (2026-27) ఆర్థిక సంవత్సరంలో జౌళి మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపు

**₹5729.01 కోట్లు**

*జౌళి రంగంలో పోటీతత్వం, స్వావలంబన, ఉపాధిని ప్రోత్సహించేందుకు ఒక సమీకృత కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది, ఇందులో 5 ఉప-విభాగాలున్నాయి...*

- **జాతీయ ఫైబర్ పథకం:** ఫైబర్ రంగంలో స్వావలంబన లక్ష్యంగా ప్రారంభించిన ఈ పథకం పట్టు, ఉన్ని, జనపనార వంటి సహజ వస్త్రాలతోపాటు కృత్రిమ, ఆధునిక వస్త్రాలకూ మద్దతిస్తుంది.
- **జౌళి రంగం విస్తరణ-ఉపాధి పథకం:** యంత్రాల కొనుగోలుకు మూలధన సహాయం, సాంకేతికతల ఉన్నతీకరణ, ఉమ్మడి పరీక్ష-ధ్రువీకరణ కేంద్రాల ఏర్పాటు ద్వారా సంప్రదాయ వస్త్ర సముదాయాల ఆధునికీకరణ దీని లక్ష్యాలు.
- **జాతీయ చేనేత.. హస్తకళల కార్యక్రమం:** చేనేత కార్మికులు, హస్తకళాకారుల కోసం ప్రస్తుత పథకాలను ఒకే జాతీయ కార్యక్రమం కిందకు తెస్తూ బలోపేతం చేస్తారు. నేత కార్మికులతోపాటు హస్త కళాకారులకు ఇది లక్షిత, ప్రభావశీల చేయూతనిస్తుంది.
- **సాంకేతిక-పర్యావరణ హిత కార్యక్రమం:** ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల, పర్యావరణ హిత వస్త్రాలు, దుస్తుల తయారీని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యం.

> **మేక్ ఇన్ ఇండియా, స్వయంసమృద్ధ భారత్ అభియాన్కు నవ్యోత్తేజం దిశగా ఈ బడ్జెట్ ఓ ప్రతిష్ఠాత్మక భవిష్యత్ ప్రణాళికను ప్రతిపాదించింది. ఈ మేరకు నవ్య సాంకేతిక పరిజ్ఞానాధారిత పరిశ్రమలకు... అంటే- సరికొత్త రంగాలకు అసాధారణ మద్దతు ప్రకటించింది**
>
> *నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

### వాణిజ్య సౌలభ్యం

**భారత లిస్టెడ్ కంపెనీల షేర్లలో పెట్టుబడులకు భారత్ వెలుపల నివసించే వ్యక్తిగత (పీఆర్ఓఐ) పెట్టుబడిదారులను అనుమతిస్తారు. ఇందులో భాగంగా మొత్తం పెట్టుబడి పరిమితి 10 నుంచి 24 శాతానికి, వ్యక్తిగత పెట్టుబడిదారు పరిమితి 5 నుంచి 10 శాతానికి పెంచారు.**








## సమర్థ్ 2.0

ఉన్నతీకరించిన నైపుణ్య కార్యక్రమం కింద విస్తృత సహకారంతో జౌళి నైపుణ్యావరణ వ్యవస్థను ఆధునికీకరిస్తారు.

## మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్ కార్యక్రమం

ఖాదీ, చేనేత, హస్తకళల బలోపేతం లక్ష్యంగా మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ప్రపంచ విపణి అనుసంధానం, బ్రాండింగ్, క్రమబద్ధ శిక్షణ, నైపుణ్యం-నాణ్యతల మెరుగుదల, ప్రక్రియల ఆధునికీకరణపై ఇది దృష్టి సారిస్తుంది.

## అరుదైన లోహాలు

"రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ పథకం' 2025 నవంబరులో ప్రారంభమైన నేపథ్యంలో దీనికి సంబంధించి ఖనిజ సంపన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఒడిశా రాష్ట్రాలకు ప్రస్తుత బడ్జెట్ మద్దతు ప్రకటించింది.

## కంటెయినర్ తయారీ

ఐదేళ్ల కాలానికిగాను బడ్జెట్లో ₹10,000 కోట్ల కేటాయింపుతో కంటెయినర్ తయారీ పథకం ప్రారంభమవుతుంది.

> **వృద్ధి వేగం కొనసాగేందుకు మార్గం సుగమం చేస్తున్నాం. అంటే- వృద్ధి వేగం లేదా సుస్థిర ఆర్థిక ప్రగతికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నాం. ప్రధానంగా నిర్మాణాత్మక సంస్కరణలతో సముచిత వ్యవస్థ సృష్టిపై మేమిప్పుడు దృష్టి సారించాం. ఉత్పాదకత మెరుగుదల, ఉపాధి సృష్టికి తగిన వాతావరణ కల్పన లక్ష్యంతో మా సంస్కరణ కార్యకలాపాలు కొనసాగుతాయి.**
>
> *నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి*

**సమగ్ర.. సమీకృత విధాన చట్రంపై ప్రకటన**

**ఉపాధి కల్పన, ఎగుమతులు, గ్రామీణ జీవనోపాధి, సుస్థిర తయారీలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రమ ఆధారిత జౌళి రంగానికి 2026-27 బడ్జెట్ ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. ఫైబర్ నుంచి ఫ్యాషన్ దాకా, గ్రామీణ పరిశ్రమల నుంచి ప్రపంచ విపణి దాకా యావత్ జౌళి విలువ వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా సమగ్ర, సమీకృత విధాన చట్రాన్ని ప్రభుత్వం ప్రకటించింది.**

### మెగా టెక్స్టైల్ పార్కులు

**దేశంలో మెగా టెక్స్టైల్ పార్కులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇవి సాంకేతిక వస్త్ర తయారీని కూడా ప్రోత్సహిస్తాయి.**

### ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ విధానం

**టెక్స్టైల్ రంగంలో సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లకు ద్రవ్య లభ్యతతో పాటు వాటి బలోపేతానికి, ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ (ట్రెడ్స్) ప్రభావశీలతను పెంచడానికి ప్రభుత్వం కీలక చర్యలు ప్రకటించింది.**

### వస్త్ర, చర్మ, సముద్ర ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహిస్తూ బడ్జెట్లో పలు కీలక ప్రకటనలు

- **సుంకం రహిత దిగుమతి ముడి పదార్థాలతో తయారు చేసిన వస్త్ర, చర్మ దుస్తులు లేదా సింథటిక్ పాదరక్షలు సహా ఇతరత్రా చర్మ ఉత్పత్తుల ఎగుమతిదారులకు ఎగుమతి బాధ్యత కాలపరిమితి 12 నెలలకు పొడిగింపు.**
- **ఈ చర్య వల్ల ఎగుమతిదారులకు అధిక కార్యాచరణ, నిబంధనల అనుసరణలో సౌలభ్యం సహా నిర్వహణ మూలధన యాజమాన్యం మెరుగుపడుతుంది.**
- **'ట్రెడ్స్' ద్వారా జౌళి రంగంలోని సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమలకు నగదు రూపేణా చేయూత.**

మహిళా లోకం

# విద్య దిశగా కొనసాగుతున్న కృషి

*మహిళలకు విద్యనందించి ఉన్నత స్థితికి చేర్చడం ద్వారా వారికి సాధికారత ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా బడ్జెట్లో మహిళలకు సంబంధించి ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అనేక కీలక ప్రకటనలు చేశారు. దీనివల్ల జనాభాలో సగమైన మహిళా లోకానికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుంది. మహిళల సారథ్యాన, మహిళలు నిర్వహించే స్వయం సహాయ సంఘాల ఆధునికీకరణకు ప్రస్తుత బడ్జెట్ ప్రాధాన్యం ఇచ్చింది. తద్వారా ఇంటింటికీ సౌభాగ్యం చేరేలా చూడాలని లక్ష్యనిర్దేశం చేసుకుంది...*




## మహిళా హాస్టళ్లు

దేశంలోని ప్రతి జిల్లాలో బాలికల హాస్టళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యారంగంలో లింగ సమానత్వం, భద్రత, సాధికారతల బలోపేతంలో ఈ కార్యక్రమం ఓ కీలక మలుపు.

## స్వయం సహాయ వ్యవస్థాపన 'షీ-మార్ట్' కార్యక్రమం

- 'లఖ్పతి దీదీ యోజన' విజయం ఆధారంగా బడ్జెట్లో స్వయం సహాయక వ్యవస్థాపన దిశగా 'షీ మార్ట్' కార్యక్రమానికి ఈ బడ్జెట్లో ప్రభుత్వం నిధులు కేటాయించింది.
- పశుపోషణ, వ్యవసాయ సంబంధ కార్యకలాపాలు, ఇతర వృత్తులలో నిమగ్నమైన మహిళలు కేవలం జీవనోపాధికి పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం.
- స్వయం సహాయ సంఘాలు, గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు కొత్త మార్కెట్ కల్పించే దిశగా ఒక వేదిక కింద ప్రతి జిల్లాలో సామాజిక యాజమాన్యంలో చిల్లర విక్రయ దుకాణాలు ఏర్పాటవుతాయి.
- 'షీ-మార్క్' బ్యాడ్జ్ ప్రారంభంతో మహిళలకు సులభంగా ఆర్థిక సహాయ సదుపాయం కలుగుతుంది.




ప్రస్తుత (2026-27) ఆర్థిక సంవత్సరంలో లింగ బడ్జెట్ పత్రం (జీబీఎస్) ద్వారా మహిళలు, బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.5 లక్షల కోట్లు కేటాయించింది. ఇది 2025-26లో కేటాయించిన రూ.4.49 లక్షల కోట్లతో పోలిస్తే 11.36 శాతం అధికం.



యువతరం

# కొత్త అవకాశాలకు బాటలు

*ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఇది యువతరం కోసమే ఉద్దేశించినదని అభివర్ణించారు. ఆ మేరకు యువత ఆలోచనలు, కలలు, సంకల్పం, చైతన్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. తదనుగుణంగా వివిధ రంగాలకు బడ్జెట్ కేటాయింపుతో వాటిలో అగ్రగాములు, ఆవిష్కర్తలు, సృజనకర్తలు రూపొందుతారు. అంతేగాక ఖేలో ఇండియా మిషన్ ద్వారా యువ క్రీడాకారులకు కొత్త అవకాశాలు లభిస్తాయి...*

## విద్య

- ప్రధాన పారిశ్రామిక, రవాణా కారిడార్ల పరిసరాల్లో పోటీ పద్ధతి ద్వారా రాష్ట్ర స్థాయిలో 5 విశ్వవిద్యాలయ శివారు పట్టణాల ఏర్పాటుకు కేంద్రం చేయూతనిస్తుంది.
- దేశంలోని తూర్పు ప్రాంతంలో కొత్త జాతీయ డిజైన్ సంస్థ ఏర్పాటుకు ప్రతిపాదన.
- ఖగోళ భౌతిక-ఖగోళ శాస్త్ర రంగాలను ప్రోత్సహిస్తూ 4 టెలిస్కోప్ సదుపాయాల ఏర్పాటు.

బడ్జెట్

**విద్యా మంత్రిత్వ శాఖకు మొత్తం బడ్జెట్ కేటాయింపులు**

**₹139289.48 కోట్లకు చేరగా, 2025-26 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 8.27 శాతం పెరుగుదల కనిపిస్తోంది.**

## విద్య నుంచి ఉపాధి... వ్యవస్థాపన వరకూ...

వికసిత భారత్కు కీలక చోదకశక్తి అయిన సేవా రంగంపై దృష్టి సారిస్తూ 'విద్య నుంచి ఉపాధి.. వ్యవస్థాపన' లక్ష్యంగా ఉన్నత స్థాయీ సంఘం ఏర్పాటుకు బడ్జెట్ ప్రతిపాదించింది. ఈ నిర్ణయం వల్ల భారత్ 2047 నాటికి 10 శాతం అంతర్జాతీయ వాటాతో అగ్ర స్థానంలో నిలుస్తుంది.

## సృజనార్థిక వ్యవస్థ

దేశంలోని 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో 'ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ లేబొరేటరీ'ల ఏర్పాటు కోసం ముంబైలోని 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ'కి తోడ్పాటు ప్రతిపాదన.

## క్రీడలు

దేశంలోని 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో 'ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ లేబొరేటరీ'ల ఏర్పాటు కోసం ముంబైలోని 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ'కి తోడ్పాటు ప్రతిపాదన.

### ఖేలో ఇండియా మిషన్ ద్వారా అనేక సౌకర్యాల కల్పన....

- ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయి శిక్షణ కేంద్రాల మద్దతుతో ఒక సమీకృత ప్రతిభ ప్రోత్సాహక మార్గం.
- శిక్షకులను, సహాయక సిబ్బందిని క్రమబద్ధంగా తీర్చిదిద్దడం.
- క్రీడా విజ్ఞానం... సాంకేతిక పరిజ్ఞానాల ఏకీకరణ.
- క్రీడా సంస్కృతిని ప్రోత్సహిస్తూ యువ క్రీడాకారులు రాటుదేలేందుకు పోటీలు, లీగ్ల నిర్వహణ.
- శిక్షణ, పోటీల కోసం క్రీడా సంబంధిత మౌలిక సదుపాయాల కల్పన.



వ్యవసాయానికి సాధికారత

# అన్నదాత కలల సాకారం



*దేశంలో వ్యవసాయం, పాడి పరిశ్రమ సహా మత్స్య రంగానికి కేంద్ర ప్రభుత్వం సదా అత్యంత ప్రాధాన్యమిస్తూ వచ్చింది. ఈ మేరకు ప్రస్తుత బడ్జెట్లో కొబ్బరి, జీడిపప్పు, కోకో, గంధపు వనాల సాగు చేస్తున్న రైతుల కోసం అనేక కీలక చర్యలు చేపట్టింది. తద్వారా మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో వ్యవస్థాపనకు ప్రోత్సాహం లభించడంతోపాటు గ్రామాలలో మరిన్ని ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు అందివస్తాయి...*

**₹1,70,944** కోట్ల మేర కేటాయింపుల ద్వారా రసాయన-సేంద్రియ ఎరువులను చౌక ధరలకు అందుబాటులో ఉంచడానికి రాయితీల ద్వారా సాగు వ్యయం తగ్గిస్తూ రైతుకు ఉపశమనం ప్రకటించింది.

## అధిక విలువగల వ్యవసాయం

*అధిక విలువ గల పంటల సాగుకు ప్రభుత్వ మద్దతు:*

- తీరప్రాంతాలలో కొబ్బరి, గంధం, కోకో, జీడిపప్పు వంటి అధిక విలువగల పంటలకు మద్దతు.
- కొబ్బరి ఉత్పత్తిలో పోటీతత్వం పెంపు లక్ష్యంగా కొబ్బరి ప్రోత్సాహక పథకం.
- ఈశాన్య రాష్ట్రాలలో 'అగర్' చెట్లను, కొండ ప్రాంతాలలో బాదం, వాల్నట్, ఆప్రికాట్ వంటి పండ్ల మొక్కల సాగుకు ప్రోత్సాహం.
- భారతీయ జీడిపప్పు, కోకోలను 2030 నాటికి అత్యంత నాణ్యమైన అంతర్జాతీయ బ్రాండ్లుగా రూపొందించే ప్రత్యేక కార్యక్రమం ప్రారంభానికి ప్రతిపాదన.

### రైతు ఆదాయం పెంపు

- **రైతు ఆదాయం పెంపు దిశగా మత్స్య పరిశ్రమతోపాటు 500 జలాశయాలు-అమృత సరోవరాల సమీకృత అభివృద్ధి, పశుసంవర్ధకం సహా అధిక విలువగల వ్యవసాయానికి ప్రోత్సాహం.**



### భారత్-విస్తార్

- కేంద్ర బడ్జెట్లో 'భారత్-విస్తార్'ను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇదొక బహుళ భాషా ఏఐ ఉపకరణం. అగ్రిస్టాక్ పోర్టళ్లను, వ్యవసాయ పద్ధతులపై 'ఐసిఏఆర్' ప్యాకేజీని ఇది ఏఐ వ్యవస్థలతో సంధానిస్తుంది

### గ్రామీణాభివృద్ధి విభాగానికి కేటాయింపులు పెంపు

- ఈ ఏడాది గ్రామీణాభివృద్ధి విభాగానికి బడ్జెట్ 21 శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి- వ్యవసాయ మంత్రిత్వ శాఖ కిందగల రెండు విభాగాల సంయుక్త బడ్జెట్ రూ.4,35,779 కోట్లు దాటింది.
- ఈ ఏడాది వ్యవసాయ విభాగం బడ్జెట్ రూ.1,32,561 కోట్లకు పెరిగింది. వ్యవసాయ విద్య, పరిశోధన కోసం రూ.9,967 కోట్లు కేటాయింపుతో పరిశోధన-ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుంది.
- జాతీయ ఫైబర్ పథకం దేశంలో పట్టు, ఉన్ని, జనపనార వంటి ఫైబర్లపై దృష్టి సారిస్తుంది. వీటితో ముడిపడిన రైతులకు ఈ పథకంతో ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుంది.

### సహకార రంగానికి అనేక ప్రోత్సాహకాలు

- ప్రాథమిక సహకార సంఘాలు ఉత్పత్తి చేసే పశుగ్రాసం, పత్తి విత్తనాల సరఫరాపై పన్ను మినహాయింపు.
- కొత్త పన్ను విధానం కింద సహకార సంఘాల మధ్య డివిడెండ్ ఆదాయంపై మినహాయింపు.



దివ్యాంగుల సాధికారత శాఖకు ఈ ఏడాది (2026-27) బడ్జెట్ కేటాయింపు ₹1669.72 కోట్లు.

దివ్యాంగులు

# ఆత్మగౌరవం.. అవకాశం.. స్వావలంబన

***దివ్యాంగుల ముందడుగుకు, వారిని సమ్మిళిత అభివృద్ధి ప్రధాన స్రవంతిలోకి తెచ్చి సాధికారత కల్పించడం లక్ష్యంగా ఈ ఏడాది బడ్జెట్ సామాజిక బాధ్యతను మించి ఒక నిర్దిష్ట భవిష్యత్ ప్రణాళికను ప్రకటించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, సహాయక పరికరాల లభ్యత, ఉపాధి అవకాశాల విస్తరణపై దృష్టి సారించింది. తదనుగుణంగా దివ్యాంగుల స్వావలంబన, గౌరవప్రద జీవనం దిశగా వారికి సమాన అవకాశాల కల్పన ఈ బడ్జెట్ లక్ష్యాలు...***

## జీవన సౌలభ్యం

### దివ్యాంగులకు సాధికారత

**వికలాంగుల నైపుణ్యాభివృద్ధి పథకం:** ఈ పథకం పరిశ్రమ సంబంధిత, సానుకూల శిక్షణ ద్వారా దివ్యాంగుల ప్రతి సమూహానికీ గౌరవప్రద జీవనోపాధి అవకాశాలను కల్పిస్తుంది. ఇది పరిశ్రమల భాగస్వామ్యం ద్వారా ఆత్మగౌరవంతో జీవించగల ఉపాధి అవకాశాలను అందిస్తుంది. ఇందులో దివ్యాంగ మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా ఉంటాయి. ఈ పథకం కింద ఐటీ, ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్), ఆతిథ్య రంగాల్లో దివ్యాంగులకు సానుకూల శిక్షణ లభిస్తుంది.

### సాయుధ దళాల దివ్యాంగ సిబ్బందికి పెన్షన్

పారామిలిటరీ సహా సాయుధ దళాల సిబ్బందికి సేవా, పరిస్థితి ప్రాబల్య వైకల్యాన్ని బట్టి దివ్యాంగ పెన్షన్ వర్తిస్తుంది. ఆ మేరకు ఆర్మీ, నేవీ లేదా వైమానిక దళాల్లో సేవల సమయాన సంభవించిన లేదా తీవ్రంగా మారిన శారీరక వైకల్యం వల్ల సేవల నుంచి విముక్తులైన సిబ్బంది కోసం ప్రత్యేక నిబంధనల రూపకల్పన.

**వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ** ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, అనుబంధ సంరక్షణ సేవా కేంద్రాలు ఏర్పాటవుతాయి. రాబోయే కొన్నేళ్లలో 1.5 లక్షల సంరక్షణ సేవా ప్రదాతలకు శిక్షణ ఇస్తారు.

### దివ్యాంగుల ఆసరా పథకం

*అర్హులైన దివ్యాంగులందరికీ అధిక-నాణ్యతగల సహాయక పరికరాల సకాల లభ్యత.*

- పరిశోధన-అభివృద్ధి, ఏఐ ఏకీకరణలో పెట్టుబడి కోసం 'ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఏఎల్ఐఎంసీఓ)కు సహాయం లభిస్తుంది.
- 'పీఎం దివ్యాశ' కేంద్రాల బలోపేతం, అసిస్టివ్ టెక్నాలజీ మార్ట్లను ఆధునిక రిటైల్ తరహా కేంద్రాలుగా ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉన్నాయి. వీటి ద్వారా దివ్యాంగులు, వృద్ధులు సహాయక ఉత్పత్తులను చూడటంతోపాటు ధరించి చూడవచ్చు... కొనుగోలు కూడా చేయవచ్చు.
- దివ్యాంగుల ఆసరా పథకం కింద సహాయక పరికరాల ఉత్పత్తి పెంపు, పరిశోధన-అభివృద్ధిలో పెట్టుబడుల నిమిత్తం, కృత్రిమ మేధ సహా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల ఏకీకరణ కోసం ప్రభుత్వం 'ఏఎల్ఐఎంసీఓ'కు ఆర్థిక సహాయం అందిస్తుంది.

భవిష్యత్ భారతం

# అభివృద్ధికి మౌలిక సదుపాయాలే చోదకాలు

***ఏ దేశంలోనైనా లేక రాష్ట్రంలోనైనా అభివృద్ధికి అతి కీలక ప్రమాణం దాని మూలధన బడ్జెట్. ప్రభుత్వ మూలధన వ్యయం ఎంత ఎక్కువగా ఉంటే- అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అంత ఎక్కువగా సమకూరుతాయి. అందుకే, గడచిన 12 ఏళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన మౌలిక సదుపాయాల కల్పన కోసం మూలధన వ్యయాన్ని ప్రభుత్వం ₹2 లక్షల కోట్ల నుంచి ₹12.2 లక్షల కోట్లకు పెంచింది. తదనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టారు...***



**ఆరు రెట్లు పెరిగిన మౌలిక సదుపాయాల బడ్జెట్**

| | | |
|---|---|---|
| ₹12.2 లక్షల కోట్లు | ₹11.2 లక్షల కోట్లు | ₹2 లక్షల కోట్లు |
| 2026-27 | 2025-26 | 2014-15 |

## నగరాలను మధ్య దూరాన్ని తగ్గిస్తూ 7 హై-స్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం

**కేంద్ర బడ్జెట్ 2026-27**

**భారతీయ రైల్వేల కోసం మునుపెన్నడూ లేనంత అధికంగా ₹2,93,030 కోట్ల మూలధన వ్యయం (కేపెక్స్) కేటాయింపు.**

- రైల్వేలు ఈ నిధులను ప్రధానంగా హై-స్పీడ్ సంధానం, సరకు రవాణా, భద్రతకోసం వెచ్చిస్తాయి.

- చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలతో దక్షిణ హై-స్పీడ్ డైమండ్ ఏర్పడుతుంది. ఇది 5 దక్షిణ భారత రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరిలకు గొప్ప వరం కాగలదు.




- దక్షిణ హై-స్పీడ్ కారిడార్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

సుమారు 4,000 కిలోమీటర్ల మేర నిర్మితమయ్యే ఈ హై-స్పీడ్ రైలు కారిడార్లు సుమారు **₹16 లక్షల కోట్లు** పెట్టుబడులు వస్తాయని అంచనా.

- ప్రతిపాదిత కారిడార్ నిర్మాణంతో నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుంది. ప్రయాణికులకు నిరంతర బహుళ-రవాణా సౌకర్యం కలుగుతుంది. ఈ మేరకు
  - ముంబై – పుణె
  - పుణె – హైదరాబాద్
  - హైదరాబాద్ - బెంగళూరు
  - హైదరాబాద్ – చెన్నై
  - చెన్నై - బెంగళూరు
  - ఢిల్లీ - వారణాసి
  - వారణాసి – సిలిగురి

  మార్గాలు నిర్మితమవుతాయి.


## పర్యావరణ హిత సరకు రవాణా




తూర్పున డంకుణీ నుంచి పశ్చిమాన సూరత్ వరకూ (2052 కిలోమీటర్లు) కొత్త ప్రత్యేక సరకు రవాణా కారిడార్ నిర్మితమవుతుంది.




ఒడిశాలోని జాతీయ జలమార్గం-5తో మొదలై తాల్చేర్, అంగుళ్ వంటి ఖనిజ సంపన్న ప్రాంతాలతోపాటు కళింగనగర్ వంటి పారిశ్రామిక కేంద్రాలను పారాదీప్, ధమ్రా ఓడరేవులతో సంధానించే 20 కొత్త జాతీయ జలమార్గాలు రాబోయే ఐదేళ్లలో ప్రారంభమవుతాయి.



జలమార్గాల కోసం మానవశక్తిని తీర్చిదిద్దడానికి, యువతకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రాంతీయ విశిష్ట కేంద్రాలుగా శిక్షణ సంస్థలు ఏర్పాటవుతాయి. అంతర్గత జలమార్గాల అవసరాలను తీర్చేవిధంగా వారణాసి, పాట్నా నగరాల్లో ఓడల మరమ్మతు కేంద్రాలు ఏర్పాటవుతాయి.



దేశ రవాణా రంగంలో 2047 నాటికి జలమార్గాలతోపాటు తీరప్రాంత రవాణా వాటాను 6 శాతం నుంచి 12 శాతానికి పెంచాలన్నది లక్ష్యం. తదనుగుణంగా తీరప్రాంత సరకు రవాణా ప్రోత్సాహక పథకం ప్రారంభమవుతుంది.



చివరి అంచెతోపాటు మారుమూల ప్రాంతాల అనుసంధానం, పర్యాటకాభివృద్ధి నిమిత్తం 'సీప్లేన్'ల దేశీయ తయారీకి ప్రోత్సాహం... ఈ మేరకు 'సీప్లేన్ వీజీఎఫ్ పథకం ప్రారంభమవుతుంది.

### కార్బన్ క్యాప్చర్, వినియోగం, నిల్వ (సి సి యూ యస్)

డిసెంబర్ 2025లో రూపొందించబడిన ప్రణాళికకు అనుగుణంగా, విద్యుత్ ఉత్పత్తి, ఉక్కు, సిమెంట్ , రసాయనాలు వంటి ఐదు పారిశ్రామిక రంగాల్లో భారీ స్థాయి (సి సి యూ యస్) సాంకేతికతలను అమలు చేయాలని ప్రతిపాదించారు.

**ఈ ప్రణాళిక అమలు కోసం వచ్చే ఐదు సంవత్సరాల్లో సుమారు ₹20,000 కోట్లు కేటాయించనున్నారు.**



### మౌలిక సదుపాయాల ముప్పు నివారణ హామీ నిధి ఏర్పాటు


- ప్రభుత్వ రంగ సంస్థల కీలక స్థిరాస్తుల పునర్నవీకరణను వేగిరపరచడం కోసం ప్రత్యేక 'స్థిరాస్తి పెట్టుబడి ట్రస్టు'ల (ఆర్ఈఐటీ) ఏర్పాటు
- దేశంలో 5 లక్షలకన్నా ఎక్కువ జనాభాగల (2, 3 అంచెల) నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం తన నిబద్ధతను కొనసాగిస్తుంది.
- మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణ రంగంలో ప్రైవేట్ డెవలపర్ల విశ్వాస బలోపేతం దిశగానే కాకుండా రుణదాతలకు పాక్షిక రుణ హామీ ఇచ్చేందుకు వీలుగా మౌలిక సదుపాయాల ముప్పు నివారణ హామీ నిధి ఏర్పాటవుతుంది.
- ప్రభుత్వ రంగ సంస్థలు డిజిటలీకృత ఆటోమేటెడ్ సర్వీస్ బ్యూరోలుగా 2 ప్రదేశాలలో హై-టెక్ టూల్ రూమ్లు ఏర్పాటు.
- అధిక-విలువ, సాంకేతికంగా అధునాతన నిర్మాణ-మౌలిక సదుపాయాల కల్పన పరికరాల దేశీయ ఉత్పత్తి బలోపేతం కోసం ఒక పథకం ప్రారంభమవుతుంది.
- ప్రపంచ పోటీతత్వంతో కంటెయినర్ల తయారీ వ్యవస్థ సృష్టి కోసం ఐదేళ్లకుగాను

**₹10,000** కోట్ల బడ్జెట్ కేటాయింపుతో ఒక కంటెయినర్ తయారీ పథకాన్ని కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది.



### పట్టణ ఆర్థిక మండలాలు

దేశ వృద్ధితోపాటు ఆవిష్కరణలు, అవకాశాలకు నగరాలే చోదకశక్తులు. ఈ నేపథ్యంలో ఇకపై 2, 3 అంచెల నగరాలు సహా తీర్థయాత్రా పట్టణాలపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. వీటిలో ఆధునిక మౌలిక సదుపాయాలు, కనీస సౌకర్యాలు కల్పించడం అత్యావశ్యకం. ఆర్థిక శక్తి సద్వినియోగం సహా నగరాల సామర్థ్యం పెంచడానికి, పోటీ పద్ధతిలో ప్రణాళికల అమలు కోసం ఐదేళ్లలో ప్రతి పట్టణ ఆర్థిక మండలానికి ₹5000 కోట్ల వంతున నిధుల కేటాయింపును ప్రభుత్వం ప్రతిపాదించింది.





వృద్ధి చోదకాలు

# అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలు... డిజిటలీకరణ

***భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద అంకురావరణ వ్యవస్థ మాత్రమేగాక మొబైల్ ఫోన్ ఎగుమతిదారు దేశాల్లో కీలక స్థానం పొందింది. ఇక "ఏఐ మిషన్, నేషనల్ క్వాంటం మిషన్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్, రీసెర్చి-డెవలప్మెంట్-ఇన్నోవేషన్ ఫండ్" వంటి కార్యక్రమాల ద్వారా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలకు మద్దతిచ్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నట్లు బడ్జెట్లో ప్రకటించింది...***

**₹40,000** కోట్లు | ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ పథకానికి కేటాయింపు.

**15.5%** | ఏకరూప సేఫ్ హార్బర్ మార్జిన్ వర్తింపు...అలాగే, అన్నిరకాల సమాచార సాంకేతిక సేవలు ఒకే కేటగిరీ కింద ఉంటాయి.

- సాఫ్ట్వేర్ రూపకల్పన, ఐటీ ఆధారిత సేవలు, నాలెడ్జ్ ప్రాసెస్ అవుట్సోర్సింగ్ సేవలు, సాఫ్ట్వేర్ అభివృద్ధి సంబంధిత పరిశోధన-ఆవిష్కరణ సేవలలో భారత్ ఇప్పటికే అగ్రగామి. ఈ నేపథ్యంలో ఈ సేవలన్నిటినీ సమాచార సాంకేతిక సేవల కింద ఒకే కేటగిరీ కిందకు చేరుస్తారు. వీటిపై 15.5 శాతం ఏకరూప సేఫ్ హార్బర్ మార్జిన్ను వర్తింపజేస్తారు.
- ఐటీ సేవలపై సేఫ్ హార్బర్ పరిమితి ₹300 కోట్ల నుంచి ₹2000 కోట్లకు పెంపు.
- ఐటీ సేవలకు సేఫ్ హార్బర్ ఆమోదం ఇకపై స్వయంచలితం. దరఖాస్తుల పరిశీలన, ఆమోదం కోసం ఏ పన్ను అధికారినీ సంప్రదించే అవసరం ఉండదు.
- ఐటీ సేవల కంపెనీ దీనికోసం దరఖాస్తు చేశాక, అదే సేఫ్ హార్బర్ను కంపెనీ అభీష్టానుసారం ఐదేళ్లపాటు కొనసాగించవచ్చు.
- అడ్వాన్స్ ప్రైసింగ్ అగ్రిమెంట్ (ఏపీఏ) కుదుర్చుకునే ఐటీ సేవల కంపెనీల కోసం ఏకపక్ష ప్రక్రియను వేగిరం చేసే ప్రతిపాదన ఉంది. దీన్ని రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ గడువును గరిష్ఠంగా 2 సంవత్సరాల దాకా పొడిగించవచ్చు.

> "ఇండియా స్టాక్, మేధా సంపత్తి సంబంధిత అంశాల మెరుగు దిశగా సెమీకండక్టర్ మిషన్లో రెండు ప్రధాన ప్రకటనలు చేశాం. ఇందులో ఎలక్ట్రానిక్స్ రంగ స్వావలంబన కోసం ₹40,000 కోట్లతో ప్రకటించిన ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ పథకం ఒక ప్రధాన ప్రోత్సాహకం కాగలదు."
>
> *నిర్మలా సీతారామన్, ఆర్థికశాఖ మంత్రి*



### అంతర్జాతీయ వ్యాపారాలు.. పెట్టుబడులను ఆకర్షించడం

- డేటా సెంటర్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడుల పెంపు, డేటా సెంటర్ సేవలతో ప్రపంచవ్యాప్త క్లౌడ్ సేవలందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు పన్ను రద్దు.
- డేటా సెంటర్ సేవలందించే కంపెనీ అనుబంధ సంస్థ అయితే, దాని వ్యయంపై 15 శాతం సేఫ్ హార్బర్ సదుపాయం.
- ఎలక్ట్రానిక్ తయారీలో సముచిత తరుణాన సామర్థ్య సౌలభ్యం దిశగా విలువలో 2 శాతం లాభాంశంతో కాంపోనెంట్ వేర్హౌసింగ్ కోసం ప్రవాసులకు సేఫ్ హార్బర్ సదుపాయం కల్పిస్తారు.
- దేశంలో 'టోల్' తయారీ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రవాసులకు ఐదేళ్లపాటు ఆదాయపు పన్ను మినహాయింపు.
- దేశంలో ఎక్కువ కాలం పనిచేసేలా అంతర్జాతీయ ప్రతిభావంతుల బృందాలను ప్రోత్సహించేందుకు ప్రకటిత పథకాల కింద ప్రవాస నిపుణుడి ప్రపంచ (నాన్-ఇండియా సోర్స్) ఆదాయం 5 ఏళ్ల నివాస కాలానికి మినహాయింపు.
- అంచనా ప్రాతిపదికన పన్ను చెల్లించే నివాసేతరులకు కనీస ప్రత్యామ్నాయ పన్ను నుంచి మినహాయింపు.





### ఇ-కామర్స్ కొరియర్ ఎగుమతులు: విలువ పరిమితి రద్దు

ఇ-కామర్స్ ద్వారా ప్రపంచ మార్కెట్లకు భారత్ మరింత విస్తరించింది. దేశంలోని చిన్న వ్యాపారులు, చేతివృత్తులవారు, అంకుర సంస్థల ఆకాంక్షలకు మద్దతుగా కొరియర్ ఎగుమతులపై ప్రతి కన్సైన్మెంట్ మీద ఇప్పటివరకూ విధించిన ₹10 లక్షల విలువ పరిమితి రద్దయింది. ఈ నేపథ్యంలో అటువంటి కన్సైన్మెంట్ల గుర్తింపులో సాంకేతిక పరిజ్ఞాన సమగ్ర వినియోగం ద్వారా తిరస్కరణకు గురైన, వాపసు వచ్చిన షిప్మెంట్ల నిర్వహణ మెరుగుపడుతుంది.

### ఇండియా సెమీకండక్టర్ మిషన్

- సామగ్రి, పరికరాల ఉత్పాదనను ప్రోత్సహించే దిశగా పూర్తిగా కూర్చిన భారతీయ ఐపీ డిజైన్ల రూపకల్పనతోపాటు సరఫరా వ్యవస్థల బలోపేతం కోసం ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా పరిశ్రమాధారిత పరిశోధన-శిక్షణ కేంద్రాలపైనా దృష్టి సారిస్తారు.
- ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీ పథకం 2025 ఏప్రిల్లో ₹22,919 కోట్ల వ్యయంతో ప్రారంభం కాగా, ఆరంభ లక్ష్యానికి రెట్టింపు పెట్టుబడులతో ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. ఈ వేగాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యయాన్ని ₹40,000 కోట్లకు పెంచుతారు.




> ఈ బడ్జెట్ కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకం... ఇది దేశం ఆకాంక్షలను నెరవేరుస్తుంది. గ్రామాలు, పేదలు, రైతులకు ప్రయోజనం చేకూర్చడం లక్ష్యంగా గల భవిష్యత్తరపు, అవగాహనగల బడ్జెట్ను రూపొందించినందుకు నిర్మల గారితోపాటు ఆమె బృందానికి మరోసారి నా అభినందనలు.
>
> *నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

పర్యాటక రంగానికి ఉత్తేజం

# పర్యాటకం.. సంస్కృతి.. వారసత్వాలకు ప్రోత్సాహం

*దేశంలో పర్యాటక ఆధారిత ప్రగతికి కొత్త అవకాశాల కల్పనతో పాటు భారత సాంస్కృతిక మూలాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ బడ్జెట్ ప్రతిబింబించింది. ఆధ్యాత్మిక పర్యాటకం, సందర్శనీయ ప్రదేశాల అభివృద్ధి సహా విస్తృత సాంస్కృతికావరణ వ్యవస్థను శక్తిమంతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోంది. దీనికి అనుగుణంగా ప్రస్తుత బడ్జెట్ పర్యాటక రంగానికి నవ్యోత్తేజమిస్తూ, భారత సంస్కృతి-వారసత్వాలను సమున్నత శిఖరాలకు చేరుస్తుంది...*



**హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్ సహా తూర్పు-పశ్చిమ కనుమలలోని అరకు లోయలో పర్యావరణ పరంగా సుస్థిర పర్వత మార్గాల నిర్మాణానికి ప్రతిపాదన.**

### జాతీయ ఆతిథ్య ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు ప్రతిపాదన

- ప్రస్తుత 'నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ'ని ఉన్నతీకరించి జాతీయ ఆతిథ్య సంస్థ (నేషనల్ హాస్పిటాలిటీ ఇన్స్టిట్యూట్)గా ఏర్పాటు చేసే ప్రతిపాదన. తద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల లభ్యత సహా పర్యాటక రంగం బలోపేతం కాగలదు.
- ఐఐఎం సహకారంతో హైబ్రిడ్ విధానం ద్వారా ప్రామాణిక, అధిక-నాణ్యత గల 12 వారాల శిక్షణ కార్యక్రమంతో 20 పర్యాటక ప్రదేశాలలోని 10,000 మంది గైడ్ల నైపుణ్యాభివృద్ధికి ప్రయోగాత్మక ప్రాజెక్టు ప్రారంభం.
- సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వారసత్వ ప్రాముఖ్యంగల అన్ని ప్రదేశాల డిజిటల్ నమోదు కోసం 'నేషనల్ డెస్టినేషన్ డిజిటల్ నాలెడ్జ్ గ్రిడ్' ఏర్పాటు.
- స్థానిక పరిశోధకులు, చరిత్రకారులు, కంటెంట్ సృష్టికర్తలు, సాంకేతిక భాగస్వాములకు ఉపాధి అవకాశాలు కల్పించే కొత్త వ్యవస్థను ఇది సృష్టిస్తుంది.

### 15 పురావస్తు ప్రదేశాల అభివృద్ధికి నిర్ణయం

- లోథాల్, ధోలావీర, రాఖిగడి, ఆదిచనల్లూర్, సారనాథ్, హస్తినాపూర్, లేహ్ వంటి 15 పురావస్తు ప్రదేశాలను ఉత్తేజపూరిత, అనుభవాత్మక, సాంస్కృతిక సందర్శనీయ ప్రదేశాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదన. తద్వారా భారత ప్రాచీన సంస్కృతి ప్రపంచ యవనికపై విశిష్ట స్థానం పొందుతుంది.

### ఈశాన్య భారతంలోని 5 రాష్ట్రాల్లో 5 పర్యాటక ప్రదేశాల నిర్మాణం

- దుర్గాపూర్లో మెరుగైన అనుసంధాన కూడళ్లతో సమీకృత తూర్పు తీర పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదన. ఈశాన్య భారతంలోని 5 రాష్ట్రాలలో 5 పర్యాటక ప్రదేశాల నిర్మాణం, 4000 ఇ-బస్సుల సరఫరా.
- అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బౌద్ధ సర్క్యూట్ రూపకల్పనకు కొత్త పథకం.
- ఈ పథకం కింద ఆలయాలు-మఠాల సంరక్షణ, తీర్థయాత్ర సమాచార కేంద్రాల ఏర్పాటు, అనుసంధానం, యాత్రిక సదుపాయాల కల్పన చేపడతారు.

### పర్యాటక ఆధారిత ప్రగతికి కొత్త అవకాశాలు

- ఒడిశా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో తాబేళ్ల పెంపకం ప్రదేశాలు, తాబేలు మార్గాల అభివృద్ధి.
- పర్యాటకం, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పులికాట్ సరస్సు వెంబడి పక్షులను వీక్షించే మార్గాల అభివృద్ధి.

**పద్మ పురస్కారాలు-2026**





**పద్మభూషణ్**
ఉన్నత స్థాయి విశిష్ట సేవ

**పద్మ విభూషణ్**
అసాధారణ విశిష్ట సేవ

**పద్మశ్రీ**
విశిష్ట సేవ

# నిస్వార్థ కర్మయోగులను సత్కరించే సరికొత్త సంప్రదాయం

***దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులు ఇప్పుడు ప్రముఖ వ్యక్తులకు మాత్రమే పరిమితం కాదు. తమదైన శైలిలో మానవాళికి సేవ చేస్తూ సమాజం, దేశం ముందంజకు తోడ్పడుతున్న అజ్ఞాత ధీరులకూ ఈ సత్కారం లభిస్తోంది. ఆ మేరకు ప్రస్తుత ప్రభుత్వం వ్యక్తుల ఎంపిక ప్రక్రియను సమూల స్థాయిలో మార్చివేసింది... ఫలితంగా సంప్రదాయం, సంస్కృతి, విద్య, సాహిత్యం, ఆరోగ్య తదితర రంగాల్లో నిస్వార్థ సేవలందిస్తున్నా, వెలుగులోకి రాని అజ్ఞాత ధీరులు రాష్ట్రపతి భవన్లో 'ప్రజా పద్మ' గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్నారు. ఈ క్రమంలో జనజీవనాన్ని సుసంపన్నం చేసిన 131 మంది విశిష్ట వ్యక్తులు 2026లో ఈ సత్కారం పొందుతారు...***



## ఐదుగురు ప్రముఖులకు పద్మవిభూషణ్



**ధర్మేంద్ర సింగ్ డియోల్**
*(మరణానంతరం) (కళలు), మహారాష్ట్ర*



**కె.టి. థామస్**
*(ప్రజా సేవ), కేరళ*



**ఎన్.రాజం**
*(కళలు), ఉత్తరప్రదేశ్*



**పి.నారాయణన్**
*(విద్య-సాహిత్యం), కేరళ*



**వి.ఎస్.అచ్యుత నందన్**
*(మరణానంతరం) (ప్రజా సేవ), కేరళ*

దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మ అవార్డులు-2026 జాబితాను గణతంత్ర దినోత్సవానికి ముందు రోజున ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 2 సంయుక్త పురస్కారాలు కాగా, మొత్తం 131 మంది విశిష్ట వ్యక్తులకు గుర్తింపు లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించిన ఈ జాబితాలో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ అవార్డులున్నాయి. పురస్కార గ్రహీతలలో 19 మంది మహిళలు, విదేశీ/ఎన్ఆర్ఐ/పీఐఓ/ఓసీఐ విభాగాల్లోని ఆరుగురు వ్యక్తులతోపాటు 16 మందికి మరణానంతరం పురస్కారం

## పద్మ పురస్కారాల ప్రాధాన్యం

- కేంద్ర ప్రభుత్వం 1954లో 'భారత రత్న', 'పద్మ విభూషణ్' పేరిట రెండు పౌర పురస్కారాలను ప్రవేశపెట్టింది. పద్మ విభూషణ్ కేటగిరీలో 1వ అంచె, 2వ అంచె, 3వ అంచె కింద మొత్తం 3 విభాగాలుండేవి. ఆ తర్వాత 1955 జనవరి 8న రాష్ట్రపతి జారీ చేసిన ఒక నోటిఫికేషన్ ద్వారా ఈ మూడు అంచెలకు "పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ"గా నామకరణం చేశారు.
- జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ, గౌరవాలకు ఈ అవార్డులు ప్రతీక. ఈ పురస్కార గ్రహీతలకు నగదు కానుక ఏమీ ఉండదు.
- వీరికి ఒక పతకం, దాని సూక్ష్మ ప్రతిరూపంతోపాటు రాష్ట్రపతి సంతకంతో కూడిన ధ్రువీకరణ పత్రం ప్రదానం చేస్తారు. వీటిని వారు ఏ వేడుకలోనైనా ధరించవచ్చు.
- ఈ పురస్కారం బిరుదు వంటిది కాదు... కాబట్టి, దీన్ని అవార్డు గ్రహీతల పేర్లకు ముందు లేదా వెనుక గౌరవ సూచకంగా ఉపయోగించరాదు.

ప్రకటించారు. ప్రస్తుత జాబితాలో 19 మంది మహిళలు ఉండగా, గడచినఆరేళ్లలో పద్మ అవార్డు అందుకున్న మహిళల సంఖ్య 154కు చేరింది. ఈ పురస్కారాలను సాధారణంగా ఏటా మార్చి లేదా ఏప్రిల్ నెలలో రాష్ట్రపతి భవన్లో నిర్వహించే వేడుకలలో రాష్ట్రపతి ప్రదానం చేస్తారు.

ఈ నేపథ్యంలో అంకిత భావంతో దేశానికి విశిష్ట సేవలందించిన ప్రముఖులలో 16 మందికి మరణానంతరం ఈ అవార్డు ప్రదానం చేస్తున్నారు. ఈ మేరకు నటుడు ధర్మేంద్ర సింగ్ డియోల్, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుత నందన్కు మరణానంతరం పద్మ విభూషణ్ పురస్కారం ప్రకటించారు. ఇక పద్మ భూషణ్ గ్రహీతలలో ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి భగత్ సింగ్ కోష్యారి, తమిళనాడు వాస్తవ్యులు కళ్లిపట్టి రామస్వామి పళనిస్వామి, గాయని అల్కా యాజ్ఞిక్, మలయాళ నటుడు మమ్ముట్టితో పాటు ప్రకటనల రంగంలో పీయూష్ పాండే సహా రాజకీయ నేతలు షిబు సోరెన్, విజయ్ కుమార్ మల్హోత్రా తదితరులు ఉన్నారు. పద్మశ్రీ అవార్డు పొందిన 113 మందిలో క్రీడాకారులు– రోహిత్ శర్మ, ప్రవీణ్ కుమార్, మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్ సహా బలదేవ్ సింగ్, కె.పళనివేల్, సవితా పూనియా తదితరులున్నారు.

ఈ నేపథ్యంలో గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, అస్సాం రాష్ట్రాల నుంచి ఎంపికైన పద్మ అవార్డు విజేతల సేవలను కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి అమిత్ షా కొనియాడారు. నిస్వార్థ సమాజ సేవ దిశగా ఈ విజేతలు ఎంతో మందికి స్ఫూర్తినిస్తారని పేర్కొన్నారు. సమాజ సేవ, విద్య, సాహిత్యం, కళా రంగాల్లో



### పద్మ భూషణ్ అవార్డు గ్రహీతలు 13 మంది



**అల్కా యాజ్ఞిక్**
*(కళలు), మహారాష్ట్ర*



**భగత్ సింగ్ కోష్యారీ**
*(ప్రజా సేవ), ఉత్తరాఖండ్*



**కళ్లిపట్టి రామస్వామి పళనిస్వామి** *(వైద్యం), తమిళనాడు*



**మమ్ముట్టి**
*(కళలు), కేరళ*



**డాక్టర్ నోరి దత్తాత్రేయుడు**
*(వైద్యం), అమెరికా*



**పీయూష్ పాండే**
*(మరణానంతరం) (కళలు), మహారాష్ట్ర*





**పద్మ భూషణ్ అవార్డు గ్రహీతలు 13 మంది**



**ఎస్.కె.ఎం.మయిల నందన్**
*(సమాజ సేవ), తమిళనాడు*



**శతావధాని ఆర్.గణేష్**
*(కళలు), కర్ణాటక*



**షిబు సోరెన్**
*(మరణానంతరం) (ప్రజా సేవ), జార్ఖండ్*



**ఉదయ్ కోటక్**
*(వాణిజ్యం–పరిశ్రమలు), మహారాష్ట్ర*



**వి.కె.మల్హోత్రా**
*(మరణానంతరం) (ప్రజా సేవ), ఢిల్లీ*



**వెల్లప్పళ్లి నటేశన్**
*(ప్రజా సేవ), కేరళ*



**విజయ్ అమృతరాజ్**
*(క్రీడలు), అమెరికా*

పద్మశ్రీ
**113**

## ఆయా రంగాల్లో పద్మ పురస్కార గ్రహీతల సంఖ్య


| | |
|---|---|
| **కళలు** | 44 (2 పద్మ విభూషణ్, 4 పద్మ భూషణ్, 38 పద్మశ్రీ) |
| **సాహిత్యం** | 18 (1 పద్మ విభూషణ్, 17 పద్మశ్రీ) |
| **వైద్యం** | 15 (2 పద్మ భూషణ్, 13 పద్మశ్రీ) |
| **ప్రజా సేవ** | 7 (2 పద్మ విభూషణ్, 4 పద్మ భూషణ్, 1 పద్మశ్రీ) |
| **సమాజ సేవ** | 13 (1 పద్మ విభూషణ్, 12 పద్మశ్రీ) |
| **క్రీడలు** | 9 (1 పద్మ భూషణ్, 8 పద్మశ్రీ) |
| **వాణిజ్యం-పరిశ్రమలు** | 4 (1 పద్మ భూషణ్, 3 పద్మశ్రీ) |
| **సివిల్ సర్వీసెస్** | 2 పద్మశ్రీ |
| **సైన్స్-ఇంజనీరింగ్** | 11 పద్మశ్రీ |
| **ఇతరులు** | 8 పద్మశ్రీ |
| **మొత్తం** | 131 |

**దేశానికి విశిష్ట సేవలందించిన పద్మ పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు. వివిధ రంగాలలో వారి ప్రాముఖ్యం, అంకితభావం మన సమాజ స్వరూపాన్ని సుసంపన్నం చేస్తాయి. భావి తరాలకు స్ఫూర్తినిచ్చే నిబద్ధత, విశిష్టత, స్ఫూర్తికి ఈ గౌరవం ఒక ప్రతీక.**

*నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

పద్మశ్రీ పురస్కారం పొందిన వారు తమ నిరంతర కృషితో అనేకమంది జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చారు. ఈ పురస్కారాలు భారత సాంస్కృతిక, మేధా రంగాన్ని తీర్చిదిద్దడంలో వారి నిరంతర కృషిని ప్రతిఫలిస్తూ, వాస్తవిక ప్రజా పద్మ స్ఫూర్తిని మూర్తీభవింపజేస్తాయి. సామాజిక బాధ్యతను సచేతనంగా నెరవేర్చడం ద్వారా దేశ పురోగమనానికి సమర్థంగా తోడ్పడగలమని పద్మ పురస్కార గ్రహీతలు నిరూపించారు. వారి స్ఫూర్తి నిస్వార్థ సమాజ సేవ దిశగా మరింత మందిని ప్రేరేపిస్తుందనడంలో సందేహం లేదు. ●

# కేరళ నుంచి అభివృద్ధికి....
## ఉపాధి కల్పనకు ప్రోత్సాహం




***కేంద్ర ప్రభుత్వ కృషి కేరళ అభివృద్ధికి నవ్యోత్తేజమిస్తూ, రాష్ట్రం నిరంతరం ముందడుగు వేసేందుకు దోహదం చేస్తోంది. ఈ మేరకు జనవరి 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కొత్త అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతేకాకుండా ఇక్కడి నుంచే 'పీఎం స్వానిధి క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టి, దేశవ్యాప్తంగా పేదరిక నిర్మూలన లక్షిత కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రైల్వే అనుసంధాన బలోపేతం దిశగా, తిరువనంతపురాన్ని దేశానికి ఒక ప్రధాన అంకుర కూడలిగా మార్చడానికి ఉద్దేశించిన కార్యక్రమాలకూ ఈ సందర్భంగా ప్రోత్సాహం లభించింది.***

క్రెడిట్ కార్డు ఒకనాడు సంపన్నులకే పరిమితం... కానీ, దేశంలో లక్షలాది వీధి వ్యాపారులకూ ఇప్పుడవి అందుబాటులోకి వస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలో కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా గత 11 సంవత్సరాలలో కోట్లాది పౌరులను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించే దిశగా ప్రభుత్వం విస్తృత కృషి చేసింది. ఇక లోగడ రోడ్ల పక్కన, ఇరుకిరుకు వీధుల్లో వస్తువులు అమ్ముకునే వీధి వ్యాపారుల పరిస్థితి కూడా చాలా దయనీయం. ఆ వ్యాపారం కోసం వారు కొన్ని వందల రూపాయల మొత్తాన్ని కూడా అధిక వడ్డీకి రుణం తీసుకోవాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారి కోసం తొలిసారి 'పీఎం స్వానిధి' పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఆ తర్వాత దేశంలో లక్షలాది వ్యాపారులు బ్యాంకుల నుంచి విస్తృత రుణసాయం పొందారు. ముఖ్యంగా వీధి వ్యాపారులు తమ జీవితాల్లో మొదటిసారి బ్యాంకు నుంచి ఆర్థిక సహాయం పొందడం విశేషం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వీరికి క్రెడిట్ కార్డులు అందజేయడం ద్వారా మరింత సౌలభ్యం కల్పిస్తోంది. ఈ పథకం వల్ల వీధి వ్యాపారులకే కాకుండా ఫుట్పాత్లపై పనిచేసే వారికీ ప్రయోజనం చేకూరుతుంది.

**సముచిత పట్టణాభివృద్ధికి భరోసా**

దేశాన్ని వికసిత భారత్గా తీర్చిదిద్దడానికి యావత్ ప్రజానీకం ఒకే తాటిపై కృషి చేస్తోంది. ఇందులో దేశంలోని నగరాలదే కీలక పాత్ర. అందుకే, గత 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాలపై గణనీయంగా పెట్టుబడులు పెడుతోంది. అలాగే నగర పేదల ప్రయోజనార్థం కూడా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా 'పీఎం ఆవాస్ యోజన' కింద దేశంలోని పేదల కోసం 4 కోట్లకుపైగా ఇళ్లు నిర్మించి ఇచ్చింది. వీటిలో కోటికిపైగా ఇళ్లు పట్టణ పేదల కోసం నిర్మించినవి కాగా, ఒక్క కేరళలోనే వీటి సంఖ్య సుమారు 1.25 లక్షలు.

ఇక పేద కుటుంబాలు విద్యుత్ బిల్లును తగ్గించుకోవడం కోసం 'పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం' ప్రారంభమైంది. అలాగే, ఆయుష్మాన్ భారత్ పథకం కింద పేదలు ఏటా ₹5 లక్షల విలువైన ఉచిత చికిత్స సదుపాయం పొందుతున్నారు. మాతృ వందన యోజన వంటి పథకాలు మహిళల ఆరోగ్య భద్రతకు భరోసా ఇస్తున్నాయి. ఇక ₹12 లక్షల వరకూ వార్షికాదాయంపై



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## తిరువనంతపురంలో శంకుస్థాపనలు.. ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు

*రైల్వే అనుసంధానం, పట్టణ జీవనోపాధి, శాస్త్రవిజ్ఞానం, ఆవిష్కరణలు, పౌర-కేంద్రక సేవలు, ఆధునిక ఆరోగ్య సంరక్షణ వంటి కీలక రంగాలు ఇందులో భాగంగా ఉన్నాయి.*

- పీఎం స్వానిధి క్రెడిట్ కార్డు ప్రారంభం... ఇది యూపీఐ సంధానిత, వడ్డీ రహిత పునఃరుణ సదుపాయం ద్వారా తక్షణ నగదు సాయానికి తోడ్పడుతుంది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడమేగాక లబ్ధిదారుల అధికారిక రుణ ఖాతా ఏర్పరచుకునే వీలు కల్పిస్తుంది.
- లక్ష మంది లబ్ధిదారులకు పీఎం స్వానిధి రుణాల పంపిణీ. ఈ పథకం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు తొలిసారి అధికారిక రుణ సదుపాయం కల్పించింది.
- కేరళలో రైల్వే అనుసంధానం మెరుగు దిశగా 3 అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఒక పాసింజర్ రైలు ప్రారంభం.
- వీటిలో నాగర్కోయిల్-మంగళూరు, తిరువనంతపురం-తాంబరం, తిరువనంతపురం-చర్లపల్లి మార్గాల్లో అమృత భారత్ ఎక్స్‌ప్రెస్, త్రిస్సూర్-గురువాయూర్ మధ్య కొత్త పాసింజర్ రైలు ఉన్నాయి.
- ఈ కొత్త రైళ్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మధ్య సుదూర, ప్రాంతీయ అనుసంధానం గణనీయంగా మెరుగవుతుంది. తద్వారా ప్రయాణ సమయం ఆదా కావడంతోపాటు మరింత చౌక, సురక్షిత ప్రయాణానికి భరోసా లభిస్తుంది.
- తిరువనంతపురంలో 'సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్టీ ఇన్నోవేషన్, టెక్నాలజీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ హబ్' కు శంకుస్థాపన.
- తిరువనంతపురంలో శ్రీ చిత్ర తిరుణాల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో అత్యాధునిక రేడియో సర్జరీ కేంద్రానికి శంకుస్థాపన.
- తిరువనంతపురంలోని పూజాప్పురాలో కొత్త తపాలా కార్యాలయం ప్రారంభం.

> “ దేశ ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించేందుకు గత 11 ఏళ్లలో సాగిన కృషి ఫలితంగా కోట్లాదిగా పేదలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు సహా మహిళలు, మత్స్యకారులందరికీ బ్యాంకు రుణాలు ఎలాంటి హామీ లేకుండా సులువుగా లభిస్తున్నాయి. ఈ రుణాలు పొందడంలో ప్రభుత్వమే వారికి పూచీకత్తు ఇస్తోంది.
>
> *– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

కేంద్ర ప్రభుత్వం పూర్తి పన్ను మినహాయింపు ఇచ్చింది. తద్వారా కేరళ ప్రజలకు... ముఖ్యంగా మధ్యతరగతికి ఎనలేని ప్రయోజనం చేకూరింది.

**కేరళ అభివృద్ధికి నవ్యోత్తేజం**

అనుసంధానం, శాస్త్రవిజ్ఞానం, ఆవిష్కరణలు, ఆరోగ్య సంరక్షణ రంగాల్లోనూ కేంద్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఇందులో భాగంగా కేరళలో 'సీఎస్ఐఆర్ ఇన్నోవేషన్ హబ్', వైద్య కళాశాలలో రేడియో సర్జరీ కేంద్రం ప్రారంభించింది. వీటి ద్వారా ఈ రాష్ట్రం సైన్స్, ఆవిష్కరణలు, ఆరోగ్య సంరక్షణ సేవల కూడలిగా రూపొందుతుంది. అలాగే రాష్ట్రంలో రైల్వే అనుసంధానం మరింత బలోపేతమైంది. ఈ మేరకు 3 అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధానమంత్రి ప్రారంభించారు. వీటివల్ల పర్యాటక రంగానికి ప్రయోజనం చేకూరుతుంది. మరోవైపు గురువాయూర్-త్రిస్సూర్ మార్గంలో యాత్రికులకు ఈ కొత్త పాసింజర్ రైలు ఎంతో సౌలభ్యం కల్పిస్తుంది. మొత్తం మీద ఈ ప్రాజెక్టులన్నీ కేరళ ప్రగతికి నవ్యోత్తేజమిస్తాయి. వికసిత భారత్ స్వప్నం నిస్సందేహంగా వికసిత కేరళతోనే సాకారం కాగలదు. ఈ దిశగా కృషిలో కేంద్ర ప్రభుత్వం కేరళ ప్రజలకు అండదండగా నిలుస్తుంది. ●

సాధు సంప్రదాయం.. వారసత్వంతో భావితరాల అనుసంధానం

# ఇకపై ఆదంపూర్ ఎయిర్ పోర్టు 'శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ విమానాశ్రయం'




*దేశాభివృద్ధితోపాటు వారసత్వ పరిరక్షణకు, దానితో భావి తరాల అనుసంధానానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ క్రమంలో న్యాయం, కరుణ ఆధారంగా దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన సాధువు రవిదాస్ 649వ జయంతి నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ను సందర్శించారు. అక్కడ ఆదంపూర్ విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ- సాధు సంప్రదాయం, వారసత్వాన్ని భావి తరాలతో అనుసంధానించేలా ఈ విమానాశ్రయం పేరును 'శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ విమానాశ్రయం, ఆదంపూర్'గా మారుస్తున్నామని ఇకపై అలాగే పిలుద్దామని సూచించారు.*

సంఘ సంస్కర్త.. సాధువు రవిదాస్ మహారాజ్ దేశానికి సేవా మార్గం చూపారు. భారత సామాజిక విలువలకు స్ఫూర్తినిచ్చే సమానత్వం, కరుణ, మానవాళి ఆత్మగౌరవంపై ప్రబోధాలతో సామాజిక సామరస్యం, సద్భావన జ్యోతిని వెలిగించారు. శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంజాబ్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ఆదంపూర్ విమానాశ్రయాన్ని ఇకపై 'శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ విమానాశ్రయం'గా పిలుద్దామంటూ పేరు మార్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇది నిజంగా అసంఖ్యాక ప్రజానీకానికి ఎంతో ఆనందకరమైన రోజు. శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ శాశ్వత ఆదర్శాలకు ఇది సముచిత నివాళి. సమానత్వం, సౌభ్రాత్రం, సేవ దిశగా ఆయన సందేశం మనకు సదా స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

పంజాబ్లో విమానయాన మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తూ, ప్రధానమంత్రి మోదీ హల్వారా విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. ఇది రాష్ట్ర ప్రజలకు--- ముఖ్యంగా లూధియానా సహా పరిసర ప్రాంతాల వారికి ఎంతో ఆనందం కలిగించే కార్యక్రమమని ఆయన వ్యాఖ్యానించారు. లూధియానా



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## లూధియానాలోని హల్వారా విమానాశ్రయ టెర్మినల్ భవన ప్రారంభోత్సవం

- పంజాబ్లో విమానయాన మౌలిక సదుపాయాల పెంపులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లూధియానాలోని హల్వారా విమానాశ్రయం టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు.
- ఇది లూధియానా, దాని పరిసర ప్రాంతాల పారిశ్రామిక-వ్యవసాయ రంగాల అవసరాలు తీర్చగలిగేలా రాష్ట్ర కొత్త ముఖద్వారంగా రూపొందుతుంది.
- లూధియానా జిల్లాలోని హల్వారాలో వ్యూహాత్మకంగా కీలకమైన భారత వైమానిక దళ స్థావరం కూడా ఉంది.
- లూధియానాలోని పాత విమానాశ్రయంలోని రన్వే సాపేక్షంగా చిన్నది కాబట్టి, చిన్న విమానాలకు మాత్రమే అది అనుకూలం.
- అనుసంధానం మెరుగుదల, పెద్ద విమానాల రాకపోకలకు సదుపాయం కల్పనలో భాగంగా హల్వారాలో కొత్త 'సివిల్ ఎన్క్లేవ్'ను నిర్మించారు. ఇది పొడవైన రన్వే కావడమేగాక ఎ-320 వంటి భారీ విమానాల రాకపోకలను కూడా నిర్వహించగలదు.
- సుస్థిర, పర్యావరణ బాధ్యతాయుత అభివృద్ధిపై ప్రధానమంత్రి దృక్కోణం మేరకు ఈ టెర్మినల్కు అనేక పర్యావరణ హిత, ఇంధన పొదుపు విశిష్టతలున్నాయి.
- ఈ మేరకు ఎల్ఈడీ లైటింగ్, ఇన్సులేటెడ్ రూఫ్, వర్షజల సేకరణ వ్యవస్థ, మురుగు-నీటి శుద్ధి ప్లాంటు, సుందరీకరణ కోసం రీసైకిల్ చేసిన జల వినియోగం వంటి సౌకర్యాలున్నాయి.
- టెర్మినల్ భవన నమూనా పంజాబ్ సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ విమానాశ్రయం ప్రయాణికులకు ప్రత్యేక, ప్రాంతీయ స్ఫూర్తిదాయక ప్రయాణానుభవం ఇస్తుంది.

**"మానవాళి సంక్షేమానికి తననుతాను అంకితం చేసుకున్న సాధువు శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ జయంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళి. ఆ మహనీయుడి ప్రబోధాల్లో కీలకమైన న్యాయం, కరుణ సూత్రాలు మా సంక్షేమ పథకాలకు మార్గనిర్దేశాలు. ఆయన వెలిగించిన సామాజిక సామరస్యం, సద్భావన జ్యోతి దేశ ప్రజలకు సదా దిశానిర్దేశం చేస్తూనే ఉంటుంది**

*నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

### రవిదాస్ మహారాజ్కు నివాళి

- ఆదంపూర్ విమానాశ్రయానికి 'శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ విమానాశ్రయం, ఆదంపూర్'గా పేరు మార్పు.
- ఆదంపూర్ విమానాశ్రయం పేరు మార్చడమంటే- సాధువు, సంఘ సంస్కర్త శ్రీ గురు రవిదాస్ మహారాజ్కు నివాళి. ఆయన బోధనలు సమానత్వం, కరుణ, మానవాళి ఆత్మగౌరవం వంటి సామాజిక విలువలకు స్ఫూర్తినిస్తాయి.




ఉత్తర భారతంలో ఓ కీలక పారిశ్రామిక-వాణిజ్య కూడలి అన్నది మనందరికీ తెలిసిన విషయమేనని పేర్కొన్నారు. ప్రగతిశీల వ్యక్తులకు పేరొందిన ఈ నగరానికి విమాన అనుసంధానం మెరుగు దిశగా మా ప్రభుత్వం చేస్తున్న అవిరళ కృషిని ఆధునిక విమానాశ్రయం ప్రతిబింబిస్తోంది.

**డేరా సచ్ఖండ్ బలాన్ను సందర్శించిన ప్రధానమంత్రి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంజాబ్లోని డేరా సచ్ఖండ్ బలాన్ను సందర్శించారు. శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ జయంతి సందర్భంగా ఇక్కడికి రావడం తనకెంతో ప్రత్యేక అనుభూతినిస్తోందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

**సంత్ నిరంజన్ దాస్తో ప్రధాని మోదీ భేటీ**

డేరా సచ్ఖండ్ బలాన్లో సంత్ నిరంజన్ దాస్ జీని ప్రధానమంత్రి కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ- ఈ సమావేశం తనకెంతో విశిష్టమైనదని ఆయన అభివర్ణించారు. స్ఫూర్తిదాయక సమాజ సేవకు గుర్తింపుగా ఇటీవల ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది.



# ఇప్పుడు దేశంలో అందరికి చేరువగా గగనయనం

***దేశంలో నేడు అత్యంత వేగంగా పురోగమిస్తున్న రంగాలలో పౌర విమానయానం ఒకటి. ఆకాశయానమంటే కొద్దిమందికి మాత్రమే పరిమితమన్నది ఒకనాటి వాస్తవం. కానీ, ఇప్పుడు భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్గా ఆవిర్భవించింది. ప్రయాణికుల సంఖ్య నిరంతరం పెరగటంతో పాటు విమానాల సముదాయం కూడా వేగంగా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో విమానయాన మౌలిక సదుపాయాల ఆధునికీరణకు కొత్త ఊపు లక్ష్యంగా జనవరి 28న హైదరాబాద్లో 'వింగ్స్ ఇండియా 2026' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు...***

దేశ ఉజ్వల ఆర్థిక శ్రేయస్సు, జాతీయ సమైక్యత బలోపేతం సహా 2047కల్లా వికసిత భారత్గా రూపొందే లక్ష్యం వైపు మనం ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్లడంలో విమానయాన రంగం మనకు కొత్త రెక్కలు తొడిగింది. ఈ నేపథ్యంలో ఆసియాలోనే అతిపెద్ద అంతర్జాతీయ పౌర విమానయాన కార్యక్రమం 'వింగ్స్ ఇండియా 2026' భారత విమానయాన రంగం ప్రగతి గాథను కళ్లకు కట్టింది. ఈ రంగంలోని అపార అవకాశాలపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఇది సమాచారమిచ్చింది. ఒకనాడు కొన్ని వర్గాలకు పరిమితమైన విమానయానాన్ని భారత్ నేడు సామాన్యులకూ అందుబాటులోకి తెచ్చింది. "భారత విమానయాన రంగం: భవిష్యత్తుకు బాట– డిజైన్ నుంచి రూపుకల్పనదాకా.. తయారీ నుంచి నిర్వహణ వరకూ... సార్వజనీనత నుంచి ఆవిష్కరణ దాకా... భద్రత నుంచి సుస్థిరత వరకూ" ఇతివృత్తంగా తెలంగాణలోని హైదరాబాద్లో జనవరి 28 నుంచి 31 వరకూ ఈ కార్యక్రమం సాగింది. ఈ అంతర్జాతీయ సదస్సులో ఒక మంత్రిత్వ స్థాయి సమావేశంతో పాటు 13 ఇతివృత్త ఆధారిత చర్చాగోష్ఠులు నిర్వహించారు. విమానయాన పరిశ్రమ తదుపరి దశ ఆశాజనకంగా ఉంటుందని, ఇందులో భారత్ కీలక పాత్రధారి కాగలదని ప్రధానమంత్రి మోదీ నొక్కిచెప్పారు. విమాన తయారీ, పైలట్ శిక్షణ, ఆధునిక విమాన రవాణా, విమానాల లీజింగ్ వంటి రంగాల్లో అంతర్జాతీయ విమాన సంస్థలకు భారత్ అద్భుత పెట్టుబడి అవకాశాలు కల్పిస్తుంది.

**దేశంలో 2047 నాటికి 400కు పైగా విమానాశ్రయాలు**

దేశీయ విమానయాన రంగం కార్యకలాపాలు అనేక రెట్లు విస్తరిస్తున్నాయి. దీంతో 2047 నాటికి భారత్లో 400కు పైగా విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. మరోవైపు కేంద్ర ప్రభుత్వం 'ఉడాన్' పథకం తదుపరి దశకు రూపమివ్వడంలో నిమగ్నమైంది. ఈ విధానం ప్రాంతీయ–చౌక అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దీంతోపాటు 'సీప్లేన్' కార్యకలాపాలను కూడా విస్తరిస్తున్నారు. ఈ పరిణామాలపై ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ– "దేశం నలుమూలలకూ విమాన సంధాన విస్తరణే లక్ష్యంగా మేం కృషి చేస్తున్నాం. దేశమంతటా పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో వాటి సందర్శన కోసం ప్రయాణానికి ప్రజలు విమాన

### భారత ప్రగతి పయనంలో సహ చోదకులుగా మారండి

విమానయాన పరిశ్రమకు సంబంధించి ఇంత భారీ స్థాయి, విధాన స్థిరత్వం, సాంకేతిక ఆకాంక్షగల భారత్ వంటి దేశాలు ప్రపంచంలో కొన్ని మాత్రమే. ఈ రంగంలో దేశం అనేక సంస్కరణలు తెస్తున్నందున వర్ధమాన, ఇతర ప్రపంచ దేశాల మధ్య భారత్ ఒక కీలక విమానయాన కూడలిగా రూపాంతరం చెందుతోంది. కాబట్టి, విమానయాన రంగ పెట్టుబడిదారులకు, తయారీదారులకు ఇదే మంచి తరుణం. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి ప్రయాణంలో దీర్ఘకాలిక భాగస్వాములుగా మారడమే కాకుండా ప్రపంచ విమానయాన రంగ వృద్ధికి దోహదకారులు కావాలని ప్రపంచ పెట్టుబడిదారులను ప్రధానమంత్రి మోదీ కోరారు.



*ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.*

### భారత్ దీర్ఘకాలిక దృక్కోణంతో విమానయాన రంగంలో మెరుగుపడిన సౌకర్యాలు

- విమానాశ్రయాలతో 2, 3 అంచెల్లోని నగరాల అనుసంధానం.
- దేశంలో 2014 నాటికి విమానాశ్రయాల సంఖ్య 70 కాగా, తర్వాతి దశాబ్దంలో వాటి సంఖ్య 160కి పెరిగింది.
- దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 2014లో 10.3 కోట్లు కాగా, 2025కల్లా 35 కోట్లు దాటింది.
- దేశవ్యాప్తంగా 100కు మించి ఎయిర్ డోమ్లు ప్రారంభమయ్యాయి.
- పౌరుల కోసం చౌక విమాన ప్రయాణ పథకం 'ఉడాన్' ప్రారంభమైంది.
- ఈ పథకం తోడ్పాటుతో వివిధ దేశీయ మార్గాల్లో 1.5 కోట్ల మంది ప్రయాణించారు. ఈ మార్గాల్లో అధికశాతం లోగడ ఉనికిలో కూడా లేవు.




**“ ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలను దేశీయంగా రూపొందించి, తయారు చేసే రోజులు ఎంతో దూరంలో లేవు. ఇవి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించి, విమానయాన రంగానికి కొత్త దిశను నిర్దేశించగలవు. మరోవైపు సుస్థిర విమాన ఇంధనంపైనా మేం విస్తృతంగా కృషి చేస్తున్నాం. అందువల్ల త్వరలోనే కాలుష్య రహిత విమాన ఇంధన ప్రధాన ఉత్పత్తిదారుగానే కాకుండా ఎగుమతిదారుగా మారడానికి సిద్ధమవుతున్నాం.**

*నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

మార్గాలను ఎంచుకుంటున్నారు. కాబట్టి, భవిష్యత్తులో విమానయానానికి డిమాండ్ మరింత పెరుగుతుంది. అందువల్ల పెట్టుబడులకు అపార అవకాశాలు ఉంటాయి” అని వివరించారు.

**విమానయాన అవసరాల కోసం పరాధీనత వద్దు**

భారత్ ఇప్పుడు ప్రపంచ విమానయాన కీలక కూడలిగా ఆవిర్భవిస్తోంది. కాబట్టి, సంబంధిత అవసరాల కోసం మనం ఇతరులపై ఆధారపడకుండా చూసుకోవడం ముఖ్యమని 'వింగ్స్ ఇండియా 2026'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు “స్వయంసమృద్ధ మార్గాన్ని మనం బలోపేతం చేసుకోవాలి. ఇది భారత్లో పెట్టుబడి పెట్టే కంపెనీలకూ తోడ్పాటునిస్తుంది. ఈ దృక్కోణంతోనే విమానాల రూపకల్పన-తయారీ సహా 'నిర్వహణ-మరమ్మతు-సమగ్ర మరమ్మతు' (ఎంఆర్ఓ) వ్యవస్థ మెరుగుదలకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తోంది. విమాన విడిభాగాల తయారీ-సరఫరాలో భారత్ ప్రస్తుతం ప్రపంచంలోనే కీలక దేశం. సైనిక, రవాణా విమానాల తయారీ ప్రారంభిస్తున్న భారత్, ఇప్పుడు పౌర విమానాల తయారీ దిశగానూ ముందడుగు వేస్తోంది.









భారత ఎన్నికల సంఘం

# ప్రపంచ ప్రజాస్వామ్య స్వరం

***ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని కలిగిన దేశం మన భారతదేశం. దేశంలో నమోదైన ఓటర్ల సంఖ్య దాదాపు 97 కోట్లు. రాజకీయ పార్టీల సంఖ్య 700 పైచిలుకు. అంతేకాకుండా, అంతర్జాతీయ ప్రజాస్వామ్యం, ఎన్నికల సహాయ సంస్థ (ఐడీఈఏ) సభ్య దేశాల మండలికి భారత్ అధ్యక్షతను కూడా స్వీకరించింది. ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఈ సంపన్న సంప్రదాయాన్ని, అలాగే న్యాయమైన, పారదర్శకమైన, సమగ్ర ఎన్నికల ప్రక్రియను ప్రపంచ వేదికపై పంచుకునే లక్ష్యంతో, భారత ఎన్నికల సంఘం 2026 జనవరి 21 నుండి 23 వరకు మూడు రోజుల పాటు 'ఇండియా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్'ను నిర్వహించింది. ఈ కార్యక్రమం ఎన్నికల నిర్వహణలో భారత్ పాత్రను మరింత బలోపేతం చేసింది.***

ఈ అంతర్జాతీయ సదస్సు ఎన్నికల నిర్వహణ సంస్థలు, విధాన రూపకర్తలను, నిపుణులకు ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ఎన్నికల ప్రక్రియల్లో కొత్త పోకడలు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఓటింగ్ శాతాన్ని పెంచడం వంటి కీలక అంశాలపై చర్చించేందుకు అవకాశం కల్పించింది. ఈ తరహాలో తొలిసారిగా నిర్వహించిన ఈ సదస్సుకు 42 విదేశీ రాయబార కార్యాలయాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులు, 27 దేశాల వివిధ సంస్థల అధిపతులు సహా వెయ్యికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 32 దేశాల ఎన్నికల నిర్వహణ సంస్థల అధిపతులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. భారతదేశం, ఆహ్వానించబడిన ఎన్నికల నిర్వహణ సంస్థలు (ఈఎంబీలు) తమతమ దేశాల చట్టాలకు అనుగుణంగా, ఈసీఐనెట్ వంటి సాంకేతిక వేదికలను అభివృద్ధి చేయడంలో సహకరించడానికి ముందుకొచ్చాయి. ఎన్నికల నిర్వహణ, ప్రజాస్వామ్య సహకారంలో భారతదేశానికి ఉన్న దీర్ఘకాలిక భాగస్వామ్యాలను మరింత బలపరచడమే దీని లక్ష్యం. తమ తమ దేశాల చట్టాలకు అనుగుణంగా, ఈసీఐనెట్ వంటి సాంకేతిక వేదికల అభివృద్ధిలో వివిధ ఎన్నికల నిర్వహణ సంస్థలతో కలిసి పనిచేయడానికి భారత్ ముందుకొచ్చింది. తమ దేశాల్లో ఇలాంటి సాంకేతిక పరిష్కారాలను అమలు చేయడానికి భారత్‌తో సహకరించేందుకు ఆహ్వానించబడిన వివిధ ఎన్నికల నిర్వహణ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయి. ముగింపు సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 'ఢిల్లీ డిక్లరేషన్ 2026'ను చదివి వినిపించారు. సదస్సులో పాల్గొన్న అన్ని ఎన్నికల నిర్వహణ సంస్థలు ఈ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాయి. సదస్సులో పాల్గొన్న ఈఎంబీలు ( ఎన్నికల నిర్వహణ సంస్థలు) ఎన్నికల జాబితాలో సచ్ఛీలత, ఎన్నికల నిర్వహణ, పరిశోధన, ప్రచురణలు, సాంకేతిక వినియోగం, శిక్షణ– సామర్థ్య వృద్ధి అనే ప్రకటనలో

## ఓటర్లే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం

ప్రజాస్వామ్యంలో ఓటరే సర్వోన్నతుడు. ఓటర్లు తమ తమ ఓటు హక్కును వినియోగించుకునే శాతాన్ని పెంచేందుకు భారత ఎన్నికల సంఘం నిరంతరం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి 25న 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, తాజాగా నమోదు అయిన ఐదు మంది యువ ఓటర్లకు ఓటరు ఫోటో గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ గుర్తింపు కార్డు ప్రపంచంలోనే అతిపెద్ద అత్యంత చైతన్యవంతమైన ప్రజాస్వామ్యంలో చురుకుగా పాల్గొనే అమూల్యమైన హక్కును వారికి అందిస్తుందని ఈ సందర్భంగా రాష్ట్రపతి పేర్కొన్నారు. యువ ఓటర్లు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఎన్నికల్లో భారీ సంఖ్యలో ఓటు వేసిన మహిళా ఓటర్లను అభినందిస్తూ, వారు గణతంత్ర భావనను మరింత బలపరుస్తున్నారని అన్నారు.

ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో రెండు తేదీలు అత్యంత ముఖ్యమని గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము తెలిపారు. అవి 1949 నవంబర్ 26 అంటే, భారత రాజ్యాంగం ఆమోదించబడిన రోజు, రెండవది, 1950 జనవరి 26, రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు. 1949 నవంబర్ 26న రాజ్యాంగంలోని కేవలం 16 ప్రకరణలు మాత్రమే తక్షణ అమలులోకి వచ్చాయి. రాజ్యాంగంలోని 324 ప్రకరణ ప్రకారం, భారత ఎన్నికల సంఘం 1950 జనవరి 25న ఏర్పాటైంది. అంటే 1950 జనవరి 26న గణతంత్రం ఆవిర్భవించడానికి ఒక రోజు ముందే. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యానికి ప్రత్యేక వేడుక నిర్వహించబడుతుంది. దేశంలో 95 కోట్ల పైచిలుకు ఓటర్లు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్య శక్తి కేవలం ఓటర్ల సంఖ్యలోనే కాకుండా, ప్రజాస్వామ్య స్ఫూర్తిలోనూ తొణికిసలాడుతుందని గౌరవ రాష్ట్రపతి పేర్కొన్నారు.

### 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం

భారత ఎన్నికల సంఘం జనవరి 25వ తేదీన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని (NVD-2026) నిర్వహించింది. ఈ ఏడాది ఇతివృత్తం "నా భారతదేశం, నా ఓటు" కాగా.. "భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు" అనే ట్యాగ్‌లైన్‌ను దీనికి జతచేశారు.

### వివిధ విభాగాలలో పురస్కారాలు

గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము వివిధ విభాగాలలో ఉత్తమ ఎన్నికల పద్ధతులకు పురస్కారాలను ప్రదానం చేశారు. వీటిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించినందుకు బిహార్, కేరళ, తమిళనాడు, ఎన్నికల నిర్వహణ, లాజిస్టిక్స్ విభాగంలో ఒడిశా, మేఘాలయ బిహార్, సృజనాత్మక ఓటర్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టిన బిహార్, గుజరాత్, కేరళ, ప్రవర్తనా నియమావళి, దాని అమలులో మిజోరాం బిహార్, శిక్షణ, సామర్థ్య నిర్మాణంలో బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలు పురస్కారాలు అందుకున్నాయి.

### రెండు ప్రచురణల ఆవిష్కరణ

**ఈ కార్యక్రమంలో "2025: ఎ ఇయర్ ఆఫ్ ఇనిషియేటివ్స్ అండ్ ఇన్నోవేషన్స్", "చునావ్ కా పర్వ్, బిహార్ కా గర్వ్" అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. బిహార్‌లో సాధారణ ఎన్నికల విజయవంతమైన నిర్వహణపై ఆధారితమైన ఈ ప్రచురణ, ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి 2025లో చేపట్టిన 30కిపైగా కార్యక్రమాలను పొందుపరిచారు.**






**నేటి ఓటర్లు భారతదేశ భవిష్యత్తును నిర్మించే శిల్పులు. ఓటు హక్కు ముఖ్యమైనదే కానీ, రాజ్యాంగ కర్తవ్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వయోజనుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రలోభాలు, అజ్ఞానం, తప్పుడు సమాచారం, ప్రచారం, పక్షపాతం నుండి విముక్తులై, తమ అంతరాత్మ శక్తితో మన ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేస్తారని నేను ఆశిస్తున్నాను.**

*– ద్రౌపది ముర్ము, గౌరవ భారత రాష్ట్రపతి*

పేర్కొన్న ఐదు అంశాలపై కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. తమ పురోగతిని కాలానుగుణంగా సమీక్షించుకోవాలని కూడా నిర్ణయించారు. దీనిని పురస్కరించుకుని, 2026 డిసెంబర్ 3, 4, 5 తేదీలలో న్యూఢిల్లీ లోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం)లో సమావేశం కావాలని ప్రతిపాదించారు.

రాష్ట్రపతి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి






**నియామక పత్రాలు**

# దేశ నిర్మాణానికి బలాన్ని చేకూరుస్తూ..

***భారతదేశం ప్రపంచంలోని అత్యంత యువ దేశాలలో ఒకటి. కేంద్ర ప్రభుత్వం దేశ యువత కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొత్త అవకాశాలను సృష్టించడానికి కృషి చేస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా, జనవరి 24న, నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో 61,000 మందికి పైగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాల పంపిణీ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, నేడు మీరు అందుకుంటున్న నియామక పత్రాలు ఒక విధంగా దేశ నిర్మాణానికి ఆహ్వానం అని పేర్కొన్నారు. ఇది అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి అభివృద్ధిని వేగవంతం చేయడానికి తీసుకున్న ప్రతిజ్ఞ కూడాఅని అన్నారు...***

యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, వారికి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం కేంద్ర ప్రభుత్వానికి ప్రాధాన్యతాంశంగా ఉంది. దీనికి అనుగుణంగా, యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగాలను అందించడంలో భాగంగా రోజ్‌గార్ మేళా ప్రారంభించబడింది. దీని ద్వారా, లక్షలాది మంది యువత వివిధ ప్రభుత్వ విభాగాలలో నియామక పత్రాలను అందుకున్నారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా నియామక పత్రాల పంపిణీ చేసిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, మీలో చాలా మంది దేశ భద్రతను బలోపేతం చేస్తారు. మీరు విద్య, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మరింత శక్తివంతం చేస్తారు. మీలో చాలా మంది ఆర్థిక సేవలు, ఇంధన భద్రతను బలోపేతం చేయనున్నారు. అదే సమయంలో చాలా మంది యువత ప్రభుత్వ సంస్థల వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారు. మీ యువత అందరికీ నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని పేర్కొన్నారు.

రోజ్‌గార్ మేళాలో 8,000 మందికి పైగా మహిళలు నియామక పత్రాలను అందుకున్నారు. గత పదకొండేళ్లలో, దేశ శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం దాదాపు రెట్టింపు అయింది. ముద్ర, స్టార్టప్ ఇండియా వంటి ప్రభుత్వ పథకాలు మహిళలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయి. మహిళల స్వయం ఉపాధి రేటు సుమారు 15 శాతం పెరిగింది.

యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో, భారతదేశం ఆధునిక మౌలిక సదుపాయాలలో గణనీయంగా పెట్టుబడులు పెట్టింది.

దీనివల్ల నిర్మాణ రంగానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ ఉపాధి

## రోజ్‌గార్ మేళాల ద్వారా 11 లక్షలకు పైగా నియామక పత్రాల జారీ

- రోజ్‌గార్ మేళా ప్రారంభమైనప్పటి నుండి, దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ మేళాల ద్వారా 11 లక్షల పైచిలుకు నియామక పత్రాలు జారీ చేశారు.
- మేళాను దేశవ్యాప్తంగా 45 ప్రదేశాలలో నిర్వహించారు.
- భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి కొత్తగా ఎంపికైన అభ్యర్థులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, ఉన్నత విద్యా విభాగం మొదలైన భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో చేరనున్నారు.

*ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.*

## యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను అందిస్తున్న రోజ్‌గార్ మేళా

| ఎప్పుడు | నియామక పత్రాల పంపిణీ |
|---|---|
| అక్టోబర్ 22, 2022: | 75,000 పైచిలుకు |
| నవంబర్ 22, 2022: | 71,000 పైచిలుకు |
| జనవరి 20, 2023: | 71,000 పైచిలుకు |
| ఏప్రిల్ 13, 2023: | 71,000 పైచిలుకు |
| మే 16, 2023: | 70,000 పైచిలుకు |
| జూన్ 13, 2023: | 70,000 పైచిలుకు |
| జూలై 22, 2023: | 70,000 పైచిలుకు |
| ఆగస్ట్ 28, 2023: | 51,000 పైచిలుకు |
| సెప్టెంబర్ 26, 2023: | 51,000 పైచిలుకు |
| అక్టోబర్ 28, 2023: | 51,000 పైచిలుకు |
| నవంబర్ 30, 2023: | 51,000 పైచిలుకు |
| ఫిబ్రవరి 12, 2024: | 100,000 పైచిలుకు |
| అక్టోబర్ 29, 2024: | 51,000 పైచిలుకు |
| డిసెంబర్ 23, 2024: | 71,000 పైచిలుకు |
| ఏప్రిల్ 26, 2025: | 51,000 పైచిలుకు |
| జూలై 12, 2025: | 51,000 పైచిలుకు |
| అక్టోబర్ 24, 2025: | 51,000 పైచిలుకు |
| జనవరి 24, 2026: | 61,000 పైచిలుకు |

**"నేడు భారత్‌పై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విశ్వాసం యువతకు అనేక కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఒక దశాబ్దంలో భారత్ తన జీడీపీని రెండింతలు చేసింది. 2014కు ముందు ఉన్న పది సంవత్సరాలతో పోలిస్తే భారత్‌కు రెండున్నర రెట్లు ఎక్కువ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి. ఎక్కువ విదేశీ పెట్టుబడులు అంటే భారత యువతకు లెక్కలేనన్ని ఉపాధి అవకాశాలు అని అర్థం.**

*నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*



గణనీయంగా పెరిగింది. భారతదేశ స్టార్టప్ వ్యవస్థ కూడా వేగంగా విస్తరిస్తోంది. నేడు, దేశంలో దాదాపు రెండు లక్షల అంకుర సంస్థలు ఉన్నాయి. ఇవి 2.1 మిలియన్లకు పైగా యువతకు ఉపాధి కల్పిస్తున్నాయి. అదేవిధంగా, డిజిటల్ ఇండియా ఒక కొత్త ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చింది. యానిమేషన్, డిజిటల్ మీడియా వంటి అనేక రంగాలలో భారతదేశం ఒక ప్రపంచ కేంద్రంగా మారుతోంది. భారతదేశ సృష్టికర్తల ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇది యువతకు కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తోంది.

### భారతదేశం: ఒక ప్రధాన తయారీ కేంద్రం

నేడు, భారతదేశం ఒక ప్రధాన తయారీ శక్తిగా మారుతోంది. ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, టీకాలు, రక్షణ, ఆటోమొబైల్స్ వంటి అనేక రంగాలలో, భారతదేశ ఉత్పత్తి, ఎగుమతులు గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నాయి. 2014 నుండి, భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీ ఆరు రెట్లు పెరిగింది. నేడు, ఇది రూ.11 లక్షల కోట్ల కంటే ఎక్కువ విలువైన పరిశ్రమ. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు కూడా రూ.4 లక్షల కోట్లు దాటాయి. భారతదేశ ఆటో పరిశ్రమ కూడా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఒకటిగా మారింది. 2025లో, ద్విచక్ర వాహనాల అమ్మకాలు 20 మిలియన్ యూనిట్లను దాటాయి.



పరాక్రమ్ దివస్

# జాతీయ చైతన్య వేడుక

***నేతాజీ సుభాష్ చంద్రబోస్ అనే పేరు వినగానే మన హృదయాల్లో దేశభక్తి ఉప్పొంగుతుంది. ఆయన యువతను సంఘటితం చేసి ఆజాద్ హింద్ ఫౌజ్ (ఇండియన్ నేషనల్ ఆర్మీ)ను ఏర్పాటు చేసి, భారత స్వాతంత్ర్యం కోసం తొలి సైనిక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 1943లో అండమాన్, నికోబార్ దీవుల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వతంత్ర భారతాన్ని ప్రకటించారు. 2021 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 23న ఆయన జయంతిని దేశం "పరాక్రమ్ దివస్"గా నిర్వహించుకుంటోంది. అండమాన్, నికోబార్ దీవుల్లో నిర్వహించిన పరాక్రమ్ దివస్ కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఇటీవలి సంవత్సరాల్లో పరాక్రమ్ దివస్ దేశ స్ఫూర్తి, జాతీయ చైతన్యంలో అంతర్భాగమైన పండుగగా మారిందని అన్నారు...***

నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటానికి మాత్రమే పరిమితమైన మహానాయకుడు కాదని, స్వతంత్ర భారతానికి దార్శనికుడని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆయన ఆధునిక రూపంలో ఉంటూనే, భారతదేశ ప్రాచీన చేతనలో వేళ్లూనుకున్న ఒక దేశాన్ని ఊహించారు. నేతాజీ దృష్టిని నేటి తరానికి పరిచయం చేయడం మన బాధ్యత అని పేర్కొంటూ, ప్రభుత్వం ఆ బాధ్యతను నెరవేరుస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. నేతాజీకి అంకితమైన కార్యక్రమాలు ఆయనకు గౌరవ సూచకమే కాకుండా, మన యువతకు, రాబోయే తరాలకు శాశ్వత ప్రేరణా మూలాలుగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఆదర్శాలను గౌరవిస్తూ, వాటి నుంచి ప్రేరణ పొందడమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని ఆత్మవిశ్వాసం, స్ఫూర్తితో నింపుతుందని ప్రధాన మంత్రి మోదీ చెప్పారు. బలహీన దేశం తన లక్ష్యాలను సాధించడం కష్టమని, అందుకే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఎల్లప్పుడూ బలమైన దేశాన్ని కలగా కన్నారని ఆయన తెలిపారు. 21వ శతాబ్దంలో భారతదేశం కూడా శక్తివంతమైన, సంకల్పబలమైన దేశంగా తనను తాను నిర్మించుకుంటోందని అన్నారు. శక్తిని ఎలా నిర్మించాలి, ఎలా నిర్వహించాలి, ఎలా వినియోగించాలి అన్నది నేటి భారత్‌కు తెలుసని పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ దృఢమైన భారతదేశ దృష్టిని అనుసరించి, రక్షణ రంగాన్ని స్వయం సమృద్ధిగా



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

**నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా, ఆయన అజేయ ధైర్యం, దృఢ సంకల్పం, దేశానికి అందించిన అపూర్వమైన సేవలను మనం ఎప్పటికీ స్మరించుకుంటాం. ఆయన నిర్భయ నాయకత్వానికి, అచంచల దేశభక్తికి ప్రతీక. దృఢమైన భారత జాతిని నిర్మించేందుకు ఆయన ఆదర్శాలు తరతరాలుగా ప్రేరణనిస్తూనే ఉంటాయి.**

*నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*

### పరాక్రమ్ దివస్

- ఇది అసాధ్యాన్ని సవాల్ చేసిన వారసత్వానికి అర్పించే నివాళి.
- చరిత్ర గతిని మార్చిన ధైర్యానికి ఒక స్మరణ.
- భారత స్వాతంత్ర్య పోరాటానికి రూపునిచ్చిన విలువలను పునరుద్ఘాటించుకోవడం

## నేతాజీ జీవితం, ఆదర్శాలను ప్రజల్లో విస్తృతంగా పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నాలు

- నేతాజీకి సంబంధించిన ఒక మార్గదర్శక పథకమైన ఈ-గ్రామ్ విశ్వగ్రామ్ యోజన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఐటీ రంగాన్ని రూపుమార్చింది, దీనిని జనవరి 23, 2009న ప్రారంభించారు.
- గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, 2012లో అహ్మదాబాద్‌లో ఆజాద్ హింద్ ఫౌజ్ దినోత్సవం సందర్భంగా నరేంద్ర మోదీ ఘన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు సంబంధించిన ఫైళ్లు, పత్రాలను గోప్యత నుంచి విడుదల చేసి ప్రజలకు అందుబాటులో ఉంచారు.
- 2018లో ఆజాద్ హింద్ ప్రభుత్వ స్థాపన 75వ వార్షికోత్సవాన్ని ఎర్రకోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.
- అండమాన్, నికోబార్ దీవుల్లోని మూడు ప్రధాన దీవులకు కొత్త పేర్లు పెట్టారు. రాస్ దీవిని ఇప్పుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీప్‌గా పిలుస్తున్నారు.
- ఎర్రకోటలో ఉన్న క్రాంతి మందిర్ మ్యూజియంలో నేతాజీ, ఇండియన్ నేషనల్ ఆర్మీకి సంబంధించిన ముఖ్యమైన చారిత్రక అవశేషాలు భద్రపరిచారు. ఇందులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ధరించిన టోపీ కూడా ఉంది.
- 2021లో భారత ప్రభుత్వం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జన్మదినాన్ని 'పరాక్రమ్ దివస్'గా ప్రకటించింది.
- 2024 సెప్టెంబర్ 13న అండమాన్, నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును 'శ్రీ విజయపురం'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.
- నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌కు ఘన నివాళిగా, వలసపాలన మనస్తత్వాన్ని వీడే సంకల్పానికి ప్రతీకగా ఇండియా గేట్ సమీపంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

తీర్చిదిద్దేందుకు దేశం పనిచేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, గతంలో భారత్ ఆయుధాల కోసం పూర్తిగా విదేశాలపై ఆధారపడేదని, కానీ నేడు భారత రక్షణ ఎగుమతులు 23,000 కోట్ల రూపాయలను దాటాయని తెలిపారు. దేశీయంగా తయారైన బ్రహ్మోస్ క్షిపణి సహా ఇతర క్షిపణులు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని ఆయన అన్నారు.

**సుభాష్ చంద్ర బోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ – 2026**

సుభాష్ చంద్ర బోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ – 2026 లో భాగంగా సంస్థాగత విభాగంలో సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థను ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో లెఫ్టినెంట్ కర్నల్ సీతా అశోక్ షెల్కే ఎంపికయ్యారు. విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు అందించిన సేవలు, నిస్వార్థ సేవలను గుర్తించి గౌరవించేందుకు భారత ప్రభుత్వం సుభాష్ చంద్ర బోస్ ఆపద ప్రబంధన్ పురస్కారాలను ఏర్పాటు చేసింది. దీని ఫలితంగా సహజ విపత్తుల సమయంలో మరణాల సంఖ్యలో గణనీయమైన తగ్గుదల నమోదైంది.

**13 ప్రాంతాల్లో పరాక్రమ్ దివస్ వేడుకలు**

అండమాన్, నికోబార్ దీవుల్లో జరిగిన ప్రధాన వేడుకలతో పాటు, నేతాజీ జీవితానికి, వారసత్వానికి సన్నిహితంగా సంబంధించిన దేశవ్యాప్తంగా ఉన్న 13 ప్రముఖ ప్రాంతాల్లో కూడా పరాక్రమ్ దివస్‌ను నిర్వహించారు. అవి– కటక్, కోడాలియా, రామ్‌గఢ్, హరిపుర, జబల్పూర్, కోల్‌కతా, ముర్షిదాబాద్, దల్హౌసీ, ఢిల్లీ, మొయిరాంగ్, కోహిమా, గోమోహ్ మీరట్.




నేషనల్ క్యాడెట్ కార్ప్స్

# ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో కూడిన యువశక్తి

***నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఒక సంస్థ మాత్రమే కాదు, ఇది భారత యువతను ఆత్మవిశ్వాసంతో, క్రమశిక్షణతో, ఇంద్రియగ్రాహ్య మనస్సుతో, దేశానికి అంకితమైన పౌరులుగా తీర్చిదిద్దే ఒక ఉద్యమం. ఇటీవల కాలంలో ఎన్‌సీసీలో చేరుతున్న క్యాడెట్ల సంఖ్య 14 లక్షల నుంచి 20 లక్షలకు పెరిగింది. 2026 ఎన్‌సీసీ రిపబ్లిక్ డే క్యాంప్ ముగింపు సందర్భంగా ఢిల్లీలోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వార్షిక ఎన్‌సీసీ పీఎం ర్యాలీలో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, "ఎన్‌సీసీ ప్రతి ఏడాది తన పాత్రను మరింత బలోపేతం చేస్తోంది..." అని అన్నారు.***

యువతకు ఎన్‌సీసీ ఒక వేదిక. ఈ వేదికపై వారి వారసత్వాన్ని గర్వంతో జరుపుకుంటారు. ఉదాహరణకు, ఈ ఏడాది ఎన్‌సీసీ వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. పరమవీర్ సాగర్ యాత్ర కూడా దీనికి మరో అద్భుత ఉదాహరణ. ఎన్‌సీసీ ర్యాలీలో పరమవీర్ సాగర్ యాత్ర గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, "కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం అండమాన్, నికోబార్ దీవుల్లోని 21 దీవులకు మన పరమవీర్ చక్ర పురస్కార గ్రహీతల పేర్లు పెట్టడం జరిగింది. ఈ నౌకా యాత్ర ద్వారా మీరు ఈ జాతీయ వీరులను గౌరవించే భావనను మరింత బలపరిచారు. అలాగే లక్షద్వీప్‌లో ద్వీపోత్సవం ద్వారా సముద్రం, సంస్కృతి, ప్రకృతిని ఒకేసారి జరుపుకున్నారు" అని అన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లను ప్రశంసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, చరిత్రను స్మారక చిహ్నాల నుంచి బయటకు తీసి ప్రజల హృదయాల్లో సజీవంగా నిలిపిన ఘనత ఎన్‌సీసీదేనని అన్నారు. బాజీరావు పీశ్వా వీరత్వం, మహావీరుడు లచిత్ బోర్ఫుకన్ నైపుణ్యం, భగవాన్ బిర్సా ముండా నాయకత్వాన్ని చాటిచెప్పే సైకిల్ ర్యాలీల ద్వారా ఎన్‌సీసీ ప్రజల్లో అవగాహనను పెంపొందించిందని తెలిపారు. నేడు ప్రపంచమంతా భారత యువతను గొప్ప విశ్వాసంతో చూస్తోంది. ఈ విశ్వాసానికి కారణం వారి నైపుణ్యాలు, విలువలే. భారతదేశ యువత ప్రజాస్వామ్య విలువలను, అన్ని రకాల వైవిధ్యాలను గౌరవించే విలువలను, ప్రపంచం మొత్తాన్ని ఒకే కుటుంబంగా భావించే విలువలను కలిగి ఉన్నారు.

ర్యాలీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, అందువల్ల భారత యువత ప్రపంచంలోని ఏ దేశానికి వెళ్లినా అక్కడి ప్రజలతో సులభంగా కలిసిపోతూ వారి హృదయాలను గెలుచుకుంటారని అన్నారు. తమ సామర్థ్యాలతో ఆ దేశ అభివృద్ధికి కూడా వారు సహకరిస్తారని చెప్పారు. ఇవే



## 20 లక్షలకు పెరిగిన ఎన్‌సీసీ క్యాడెట్ల సంఖ్య

ఇటీవలి సంవత్సరాల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల సంఖ్య 14 లక్షల నుంచి 20 లక్షలకు పెరిగింది. ముఖ్యంగా సరిహద్దు, తీర ప్రాంతాల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 'ఏక్ పేడ్ మా కే నామ్' ఉద్యమం కింద ఎన్‌సీసీ సుమారు 8 లక్షల చెట్లను నాటింది.

### ర్యాలీ ఇతివృత్తం

### 'దేశం ప్రథమం- విధికి అంకితమైన యువత'

- వార్షిక ఎన్‌సీసీ పీఎం ర్యాలీ 2026 ఇతివృత్తం 'రాష్ట్ర ప్రథమ్-కర్తవ్య నిష్ఠ యువ', ఇది భారతదేశ యువతలో కర్తవ్యం, క్రమశిక్షణ, జాతీయ నిబద్ధత స్ఫూర్తిని ప్రతిబింబించింది.
- ఎన్‌సీసీ పీఎం ర్యాలీ నెల రోజుల పాటు జరిగిన ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరం 2026 ముగింపును సూచించింది.
- ఈ సంవత్సరం, దేశవ్యాప్తంగా 2,406 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొన్నారు, వీరిలో 898 మంది బాలికా క్యాడెట్లు ఉన్నారు. 21 ఇతర దేశాల నుండి 207 మంది యువకులు, అధికారులు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.
- ఈ కార్యక్రమంలో, ఎన్‌సీసీ క్యాడెట్లు, రాష్ట్రీయ రంగశాల సభ్యులు, జాతీయ సేవా పథకం వారు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా దేశ నిర్మాణం, సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాసంలో యువత పాత్రను ప్రదర్శించారు.

**మన దేశ యువత సాధించిన విజయాలను ప్రపంచమంతా ప్రశంసిస్తోంది. ఈ యువత వల్లే భారతదేశం ప్రపంచంలో సమాచార సాంకేతిక రంగంలో వెన్నెముకగా మారింది. ఇప్పుడు, ఈ యువశక్తితో అంకుర సంస్థలు, అంతరిక్షం, డిజిటల్ సాంకేతికత వంటి ప్రతి రంగంలోనూ ఒక కొత్త విప్లవం ప్రారంభమైంది.**

*నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*

*ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.*


మన విలువలు, ఇదే మన స్వభావం. మాతృభూమిపై అపారమైన భక్తి, మన పని పట్ల అసమానమైన అంకితభావం- ఇవే మన వారసత్వమని పేర్కొన్నారు.

**యువత కోసం ఫిట్‌నెస్ మంత్రం**

రాబోయే కాలంలో యువశక్తిని కొలిచే గొప్ప ప్రమాణం మనం ఎంత ఫిట్‌గా ఉంటామనే అంశమే. ఫిట్‌నెస్ అంటే కేవలం కొన్ని నిమిషాల వ్యాయామం మాత్రమే కాదని, అది మన స్వభావంలో భాగంగా మారాలని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఆహారం నుంచి రోజువారీ జీవనశైలి వరకు క్రమశిక్షణ అవసరమని ఆయన తెలిపారు. ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ఎన్‌సీసీ ముందుకు తీసుకెళ్తోందని, ఎన్‌సీసీ క్యాడెట్లు క్రీడల్లో కూడా మెరుగైన ప్రదర్శన ఇస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి విజ్ఞప్తి చేస్తూ, మన నూనె వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నిద్దామని అన్నారు. కొంతకాలం క్రితం ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని ప్రజలను కోరానని, ఈ రోజు అదే విజ్ఞప్తిని మళ్లీ యువతందరికీ చేస్తున్నానని తెలిపారు.

**ప్రధాని మోదీ 'దేశం ప్రథమం' భావనకు ఎన్‌సీసీ బలం**

జాతీయ భద్రతకు సంబంధించిన ఆపరేషన్ సిందూర్ వంటి కీలక సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు తమ బాధ్యతలను అద్భుతంగా నిర్వహించారని ప్రధాన మంత్రి కొనియాడారు. కొందరు సాయుధ దళాల సన్నాహాల్లో సహకరించగా, మరికొందరు రక్తదాన శిబిరాలను నిర్వహించారని, ఇంకొందరు ప్రథమ చికిత్స శిబిరాల ద్వారా సేవలందించారని ఆయన తెలిపారు. పరేడ్ గ్రౌండ్ శిక్షణతో పాటు, "నేషన్ ఫస్ట్" (దేశం ప్రథమం) అనే సిద్ధాంతంలో కూడా ఎన్‌సీసీ శిక్షణ ఇస్తోందని అన్నారు. ఈ దేశభక్తి, నాయకత్వ భావన ఎన్‌సీసీ ద్వారా క్యాడెట్లలో నాటుకుపోయి, కష్టకాలాల్లో దేశం కోసం పూర్తి అంకితభావంతో పని చేయడానికి ప్రేరణనిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. "నేను ఎన్‌సీసీలో ఉన్నప్పుడు కూడా 'నేషన్ ఫస్ట్' భావన ఇదే విధంగా బలపడింది. ఈ రోజు మీరు అందరూ ఎన్‌సీసీలో అదే విలువలను నేర్చుకోవడాన్ని చూసి నాకు గర్వంగా ఉంది" అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.




**భారత నూతన శక్తి దృక్పథం**


# ఇంధన భద్రతతో పాటు ఆత్మనిర్భరత

**భవిష్యత్ అవసరాలు, సవాళ్లను తీర్చడంపై దృష్టి సారించి, భారతదేశం ఇప్పుడు ఇంధన భద్రత వైపు మాత్రమే కాకుండా ఇంధన స్వావలంబన వైపు కూడా కృషి చేస్తోంది. భారతదేశానికి ఇంధన రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. గోవా వేదికగా జనవరి 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇండియా ఎనర్జీ వీక్ 2026 నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ ప్రతినిధులకు భారత్‌లో తయారీ, పరిశోధన చేయాలని, పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.**

భారతదేశంలో ఇంధన రంగంలో స్వావలంబన ఇకపై ఒక ఎంపిక కాదు. ఆర్థిక, వ్యూహాత్మక, భౌగోళిక-రాజకీయ అవసరం. అందుకే భారత్ హరిత, స్వచ్ఛమైన ఇంధనాన్ని వేగంగా స్వీకరించడమే కాకుండా ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తి సామర్థ్య లక్ష్యాలను నిర్దేశించుకుంటుంది. వాటిని అనుకున్న సమయాన్ని కన్నా ముందే సాధిస్తోంది. భారతదేశం ఇంధన రంగంలో స్వావలంబన సాధిస్తూ, మరోవైపు విదేశీ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనే అనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇంధన రంగంలో భాగస్వామ్యాలు, పెట్టుబడులను ఆకర్షించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారతదేశం తన దేశీయ డిమాండ్‌ను తీర్చగల హరిత ఇంధన వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. అదేవిధంగా తక్కువ ఖర్చుతో కూడిన రవాణా వ్యవస్థను నెలకొల్పి ఎగుమతుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది.

భారత్ ప్రతి రంగంలో ప్రపంచ భాగస్వామ్యాలను పెంచడానికి నిరంతరం కృషి చేస్తోంది. భాగస్వామ్యాలను బలోపేతం చేసే ఈ ప్రయత్నానికి అనుగుణంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇండియా ఎనర్జీ వీక్ 2026లో ప్రసంగించారు. భారతదేశంలో ఇంధన విలువ గొలుసుతో అనుసంధానించబడిన వివిధ రంగాలలో గణనీయమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని అన్నారు. భారతదేశం ఈ రంగంలో తన పరిశోధనను మరింత ముందుకు తీసుకెళ్తోంది.


లోతైన సముద్ర అన్వేషణకు సంబంధించిన మిషన్ ఇందుకు ఒక ఉదాహరణ. ఈ దశాబ్దం చివరి నాటికి భారతదేశంలోని చమురు,



భారతదేశం ప్రస్తుతం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో దూసుకుపోతోంది. ప్రతి రంగంలో వేగంగా సంస్కరణలు అమలు అవుతున్నాయి. దేశీయ హైడ్రోకార్బన్ రంగాన్ని బలోపేతం చేయడానికి సంస్కరణలు చేపడుతున్నాం. అంతర్జాతీయ సహకారం కోసం పారదర్శకమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాం.. అన్వేషణ రంగంలో 'చేరుకోలేని' ప్రాంతాలను సైతం మేము గణనీయంగా తగ్గించాం.

*– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



## భారతదేశ ఇంధన రంగంలో పెట్టుబడులు లాభదాయకం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా ఎనర్జీ వీక్ 2026లో పాల్గొన్న 125 దేశాల ప్రతినిధులతో మాట్లాడుతూ, భారత్ ఇంధన రంగంలో పెట్టుబడులను అత్యంత లాభదాయకంగా మారుస్తుందని తెలిపారు. భారతదేశానికి విస్తృత రిఫైనింగ్ సామర్థ్యం ఉందని, ఈ విషయంలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నామని, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటామని ఆకాంక్షించారు. ప్రస్తుతం భారతదేశ ఇంధన శుద్ధి సామర్థ్యం సుమారు 260 ఎంఎంటీపీఏగా ఉండగా, దాన్ని 300 ఎంఎంటీపీఏకు మించి పెంచేందుకు నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని తెలిపారు. దేశ మొత్తం శక్తి అవసరాల్లో 15 శాతం ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) ద్వారా తీర్చాలనే లక్ష్యాన్ని భారత్ పెట్టుకుందని ప్రధాని పేర్కొన్నారు. ఎల్ఎన్‌జీ వాల్యూ చైన్ మొత్తంపై పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఎన్‌జీ రవాణాకు అవసరమైన నౌకలను భారతదేశంలోనే తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇటీవల భారతదేశంలో నౌక నిర్మాణానికి రూ.70,000 కోట్ల విలువైన కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. అలాగే, ఎల్ఎన్‌జీ రవాణా కోసం విస్తృత పైప్‌లైన్ నెట్‌వర్క్ కూడా ఇప్పుడు భారత్‌కు అవసరమని చెప్పారు.

### ప్రపంచవ్యాప్తంగా 150కిపైగా దేశాలకు విస్తరించిన భారత ఎగుమతులు

"భారత్ ఇంధన రంగానికి అపార అవకాశాలు కల్పించే నేల. ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటిగా ఉండటంతో ఇంధన ఉత్పత్తులపై డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. అంతేకాకుండా, ప్రపంచ అవసరాలను తీర్చడానికి భారత్‌లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోని అత్యుత్తమ ఐదు పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారులలో ఒకటిగా ఉండి, 150కిపైగా దేశాలకు ఎగుమతులు చేస్తోంది. భారతదేశ సామర్థ్యం పెట్టుబడిదారులకు ఎంతో ఉపయోగపడుతోంది" ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఇండియా ఎనర్జీ వీక్ 2026 వేదిక భాగస్వామ్యాలను అన్వేషించడానికి అద్భుతమైన అవకాశమని ఆయన పేర్కొన్నారు.

వాయు రంగాల్లో పెట్టుబడులను 100 బిలియన్ డాలర్లకు పెంచడం, అన్వేషించాల్సిన ప్రాంతాన్ని 10 లక్షల చదరపు కిలోమీటర్లకు విస్తరించడం అనే లక్ష్యాన్ని సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 170కు పైగా బ్లాకులను కేటాయించారు. అండమాన్, నికోబార్ బేసిన్ కూడా దేశానికి తదుపరి హైడ్రోకార్బన్ నిల్వలకు అవకాశంగా అవతరిస్తోంది.




# అభివృద్ధిని వేగవంతం చేస్తున్న వ్యూహాత్మక సహకారం

***ఇటీవలి సంవత్సరాల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్-భారత్ మధ్య సంబంధాలు కొత్త శిఖరాలను చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానంతో యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ జనవరి 19న భారత్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో రెండు దేశాల మధ్య అనేక ప్రధాన ఒప్పందాలు కుదిరాయి...***

భారత్- యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాల మధ్య ఇప్పటికే కొనసాగుతున్న వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ, అవిష్కరణ తదితర రంగాల్లో తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మరింత పెంపొందించుకుంటున్నాయి. యూఏఈ అధ్యక్షుడి ఈ పర్యటన కేవలం ఒక అధికారిక పర్యటన మాత్రమే కాకుండా, ఉమ్మడి శ్రేయస్సు, సాంకేతిక సహకారం, ప్రజల మధ్య బలమైన సంబంధాలను పెంపొందించే దిశగా తీసుకున్న కీలక అడుగుగా చెప్పవచ్చు. రెండు దేశాల మధ్య సంబంధాల ప్రాముఖ్యతను మరింత స్పష్టం చేస్తూ, యూఏఈ అధ్యక్షుడిని స్వాగతించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లారు. ఈ పర్యటన రెండు దేశాలు బలమైన స్నేహానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది. గత 10 సంవత్సరాల్లో షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్‌ను ఐదవసారి సందర్శించడమే కాకుండా, అధ్యక్షుడిగా ఇది ఆయన మూడవ అధికారిక పర్యటన కావడం ద్వారా ఈ సంబంధాల లోతు మరింత స్పష్టమవుతోంది.

సమావేశం అనంతరం విడుదలైన సంయుక్త ప్రకటనలో, 2022లో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) కుదిరిన తరువాత వాణిజ్య, ఆర్థిక సహకారంలో గణనీయమైన వృద్ధిని సాధించాలని ఇరు నేతలు స్వాగతించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకున్నదని గుర్తించారు. ఇరు దేశాల వ్యాపార దిగ్గజాలు, 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 200 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. భారత్-యూఏఈ స్నేహానికి శాశ్వత ప్రతీకగా అబుదాబీలో 'హౌస్ ఆఫ్ ఇండియా'ను స్థాపించాలనే నిర్ణయాన్ని కూడా ఇరు నేతలు తీసుకున్నారు. సాంస్కృతిక అవగాహనను మరింత పెంపొందించే లక్ష్యంతో ప్రజల మధ్య సంబంధాలను కొనసాగిస్తూ, మరింత బలపరచేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. భారత్-యూఏఈ భాగస్వామ్యంలో విద్య ఒక



## ముఖ్యమైన ప్రకటనలు

- భారతదేశంలో సూపర్ కంప్యూటింగ్ క్లస్టర్ ఏర్పాటు.
- 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని $200 బిలియన్ డాలర్లకు పెంచడం లక్ష్యం.
- ద్వైపాక్షిక పౌర అణు సహకారం కోసం ప్రోత్సాహం.
- గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో యూఏఈ సంస్థలు ఫస్ట్ అబుదాబి బ్యాంక్ (ఎఫ్ఏబి) డీపీ వరల్డ్ కార్యాలయాలు, కార్యకలాపాల స్థాపన.
- డిజిటల్/డేటా రాయబార కార్యాలయాన్ని స్థాపించే అవకాశాల అన్వేషణ.
- అబుదాబిలో హౌస్ ఆఫ్ ఇండియా ఏర్పాటు.
- యువజన మార్పిడి కార్యక్రమాలను ప్రోత్సహించడం.

ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రధాన అంశంగా గుర్తించారు. యూఏఈలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్‌ల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ప్రారంభించేందుకు ఇరు దేశాలు స్వాగతించాయి. విద్యాసంస్థల మధ్య మరింత విస్తృత సహకారాన్ని ప్రోత్సహించాలనే నిర్ణయం తీసుకున్నారు. దీనిలో పాఠశాలలు, కళాశాలల్లో ఆవిష్కరణలు, టింకరింగ్ ల్యాబ్‌ల విస్తరణలో సహకారం కూడా ఉండనుంది.

ఇరు దేశాల మధ్య ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యం బలపడుతున్నందుకు ఇరు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. భారతదేశ ఇంధన భద్రతకు యూఏఈ అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రస్తావించారు. 2028 నుంచి ప్రారంభమయ్యేలా, సంవత్సరానికి 0.5 మిలియన్ టన్నుల ద్రవీకృత సహజ వాయువు సరఫరా కోసం





*2026లో భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతున్న తరుణంలో, సదస్సు విజయవంతం కావడానికి యూఏఈ తన పూర్తి మద్దతును ప్రకటించింది. 2026 చివరిలో యూఏఈ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూఎన్ వాటర్ కాన్ఫరెన్స్ 2026 కు భారత్ తన మద్దతును ప్రకటించింది.*

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, అడ్నాక్ గ్యాస్ మధ్య 10 సంవత్సరాల ఒప్పందం కుదిరింది. ఇరు దేశాల సార్వభౌమ అధికారం, భౌగోళిక సమగ్రత పట్ల గౌరవం, అలాగే వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి ప్రాధాన్యతను ప్రధానంగా ప్రస్తావించారు. నిరంతరమైన, దృఢమైన ద్వైపాక్షిక రక్షణ, భద్రతా సహకారం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలక అంశంగా గుర్తించారు. సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని సహా, అన్ని రూపాల్లో, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూ, ఉగ్రవాద చర్యలకు నిధులు సమకూర్చే, ప్రణాళికలు రూపొందించే, మద్దతు ఇచ్చే లేదా అమలు చేసే వారికి ఏ దేశమూ సురక్షితమైన ఆశ్రయాన్ని కల్పించకూడదని స్పష్టం చేశారు. ●



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

**"మహత్తరమైన ఒప్పందం"**

# భారత్-ఈయూ బంధాల్లో కొత్త అధ్యాయానికి శంఖారావం

***ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భారీ కుదుపులను ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభ సమయంలో, భారత్- ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య కుదిరిన చరిత్రలోనే అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అంతర్జాతీయ స్థాయిలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించనుంది. యూరోపియన్ యూనియన్ ఇప్పటికే భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటి. భారతదేశం—యూరోపియన్ యూనియన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం స్థిరంగా పెరుగుతూ, 2024-25లో 11.5 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ ఒప్పందం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసి పోటీ సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, పెట్టుబడులు, ఆవిష్కరణలు, సరఫరా గొలుసులు, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలను కూడా తెరుస్తుంది...***

ప్రపంచంలో రెండో, నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య కుదిరిన ఈ చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేక కోణాల్లో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ ఒప్పందం భారత్, యూరోపియన్ యూనియన్‌లోని రెండు కోట్ల మంది ప్రజలకు మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర దేశాలపై కూడా విస్తృత ప్రభావాన్ని చూపనుంది. ఈ చారిత్రాత్మక ఒప్పందం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు అంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ సమక్షంలో కుదిరింది. ఈ ఒప్పందంతో ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తులు తమ సంబంధాల్లో ఒక నిర్ణాయక అధ్యాయాన్ని జోడించాయి.

భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేస్తుంది. ఇది భారత రైతాంగానికి, చిన్న పరిశ్రమలకు ఐరోపా మార్కెట్‌లో సులభమైన ప్రవేశాన్ని కల్పిస్తుంది. తయారీ రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. సేవల రంగంలో సహకారాన్ని పెంపొందిస్తుంది. ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అలాగే నిపుణులు, విద్యార్థులు, పరిశోధకులకు చలనశీలతను పెంచుతుంది.

ఈ ఒప్పందం వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. అలాగే యూరోపియన్ యూనియన్‌లో భారతీయ విద్యార్థులు, కార్మికులు, నిపుణులకు కొత్త అవకాశాలను తెరుస్తుంది.

భారత్– యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య సంబంధాలు ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా పురోగమించాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. యూరోపియన్ యూనియన్‌లో నివసిస్తున్న 8 లక్షలకు పైగా భారతీయులు ఈ పురోగతికి ఎంతగానో తోడ్పడుతున్నారు. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య వాణిజ్యం 180 బిలియన్ యూరోల స్థాయికి చేరుకుంది. వ్యూహాత్మక సాంకేతికత, హరిత ఇంధనం, డిజిటల్ గవర్నెన్స్ నుంచి అభివృద్ధి భాగస్వామ్యాల వరకు సహకారానికి కొత్త కోణాలు ఏర్పడ్డాయి. నేడు భారత్ తన చరిత్రలోనే అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జనవరి 27వ తేదీన, ఈయూకు చెందిన 27 సభ్య దేశాలతో భారత్ ఈ ఎఫ్‌టీఏలోకి ప్రవేశించడం ఒక సంతోషకరమైన కాకతాళీయం. ఈ చారిత్రాత్మక ఒప్పందం మన రైతులు, చిన్న సంస్థలకు యూరోపియన్ మార్కెట్లకు సులభమైన ప్రాప్తిని కల్పిస్తుంది. తయారీ రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. అలాగే సేవా రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అంతేకాకుండా, ఈ ఎఫ్‌టీఏ భారత్– యూరోపియన్ యూనియన్ మధ్య పెట్టుబడులను పెంచి, ఆవిష్కరణ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తుంది. ప్రపంచ సరఫరా గొలుసులను బలోపేతం చేయడంతో పాటు, ఈ ఒప్పందం సంయుక్త సౌభాగ్యానికి ఒక కొత్త నమూనాగా నిలుస్తుంది. ఏ వ్యూహాత్మక భాగస్వామ్యానికైనా రక్షణ, భద్రతా సహకారమే పునాది అని, దీనిని భారత్– యూరోపియన్ యూనియన్ అధికారికంగా స్థిరపరిచాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ భాగస్వామ్యం ఉగ్రవాద నిరోధం, సముద్ర భద్రత, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఇరు పక్షాల మధ్య సహకార పరిధి కూడా విస్తరిస్తుంది. దేశాల మధ్య సంబంధాల ప్రయాణంలో చరిత్ర స్వయంగా “ఇక్కడే దిశ మారింది, ఇక్కడే కొత్త యుగం ప్రారంభమైంది” అని ప్రకటించే క్షణాలు ఉంటాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేటి భారత్–యూరోపియన్ యూనియన్ చారిత్రాత్మక శిఖరాగ్ర సమావేశం అటువంటి క్షణాన్నే ప్రతిబింబిస్తోంది.

**గత 10 సంవత్సరాల్లో రెండింతలైన వాణిజ్యం**

యూరోపియన్ యూనియన్, భారత్‌కు చెందిన అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటి. గత 10 సంవత్సరాల్లో భారత్– యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్యం రెండింతలు పెరిగి 180 బిలియన్ యూరోల స్థాయికి చేరుకుంది. 6,000కు పైగా యూరోపియన్ సంస్థలు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ భారత్‌లో 120 బిలియన్ యూరోలకుపైగా పెట్టుబడులు పెట్టింది. 1,500 భారతీయ కంపెనీలు యూరోపియన్ యూనియన్‌లో ఉన్నాయి. అక్కడ భారతీయ పెట్టుబడులు సుమారు 40 బిలియన్ యూరోల వరకు చేరుకున్నాయి.



**మూడు ప్రాధాన్యాలపై దృష్టి సారించిన ప్రధాని మోదీ**

**మొదటిది:** నేడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం, సాంకేతికత, కీలక ఖనిజాలు ఆయుధాలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఆధారపడటాన్ని తగ్గించేందుకు సంయుక్తంగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

**రెండవది:** భారత్ -యూరోపియన్ యూనియన్ రెండూ రక్షణ పరిశ్రమలు, ఆధునిక సాంకేతికతలపై దృష్టి సారించాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బిజినెస్ ఫోరంలో మాట్లాడుతూ, రక్షణ, అంతరిక్షం, టెలికమ్యూనికేషన్స్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో భాగస్వామ్యాలను పెంచాలని పిలుపునిచ్చారు.

**మూడవది:** స్వచ్ఛత – సుస్థిర భవిష్యత్తు అనేవి ఇరు దేశాలకు ప్రాధాన్యతాంశాలు. గ్రీన్ హైడ్రోజన్ నుంచి సౌరశక్తి, స్మార్ట్ గ్రిడ్స్ వరకు ప్రతి రంగంలో సంయుక్త పరిశోధన చేపట్టాలి, పెట్టుబడులను పెంచాలి.

**22వ ఎఫ్‌టీఏ భాగస్వామి**

యూరోపియన్ యూనియన్ భారతదేశానికి 22వ ఎఫ్‌టీఏ భాగస్వామిగా మారింది. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం మారిషస్, యూఏఈ, యుకే, ఈఎఫ్‌టీఏ, ఒమన్, ఆస్ట్రేలియాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంది. 2025లో ఒమన్, యుకేతో వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. న్యూజిలాండ్‌తో వాణిజ్య ఒప్పందం పూర్తయినట్లు ప్రకటించింది.



## అందుబాటులో మెరుగైన మార్కెట్ ప్రవేశం

భారతదేశం- యూరోపియన్ యూనియన్‌ల మార్కెట్ విలువ 2091.6 లక్షల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వాణిజ్య విలువ పరంగా భారతదేశ ఎగుమతుల్లో 99 శాతానికి పైగా మెరుగైన మార్కెట్ ప్రవేశాన్ని కల్పిస్తుంది.

## యూరోపియన్ మార్కెట్లకు భారతదేశ ప్రవేశం

- భారతదేశం యూరోపియన్ మార్కెట్లలో 97 శాతం టారిఫ్ లైన్లపై ప్రాధాన్యతాత్మక ప్రవేశాన్ని సాధించింది. ఇది మొత్తం వాణిజ్య విలువలో 99.5 శాతాన్ని పూరిస్తుంది.
- వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, క్రీడా వస్తువులు, బొమ్మలు, రత్నాలు, ఆభరణాలు వంటి ముఖ్యమైన శ్రమాధారిత రంగాలకు తక్షణమే సుంకాల తొలగింపు ఉంటుంది. ఇవి 70.4 శాతం టారిఫ్ లైన్లను కవర్ చేస్తాయి. భారతదేశ ఎగుమతుల్లో 90.7 శాతాన్ని సూచిస్తాయి.
- కొన్ని సముద్ర ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి వంటి వాటికి 20.3 శాతం టారిఫ్ లైన్లపై 3 నుండి 5 సంవత్సరాలలో సున్నా సుంకం అమలవుతుంది. ఇవి భారతదేశ ఎగుమతుల్లో 2.9 శాతాన్ని కవర్ చేస్తాయి.
- కొన్ని పౌల్ట్రీ ఉత్పత్తులు, నిల్వ చేసిన కూరగాయలు, బేకరీ ఉత్పత్తులు వంటి వాటికి సుంకాల తగ్గింపుల ద్వారా లేదా కార్లు, ఉక్కు వంటి వాటికి టారిఫ్ రేట్ కోటాల (టీఆర్‌క్యూ) ద్వారా 6.1 శాతం టారిఫ్ లైన్లపై ప్రాధాన్యతాత్మక ప్రవేశం ఉంటుంది. ఇవి భారతదేశ ఎగుమతుల్లో 6 శాతాన్ని కవర్ చేస్తాయి.

**“**

**భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య సహకారం “ప్రపంచ శ్రేయస్సు కోసం భాగస్వామ్యం”గా ఏర్పడుతుంది. మేము ఇండో-పసిఫిక్ నుండి కరేబియన్ వరకు త్రైపాక్షిక ప్రాజెక్టులను విస్తరిస్తాం.తద్వారా సుస్థిర వ్యవసాయం, ఇంధనం శక్తి, మహిళా సాధికారతకు స్పష్టమైన మద్దతును అందించగలుగుతాం. ప్రపంచ వాణిజ్యం, సుస్థిరాభివృద్ధికి కీలకమైన స్తంభంగా ఐఎంఈసీ కారిడార్‌ను స్థాపించడానికి మేము కలిసి పని చేస్తాం.**

*నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*

గత కొన్ని సంవత్సరాలుగా వస్తు, సేవల రంగంలో ద్వైపాక్షిక వాణిజ్యం స్థిరంగా పెరుగుతోంది. 2024-25లో యూరోపియన్ యూనియన్-భారత్ మధ్య జరిగిన ద్వైపాక్షిక వాణిజ్య విలువ రూ.11.5 లక్షల కోట్లు కాగా, ఇందులో ఎగుమతులు ₹6.4 లక్షల కోట్లు, దిగుమతులు ₹5.1 లక్షల కోట్లు ఉన్నాయి. యూరోపియన్ యూనియన్ నుంచి భారతదేశానికి జరిగే ఎగుమతుల్లో యంత్రాలు, రవాణా పరికరాలు, రసాయనాలు ఉన్నాయి. భారతదేశం నుంచి చేసుకున్న దిగుమతుల్లో యంత్రాలు, రసాయనాలు, మూల లోహాలు, ఖనిజ ఉత్పత్తులు, వస్త్రాలు ఉన్నాయి. భారతదేశం–యూరోపియన్ యూనియన్ మధ్య సేవల రంగంలో వాణిజ్యం 2024లో 7.2 లక్షల కోట్లకు చేరుకుంది.

**నాణ్యతే గెలుపు మార్గం... చిరకాల ప్రభావం**

భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన ఈ చారిత్రాత్మక ఒప్పందం దేశంలోని పరిశ్రమలు, వ్యాపారాల్లో ఉన్న తయారీదారులకు విశాలమైన మార్కెట్ అవకాశాలు కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఇప్పుడు ఉత్పత్తులు తక్కువ ధరలకు మార్కెట్‌కు చేరతాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మొదటి, అత్యంత ముఖ్యమైన సూత్రం నాణ్యతపై దృష్టి పెట్టడమే. అత్యుత్తమ నాణ్యతతో మార్కెట్‌లో ప్రవేశించాలి. ఉత్తమ నాణ్యతను అందించడం ద్వారా యూరోపియన్ యూనియన్‌కు చెందిన 27 దేశాల్లోని కొనుగోలుదారుల నుంచి మీరు కేవలం ఆదాయం మాత్రమే కాకుండా వారి హృదయాలను కూడా గెలుచుకుంటారు. ఆ నాణ్యత ప్రభావం దీర్ఘకాలం నిలుస్తుంది.

**సమగ్ర సామాజిక భాగస్వామ్యం**

భారతదేశం – యూరోపియన్ యూనియన్ మధ్య భాగస్వామ్యాన్ని “సమాజమంతటిని కలుపుకునే భాగస్వామ్యం”గా వర్ణిస్తున్నారు. ఈ దృష్టితోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. ఇది భారతదేశంలోని శ్రమాధారిత ఉత్పత్తులకు యూరోపియన్ యూనియన్ మార్కెట్‌కు సులభమైన ప్రవేశాన్ని కల్పిస్తుంది. ఇందులో వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, ఆటోమొబైల్ భాగాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు ఉన్నాయి. పండ్లు, కూరగాయలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఉత్పత్తుల రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయి. దీని ద్వారా దేశంలోని రైతులు, మత్స్యకారులు, సేవారంగం నేరుగా లాభపడతాయి. ఐటీ, విద్య, సంప్రదాయ వైద్యం, వ్యాపార సేవల రంగాలు కూడా ప్రయోజనం పొందనున్నాయి.●



**Narendra Modi**
@narendramodi


The Union Budget reflects the aspirations of 140 crore Indians. It strengthens the reform journey and charts a clear roadmap for Viksit Bharat.

#ViksitBharatBudget



**Rajnath Singh**
@rajnathsingh

Under the visionary leadership of PM Shri @narendramodi, India's journey towards a Viksit Bharat continues to gather momentum. In this spirit, I congratulate Finance Minister Smt. @nsitharaman, for presenting a budget that seeks to "transform aspiration into achievement" and "potential into performance". This "Yuva Shakti–driven Budget" will further strengthen PM Modi's vision of an Aatmanirbhar and Viksit Bharat.



**Amit Shah**
@AmitShah

बजट 2026-27 के माध्यम से प्रधानमंत्री मोदी जी ने सिद्ध किया है कि आत्मनिर्भर और विकसित भारत केवल एक नारा नहीं, बल्कि हमारी सरकार का संकल्प है। इस बजट में न सिर्फ हर क्षेत्र, हर वर्ग और हर नागरिक को सशक्त बनाने का एक स्पष्ट ब्लूप्रिंट है, बल्कि उसे प्रोत्साहन देने का एक जमीनी विजन भी है, जो उसे हर कदम पर मदद करेगा। #ViksitBharatBudget एक ऐसे भारत के निर्माण का विजन है, जो विश्व में हर क्षेत्र में अग्रणी हो।



**Nitin Gadkari**
@nitin_gadkari

#UnionBudget2026 outlines a decisive roadmap centred on farmers, youth, and MSMEs, strengthening the foundations of inclusive growth, innovation, and capital investment as India progresses towards #ViksitBharat2047.



**Shivraj Singh Cho...**
@ChouhanShivraj

वित्त मंत्री श्रीमती @nsitharaman जी द्वारा प्रस्तुत बजट अमृत काल का वह अमृत-कलश है, जिससे समृद्धि की सरिता बहेगी और विकसित भारत के विराट संकल्प की सिद्धि होगी।

यह बजट अर्थ से सामर्थ्य तक, अंत्योदय से अभ्युदय तक और साधन से समाधान तक की एक स्वर्णिम यात्रा है। इससे खेतों में हरियाली, खलिहानों में खुशहाली और हर चेहरे पर लाली आएगी।



**Manohar Lal**
@mlkhattar

यह विकसित भारत के संकल्प का विजिनरी बजट है...

देश के संसाधनों, सामर्थ्य और समृद्धि को ध्यान में रखते हुए Ease of Doing Business और Ease of Living की दिशा में चलकर लोगो के जीवन को सरल, सहज और समृद्ध करने वाला बजट है।



## Budget to give new speed to India 'Reforms Express': PM

## Centre gives ₹10,000 crore push to desi container manufacturing

TIMELY SUPPORT. Scheme is aimed at creating a globally competitive ecosystem

## Focus on AI, quantum tech as India, EU look to enhance ties

Trade pact may allow duty-free access to 90% of Indian goods

## Teachings of Guru Ravidas inspired Viksit Bharat: PM

Modi renames Adampur airport after Dera Sachkhand Ballan patron

## India gets Ramsar tag for 2 wetlands in Guj, UP

NEW DELHI, JANUARY 31
The wetlands in Kutch in Gujarat and Etah in Uttar Pradesh have been recognised as Ramsar sites, marking the unique ecosystems for conservation under a global framework.

PM Narendra Modi congratulated the local population and those passionate about wetland conservation for the designation of Patna Bird Sanctuary in Etah and Chhari-Dhand in Kutch as Ramsar sites. "Delighted that the Patna Bird Sanctuary in Etah and Chhari-Dhand in Kutch are Ramsar sites," Modi said in a post on X.

The designation of these two sites under the Ramsar Convention takes the total number of such wetlands in India to 98.

Environment Minister Bhupendra Yadav also congratulated UP and Gujarat, and the wetland community, on the two new additions. — PTI

## 'Successful India makes world more stable'

HT Correspondent
letters@hindustantimes.com

NEW DELHI: The presence of European Commission President Ursula von der Leyen and European Council President Antonio Costa at the Republic Day celebrations emphasises the growing strength of the India-European Union (EU) partnership and will deepen bilateral cooperation across sectors, Prime Minister Narendra Modi said on Monday.

Von der Leyen, who has said that India and the EU are coming together to provide an alternative to a "fractured world", remarked on social media that it was "the honour of a lifetime" for her and Costa to be chief guests at the Republic Day parade. "A successful ...

Top EU leaders Ursula von der Leyen and Antonio Costa during the R-Day parade. PTI

stable, prosperous and secure. And we all benefit," she said.

This is only the second time that India has invited the leaders of a bloc – after Asean in 2018 – to be chief guests at the annual display of the country's ...

The EU leaders will join Modi on Tuesday for the India-EU Summit that is expected to produce a shared vision for navigating the geo-economic churn sparked by the trade and security policies of the Trump administration.

Modi wrote on social media that India was privileged to host Costa and Von der Leyen at the Republic Day celebrations and their "presence underscores the growing strength of the India-European Union partnership and our commitment to shared values".

He added, "The visit will add momentum to the deepening engagement and cooperation between India and Europe across diverse sectors."

Europe and India, as the world's largest democracies, ... together to "shape a new global order", Von der Leyen added on social media.

A contingent consisting of EU military staff and the EU naval operations Atalanta and Aspides participated in the Republic Day parade, marking the first such engagement outside Europe.

Von der Leyen said this display of the flags of the EU military staff and the maritime missions was a "powerful symbol of our deepening security cooperation".

This, she added, will culminate with the signing of the Security and Defence Partnership on Tuesday.

Costa and Von der Leyen also attended the "At Home" reception hosted by President Droupadi Murmu at the Rashtapati ...

## From $70b to $140b Vaishnaw Sees Surge in AI Infra Investments

Says India AI Mission 2.0 rollout in 5-6 months; 500 universities to get AI labs

## Post Sindoor, major boost for defence

With the highest-ever outlay of ₹7.85 lakh crore, Budget underlines resolve to upgrade military capabilities to global standards, with a strategic emphasis on self-reliance; capex allocation up 22% to ₹2.19 lakh crore, and 75% of it will be spent on domestic procurement

## Govt chips in with ₹40,000-cr outlay

Mission 2.0 to focus on producing equipment, designing Indian IP & fortifying supply chains

బీటింగ్ రిట్రీట్ వేడుక

# విజయ్ చౌక్ సాక్షిగా

## సంప్రదాయం, శౌర్యం, సాంకేతికతల సంగమం




*న్యూఢిల్లీలోని విజయ్ చౌక్‌లో జనవరి 29, 2026 సాయంత్రం జరిగిన బీటింగ్ రిట్రీట్ వేడుక: మధురమైన భారతీయ అద్భుత ప్రదర్శనతో పాటు సైనికుల లయబద్ధమైన కవాతుతో గర్వభావాన్ని రేకెత్తించింది. ఈ కార్యక్రమం ఆపరేషన్ సిందూర్, 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం, భారతదేశ మహిళా క్రికెట్ జట్టు విజయాలు, ఆష్నీ డ్రోన్, భైరవ్ బెటాలియన్, ప్రాచీన 'గరుడ వ్యూహ' యుద్ధ నిర్మాణాన్ని శక్తివంతంగా ప్రదర్శించింది. ఈ బీటింగ్ రిట్రీట్ కవాతు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు, మన గొప్ప సైనిక వారసత్వానికి ఒక విలక్షణమైన ప్రదర్శనగా నిలిచింది...*

*బీటింగ్ రిట్రీట్ వేడుకను చూసేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి*



వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని మనం జరుపుకుంటున్న తరుణంలో, బీటింగ్ రిట్రీట్ 2026లో మన సాయుధ దళాలు దీనిని ప్రదర్శించడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

*– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*




న్యూ ఇండియా సమాచార్ పక్ష పత్రిక

**RNI NO.: DELTEL/2020/78811 FEBRUARY 16-28, 2026**

RNI Registered No DELTEL/2020/78811 (Publishing Date: February 05,2026 Pages-64)

**EDITOR IN CHIEF**
**Dhirendra Ojha**
Principal Director General
Press Information Bureau, New Delhi

**PUBLISHED:**
**Kanchan Prasad**
Director General, on behalf of
Central Bureau Of Communication

**PUBLISHED FROM:**
Room No–278, Central Bureau Of Communication, 2nd Floor, Soochna Bhawan, New Delhi -110003